

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

21-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 171 పేజీలు: 8+4 వెల: 6.50


అయోధ్య సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి: సుప్రీంకోర్టు

5లో

డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ



పోలీసుల లాఠీచార్జ్

కాక్రోచ్ పార్టీ ర్యాలీ ఉద్రిక్తం

ఢిల్లీలో పోటెత్తిన సిజెపి కార్యకర్తలు





ఆందోళనకారులపై బాష్పవాయువు ప్రయోగిస్తున్న పోలీసులు

# అట్టుడికిన ఢిల్లీ

## ఆందోళనకారులపై లాఠీఛార్జి, బాష్పవాయు ప్రయోగం

## కార్యకర్తలను అదుపులోకి తీసుకొన్న పోలీసులు

## సిజెపి ప్రతినిధులతో జెపి నడ్డా చర్చలు

## దీక్షలు విరమించిన వాంగ్‌చుక్, అభిజిత్ దీప్కే

**న్యూఢిల్లీ,జులై 20:** పరీక్షల సంస్కరణలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతాపార్టీ ఢిల్లీలో నిర్వహించిన సంసద్ చలో ర్యాలీ ఉద్రిక్తతల నడుమ కొనసాగింది. దాదాపు 20వేలమందికిపైగా వచ్చారని చెపుతున్న ఈ ర్యాలీకి ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు స్పష్టంచేసారు. అంతేకాకుండా నిషేధాజ్ఞలను ఉల్లంఘించి ర్యాలీ తీసారని పోలీసులు లాఠీ ఛార్జిచేయడంతో ఎక్కడికక్కడ ఆందోళన కారులు చెల్లాచెదురయ్యారు. మరోవైపు పార్లమెంటు స్ట్రీట్‌లోకి >>2

# ఉభయసభల్లో రభస

## చర్చలు లేకుండానే నేటికి వాయిదా

## నీట్ లీకేజ్, అయోధ్య విరాళాల చోరీపై విపక్ష సభ్యుల నిరసనలు



**న్యూఢిల్లీ,జులై 20:** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభం రోజున ఉభయసభల్లో విపక్షాల నిరవధిక నిరసనలతో మారుమోగాయి. నీటిలీకేజిలపై సిజెపి నిరసనలు, అయోధ్య విరాళాల చోరీ వంటి వాటిపై ప్రత్యేక చర్చ జరపాలంటూ విపక్షాలు పట్టుబడుతూ రావడంతో పదేపదే వాయిదా పడుతూ వచ్చాయి. విపక్ష >>2

# ఉత్తరాంధ్ర మణిహారం భోగాపురం ఎయిర్‌పోర్టు

## 1న విమానాశ్రయంతోపాటు ఏవియేషన్ హబ్ వర్సిటీ, ఎడ్యుసిటీని ప్రారంభించనున్న ప్రధాని మోడీ

## ఏర్పాట్లపై సమీక్ష జరిపిన సిఎం చంద్రబాబు

**విజయవాడ. జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆగస్టు 1 తేదీన ప్రధాని మోడీ చేతుల మీదుగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు ప్రధానిమోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను తెలుపుతూ థింసా, సవర, కొమ్ము కోయ తదితర సంప్రదాయ నృత్య రూపాలతో ఘనస్వాగతం పలకాలని తెలిపారు. ఆగస్టు 1తేదీన విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు, జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్ యూనివర్సిటీతోపాటు జీఎంఆర్‌మాన్సాస్ ఎడ్యుసిటీలను ప్రధాని మోదీ లాంఛనంగా ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర మణి హారంగా నిలవనున్న ఈ విమానాశ్రయం లాజిస్టిక్స్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక గేమ్ చేంజర్‌లా మారుతుందని సీఎం స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి లాంటి సదుపాయాలు కల్పించాలన్నారు. రేపటి నుంచి జూలై 31 తేదీ వరకూ అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్ కూడా వేదికగా దీనిని మలచాలని సూచించారు. >>2


# 'ఆక్వా కల్చర్'ను ఆదుకోండి

## సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతివ్వండి

## అమరావతిలో ఎన్ఎఫ్‌డిబి ప్రాంతీయ కార్యాలయం అవసరం

## ప్రాసెస్ చేయని పొగాకుపై జిఎస్టీ తగ్గించాలి

## ముగ్గురు కేంద్ర మంత్రులకు వేర్వేరుగా సిఎం చంద్రబాబు లేఖలు



**విజయవాడ, జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** జన్యుపరంగా మార్పు చేసిన సోయాబీన్ మీల్ ను దిగుమతి చేసుకునేందుకు రొయ్యల మేత తయారీ దారులకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర మత్స్య,పశుసంవర్థకశాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు లేఖ రాశారు. రొయ్యల మేత తయారీలో ప్రధాన ముడిసరుకైన సోయాబీన్ మీల్ ధరలు విపరీతంగా పెరగడంతో, మేత తయారీ ఖర్చులు పెరిగాయని వివరించారు. దీనివల్ల రొయ్యల రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని సీఎం స్పష్టం చేశారు. దేశంలో రొయ్యల మేత కొరతను తీర్చేందుకు, ధరల నియంత్రణకు సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇవ్వాలని కోరారు. 2021లోనూ రొయ్యల మేత తయారీదారులకు పరిమిత స్థాయిలో దిగుమతి చేసుకునేందుకు అనుమతులిచ్చారని లేఖలో పేర్కొన్నారు. ఈక్వెడార్ నుంచి పెరిగిన రొయ్యల ఉత్పత్తి, ఎగుమతుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లలో దేశీయ ఉత్పత్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. అమెరికా, చైనా , యూరోప్ లాంటి ప్రధాన మార్కెట్లలో భారతీయ రొయ్యల ఎగుమతులు తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాయని సీఎం తన లేఖలో వివరించారు. జన్యుమార్పిడి చేసిన సోయాబీన్‌ను వ్యవసాయానికి, విత్తన ఉత్పత్తికి వినియోగించే అవకాశం లేదని తద్వారా జీవ వైవిధ్యానికి దేశీయ వంగడాలకు ముప్పు లేదని సీఎం వివరించారు. ప్రభుత్వం సోయాబీన్ మీల్ దిగుమతికి అనుమతి ఇస్తే రొయ్యల మేత పరిశ్రమకు నాణ్యమైన ముడిసరుకు అందుబాటులోకి వస్తుందని సీఎం స్పష్టం చేశారు. లక్షలాది మంది రొయ్యల రైతులు, కార్మికులకు ఉపాధి కలుగుతుందని, తద్వారా విదేశీ మారకద్రవ్యం లభిస్తుందన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ఆక్వా రంగాన్ని మరింత అభివృద్ధి చేయటంతో పాటు ఎప్పటికప్పుడు సహకారం అందించేందుకు వీలుగా జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు కార్యాలయం అమరావతిలో ఏర్పాటు చేయాలని సీఎం మరో లేఖలో మంత్రిని కోరారు. ఈ ఏడాది జూన్ 5 తేదీన విశాఖలో జరిగిన సీఫుడ్ ఎక్స్ పోర్ట్స్ వర్క్ షాప్ లో అమరావతిలో ఎన్ఎఫ్ డీబీ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు అమరావతిలోని నెక్కల్లు గ్రామంలో 7.89ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్ఎఫ్‌డీబీ ప్రాంతీయ కార్యాలయం, శిక్షణకేంద్రం, పార్క్, ప్రజల సందర్శనార్థం అక్వేరియం ఏర్పాటు కోసం కేటాయించామన్నారు. తక్షణం ఈ భూమిని స్వాధీనం చేసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. 2028 నాటికల్లా ప్రాంతీయ కార్యాలయం, అక్వేరియం, శిక్షణా కేంద్రాల పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని కోరారు. ఈ ప్రాంతీయ కేంద్రం బ్లూ ఎకానమీ అభివృద్ధికి ప్రధాన కేంద్రంగా మారుతుందన్నారు.

అక్వా కల్చర్ రంగాన్ని కాపాడేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ కు ముఖ్యమంత్రి లేఖ రాశారు. ఈక్వెడార్ నుంచి అమెరికా, చైనా, యూరోప్ లాంటి దేశాలకు ఎగుమతులు పెరగటంతో అంతర్జాతీయ మార్కెట్లో రొయ్యల ధరలు గణనీయంగా పడిపోయాయని తెలిపారు. దేశంలో ఫిష్ మీల్ లభ్యతను క్రమబద్ధీకరించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర వాణిజ్య మంత్రిని సీఎం కోరారు. ప్రస్తుతం రొయ్యల ఫీడ్ లో ఉపయోగించే చేప పొడిని 5 శాతం ప్రోత్సాహకాలతో ఎగు మతికి అనుమతిస్తున్నారని ముఖ్యమంత్రి తెలిపారు. >>2



# త్రిపుర డిజిపి ఆత్మహత్య

## తన ఛాంబర్‌లోనే తుపాకీతో కాల్చుకున్న వైనం

**అగర్తలా,జులై 20:** త్రిపుర రాష్ట్ర పోలీసు శాఖలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ), 1994 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అనురాగ్ సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. అగర్తలలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్‌లోనే ఆయన తుపాకితో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. డీజీపీ అనురాగ్ తన కార్యాలయంలోని బాత్రూంలో తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. హుటాహుటీన ఆయన్ను సమీపంలోని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆయన తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. అయితే,ఈ అఘాయిత్యానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనపై త్రిపుర ప్రభుత్వం కానీ, పోలీసు ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి మాణిక్ సాహా వెంటనే పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చేరు కుని పరిస్థితిని సమీక్షించారు. >>2

# గర్భిణులు, నవజాత శిశువుల కోసం తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

## అన్ని సౌకర్యాలతో త్వరలో 500 వాహనాలు రెడీ, యేటా దాదాపు 2.75 లక్షల మందికి ప్రయోజనం



సోమవారం తల్లీ-బిడ్డ ఎక్స్‌ప్రెస్ నూతన వాహనాలను పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 20, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మాతా-శిశు సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోన్న ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు మరింత నాణ్యమైన, సురక్షితమైన రవాణా సేవల్ని అందించేందుకు కొత్తగా తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలను అందుబాటులోకి తెస్తోంది. ఈ వాహనాలను సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం క్యాంపు కార్యాలయంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కార్యక్రమం కోసం సిద్ధం చేసిన వాహనాల రూపకల్పన, భద్రతా ప్రమాణాలు,తల్లి-శిశువులకు కల్పించిన ప్రత్యేక సౌకర్యాలు, వాహనాలపై రూపొందించిన బ్రాండింగ్ నమూనాలను ముఖ్యమంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఈ సేవలపై స్పష్టమైన అవగాహన కలిగేలా, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాన్ని ప్రతిబింబించేలా రూపొందించిన బ్రాండింగ్ డిజైన్లకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, వారి నవజాత శిశువులు, సహాయకులను ఉచితంగా వారి ఇళ్లకు చేర్చడంతో పాటు అధిక ప్రమాద గర్భిణులు, తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రులకు వచ్చే గర్భిణులకు ఈ వాహనాలతో రవాణా సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమం కోసం రాష్ట్రవ్యాప్తంగా 500ప్రత్యేక ఎస్ఎవి/ఎంయువి వాహనాలను వినియోగించనున్నారు. ప్రతి సంవత్సరం సుమారు 2.75 లక్షల మంది బాలింతలు ఈ సేవల ద్వారా ప్రయోజనం పొందనున్నారు.

**రియల్ టైమ్ పర్యవేక్షణకు జీపీఎస్ వ్యవస్థ:** వాహనాల్లో తల్లీ-శిశువుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా సౌకర్యాలను కల్పించారు. వెనుక సీట్లలో సీటు బెల్టులు, బాలింతలు సులభంగా ఎక్కేందుకు ఫుట్‌రెస్ట్, ఎయిర్ కండిషనింగ్, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా ప్రతి వాహనంలో జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ ఏర్పాటు చేయడం ద్వారా రియల్ టైమ్ పర్యవేక్షణకు అవకాశం కల్పించారు. వాహనాల పరిశీలన సందర్భంగా అధికారులు >>2

# మునికూడలికి మోడల్ పుష్కర్ పంచాయతీ హంగులు: డి.సిఎం పవన్




**విజయవాడ.జులై20,ప్రభాతవార్తప్రతినిధి:** స్వచ్ఛగోదావరి -పవిత్ర పుష్కరాలు అనే థీమ్‌తో గోదావరి పుష్కరాలకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా, సీతానగరం మండలం పరిధిలోని మునికూడలిని మోడల్ పుష్కర్ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు సుమారు రూ.7 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. డీసీఎం పవన్ కల్యాణ్ నిరంతర పర్యవేక్షణలో ఈ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. మునికూడలి గ్రామం మరియు సప్త ఋషి ఘాట్‌ను పర్యావరణహితంగా, జీరో లిక్విడ్ డిశ్చార్జ్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయడానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. మునికూడలి మోడల్ పుష్కర్ పంచాయతీ పనుల పురోగతిపై సోమవారం >>2

## ట్రైనీ ఐపిఎస్‌పై లైంగిక వేధింపుల కేసులో

# ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం



## జాతీయ పోలీసు అకాడెమీ నుంచి సస్పెన్షన్

## అతడు సూసైడ్‌కు యత్నించలేదని వైద్యుల నివేదిక

**హైదరాబాద్, జులై 20, ప్రభాతవార్త:** లైంగిక వేధింపుల కేసులో నిందితుడుగా వున్న ట్రైనీ ఐపిఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి ఉదంతంలో ట్విస్ట్ నెలకొంది. ఈ ఘటన వెలుగు చూసిన తరువాత అవమాన భారంతో ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా అతని సోదరుడు వెంటనే ఆసుపత్రికి తరలిం చడంతో కోలుకుంటున్నాడు.ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కేంద్ర శిక్షణ వ్యవహారాల శాఖ (డిఓపిటి) దీని పై జాతీయ పోలీసు అకాడమి నుంచి అత్యవసరంగా నివేదిక తెప్పించుకున్నట్లు తెలిసింది. మరోవైపు ఎన్‌పిఎ అధికారులు ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు. దీనిపై డిఓపిటికి వెంటనే నివేదిక పంపారని తెలిసింది. ఇంకోవైపు ఆత్మహత్యాయత్నానికి పా ల్పడ్డ ఉదయ్ కృష్ణారెడ్డి వాట్సాప్ ద్వారా ఒక లేఖ విడుదల చేసినట్లు వార్తలు వస్తున్నాయి. మహిళా అధికారిణిని తాను వేధించలేదని, ఆమె తన గదికి వచ్చిందని, తనను ఇబ్బంది పెట్టిందని, దీనిపై తన వద్ద అన్ని ఆధారాలు వున్నాయని, ఈ విషయంలో తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, నిజాలు నిలకడగా బయటకు వస్తాయని అందులో వుంది. కాగా ఈ వాట్సాప్ లేఖపై పోలీసులు ఆరా తీస్తున్నారు. దేశ వ్యాప్తం గా సంచలనం రేపిన జాతీయ పోలీసు అకాడమిలో ట్రైనీ >>2

# మద్యం టెండర్లలో రూ.192కోట్ల దోపిడి: సిట్

**విజయవాడ.జులై20.ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్లలో రూ.192 కోట్ల దోపిడీ జరిగిందని వాసుదేవరెడ్డి రిమాండ్ రిపోర్టులో సిట్ పేర్కొంది. ప్రభుత్వ అనుమతి లేకుండానే పక్కా ప్రణాళికతో టెండర్ల విధానాన్ని మార్చారని తెలిపింది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు బినామీ కంపెనీలను తెరపైకి తెచ్చారని వివరించింది. రవాణా ఛార్జీని కిలోమీటరుకు రూ.19.68 నుంచి రూ.35కు పెంచారని పేర్కొంది. టెండర్లు లేకుండానే సిగ్మా గడువును నాలుగుసార్లు పొడిగించారని, అప్పటి డిప్యూటీ సీఎం అభ్యంతరాలను కూడా బేఖాతరు చేశారని సిట్ వెల్లడించింది. షెల్ కంపెనీల ద్వారా నిధులు మళ్లించారని, వాసుదేవరెడ్డి బావమరిదికి చెందిన మిల్క్ కంపెనీకి అక్రమ సొమ్ము బదిలీ అయిందని తెలిపింది. దీనికి సంబంధించిన డిజిటల్, కాల్ డేటా ఆధారాలను సేకరించినట్లు వివరించింది.



సోమవారం ప్రధాని పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజి గోపీనాథ్ జట్టి

# ప్రధాని పర్యటనకు భారీ భద్రత

## భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి రానున్న మోడీ

### ఏర్పాట్లు పరిశీలించిన విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జట్టి

**విజయనగరం, జూలై 20 ప్రభాతవార్త:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ యన గరంజిల్లా భోగాపురం మండలంలోని అల్లూరి సీతారామరాజు ఇం టర్నేషనల్ ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ఆగస్టు 1న విచ్చేస్తున్న సందర్భంగా క్షేత్రస్థాయిలో సభా వేదిక, పార్కింగ్, ప్రజా రవాణా, కాన్వాయ్ వెళ్లే మార్గాలను మరియు భద్రత, బందోబస్తు ఏర్పాట్లను విజయనగరం ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ మరియు ఇతర పోలీసు ఉన్నతాధికారులతో విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి జూలై 20న పర్యవేక్షించి, అధికారులకు భద్రత పరమైన సూచనలు చేసారు. అనంతరం విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి బందోబస్తు, భద్రత విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై, నిర్వహించాల్సిన విధులు, తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తల గురించి వివరించారు. జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ రూట్ మ్యాపును ప్రెజెంటేషన్ ద్వారా పోలీసు అధికారులకు వివరించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటనలో భాగంగా ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్, ప్రజా వేదికను సందర్శించి, నిర్మాణ పనులను, ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత అధికారులకు విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ పలుసూచనలు చేసారు. బందోబస్తును సెక్టార్లుగా విభజించి ఐపిఎస్ సభకు హాజరయ్యే ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విశాఖపట్నం రేంజ్ ఐజిపి, గోపీనాథ్ జట్టి, ఐపిఎస్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం ఎస్పీ కే. వి. మహేశ్వర రెడ్డి, అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం అదనపు ఎస్పీలు, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# అట్టుడికిన ఢిల్లీ

>> పెద్ద ఎత్తున సీజేపీ కార్యకర్తలు వచ్చి వర్షంలోనూ ఆందోళన కొనసాగించారు. ఈక్రమంలో వారిపై పోలీసులు లాఠీఛార్జ్ చేశారు. పోలీసులపైకి ఆందోళనకారులు వాటర్ బాటిళ్లు, చెప్పులు విసిరారు. తోపులాటలో పోలీసులు, ఆందోళనకారులు గాయాలయ్యాయి. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రంగా స్పందిస్తున్నాయి. నిరాహార దీక్షను విరమించిన కొద్ది సేపటికే అభిజీత్ దీప్కేను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సీజేపీ తెలిపింది. అయితే అభిజీత్ దీప్కేను అదుపులోకి తీసుకున్నారని వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. ఆ వార్తలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. మరోవైపు శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై పోలీసులు దారుణంగా దాడి చేస్తున్నారని, విద్యార్థులకు ఎంపీలు మద్దతు ఇవ్వాలని సీజేపీ ప్రతినిధి సారవ్ దాస్ కోరారు. చర్చలకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉండగా ఢిల్లీలో ఆందోళనలు మధ్యే సీజేపీ ప్రతినిధులు కేంద్రమంత్రి జేపీ నడ్డాను కలిశారు. జేపీ నడ్డా ఆహ్వానం మేరకే ఆయన్ను కలిశామన్నారు సిజెపి ప్రతినిధి సారవ్ దాస్. తమ డిమాండ్లకు సంబంధించి వినతిపత్రం అందించామని తెలిపారు. నిరాహార దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్‌చుక్ తక్షణమే వైద్యసహాయం అందేలా చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశామన్నారు. ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న నీట్ అభ్యర్థులకు కోటి రూపాయల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరినట్లు సిజెపి ప్రతినిధులు తెలిపారు. ఈ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో చర్చించేందుకు కొంత సమయం ఇవ్వాలని నడ్డా విజ్ఞప్తి చేశారని వివరించారు. మరోవైపు ఆందోళనలు విరమించి ఢిల్లీలో సాధారణ పరిస్థితులు నెలకొనేందుకు సహకరించాలని సిజెపి ప్రతినిధులను నడ్డా కోరారు.

**జెపినడ్డాతో సిజెపి ప్రతినిధుల చర్చలు:** కేంద్ర ఆరోగ్యమంత్రి జెపినడ్డాను కలిసి సిజెపి ప్రతినిధులు సారవ్‌దాస్ మరికొంత కలిసి చర్చలుజరిపారు. ప్రభుత్వం అంతర్గతంగా చర్చించి చర్యలు తీసుకునేందుకు సమయకత్తులా కృషిచేస్తామని మంత్రి సిజెపి ప్రతినిధులకు హామీ ఇచ్చారు. తమ ప్రధాన డిమాండ్లతోకూడిన పత్రాన్ని ఈసందర్భంగా సిజెపి ప్రతినిధులు కేంద్రమంత్రి నడ్డాకు అందచేసారు. ఆందోళన కారుల ప్రతినిధులనుంచి తమకు వినతిపత్రం అందిందని కూడా ఈసందర్భంగా మంత్రి నడ్డా సోషల్‌మీడియాలోప్రకటించారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్‌తో చర్చలుజరిపారు. సుదీర్ఘచర్చలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**మోడీసర్కార్‌పై ఖర్గే విమర్శలు:** విద్యార్థులపై లాఠీఛార్జ్‌ను ప్రజాస్వామ్యంపై దాడిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభివర్ణించారు. సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన వారిపై దాడి చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదని అన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో మాట్లాడిన ఆయన, నీట్ ప్రశ్న పత్రంతో లక్షలాది మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యాయని తెలిపారు. అయోధ్యలో విరాళాల చోరీపై ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించాలని ఖర్గే డిమాండ్ చేశారు. విద్య విధానంలో అనేక సమస్యలు ఉన్నాయని ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. వాటిపై చర్చ జరపకుండా విద్యార్థులపై ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ శశి థరూర్ కూడా స్పందిస్తూ సీజేపీ నిరసనలపై కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న యువతపై లాఠీఛార్జ్ చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. చర్చలకు ప్రభుత్వం నిరాకరించడం వల్లే ఈ ఆందోళనలు, అవాంతరాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో యువత తమ అసంతృప్తిని, కోపాన్ని వ్యక్తం చేయడానికి ఒక వేదిక ఉండాలని, ఆందోళనలను బలప్రయోగంతో అణచివేయడం సరికాదని ఆయన హితవు పలికారు.

**యువత డిమాండ్లను వినాలి: కేజ్రీవాల్**

ఈ ఘటనపైన ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. లక్షలాది మంది యువత న్యాయం కోసం వీధుల్లోకి వస్తే వారి మాట వినాల్సిందిపోయి లాఠీఛార్జీకు ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ప్రభుత్వం అహంకారాన్ని విడిచిపెట్టి యువత డిమాండ్లను వినాలని, ఇంటర్నెట్ సేవలు నిలిపివేయడం, పార్లమెంట్ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కూడా నిరసనకారుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. యువత లేవనెత్తుతున్న అంశాలపై చర్చించి పరిష్కారం చూపాలని సూచించారు.

**దీక్ష విరమించిన వాంగ్‌చుక్**

మరోవక్క సఫ్దర్ జంగ్ ఆసుపత్రిలో చేరిన సోనమ్ వాంగ్‌చుక్ జెపినడ్డాను సిజెపి ప్రతినిధులు కలిసి డిమాండ్ పత్రం ఇవ్వడంతో దీక్షను విరమించుకుంటున్నట్టు ప్రకటించారు. అలాగే జంతర్‌మంతర్‌వద్ద ఆమరణ దీక్షకు ఉపక్రమించిన సిజెపి చీఫ్ అభిజీత్ దీప్కే కూడా తన దీక్షను విరమిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతచర్చలపరంగాగోట్ వల్ల ఆత్మహత్యలపాలయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని, విద్యామంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామాచేయాలని ప్రధాన డిమాండ్లపైనా వారు ఆరోగ్య మంత్రి జెపినడ్డాకు వినతిపత్రం ఇచ్చారు.



# రాష్ట్ర వ్యాప్తంగా నిలిచిన భూముల రిజిస్ట్రేషన్లు

## దస్తావేజు లేఖరుల సమ్మె

**విజయవాడ,జూలై 20 ప్రభాతవార్త:** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖరులు ఆందోళన చేపట్టారు. సోమవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని దస్తావేజు లేఖరులు నిర్ణయించి ఆందోళనలు చేపట్ట డంతో భూముల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణకు ఉతతమ స్తున్న జీవో నెంబర్ 369 ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ వలన దస్తావేజు లేఖరుల ఉపాధి దెబ్బతినడంతో పాటుగా ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన ఆస్తుల దస్తావేజులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం వలన ఆస్తి వివాదాలు, భూ కబ్జాలు అధికమై పోతాయని, భూ రికార్డుల తారుమారు చేయడానికి అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ చేస్తే సామాన్య ప్రజలకు రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరుగుతాయి. అవినీతి పెరిగే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని దస్తావేజు లేఖరులు హెచ్చరించారు.

# 'ఆక్వా కల్చర్'ను ఆదుకోండి

>> ఈ కారణంగా దేశీయ ఫీడ్ తయారీ దారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేయాల్సి వస్తోం దన్నారు. డిజిఎఫ్‌టి ద్వారా ఎగుమ తులను నియంత్రించాలన్నారు. దేశీయ రొయ్యల ఫీడ్ తయారీ దారుల అవసరాలు తీరిన తర్వాతే ఎగుమతులకు అనుమతించాలని కోరారు. జీఎం సోయాబీన్ మీల్ దిగుమతికి కూడా అనుమతి ఇవ్వాలన్నారు.

ఏపీ నుంచి ఎఫ్‌సీవీ పొగాకు ఎగుమతులకు ప్రోత్సాహకాలు కల్పించాలని కేంద్ర మంత్రిని ముఖ్య మంత్రి కోరారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు ఉపాధి కల్పిస్తూ విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించేందుకు దోహదపడుతోందని సీఎం వెల్లడించారు. దేశంలోని పొగాకు ఉత్పత్తిలో ఎఫ్‌సీవీ పొగాకు 70శాతం మేర ఎగుమతి అవుతోందని సీఎం వెల్లడించారు. జింబాబ్వే, టాంజానియా లాంటి దేశాల్లోని ఎగుమతి దారులకు ఆయా దేశాలు రాయితీలు, సుంకాల మినహాయింపు ఇస్తున్నాయని తెలిపారు. భారతీయ పొగాకు ఎగుమతిదారులకు ఎలాంటి మద్దతు లేకపోవటంతో తీవ్రమైన పోటీ ఎదుర్కొం టున్నారని అన్నారు. ఆగస్టు 2021లో రోడ్‌టెప్ పథకం కింద టీ, కాఫీ, మసాలా దినుసులు లాంటి వ్యవసాయ వస్తువులను చేర్చినప్పటికీ... ప్రాసెస్ చేయని పొగాకును (హెచ్ఎస్ కోడ్ 2401) మాత్రం ఈ జాబితాలో చేర్చలేదన్నారు. తక్షణమే ప్రాసెస్ చేయని పొగాకు(హెచ్ఎస్ కోడ్ 24012401 10, 2401 20,2401 30) రకాలను ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో పాటు పథకం కింద ప్రయోజనాలు వర్తింపజేయాలని సీఎం కోరారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుపై రూ.5 లక్షల టాప్ అప్ ఇవ్వండి:** ఆక్వా కల్చర్ రంగాన్ని ఆదుకునేలా ఆక్వా కల్చర్ ఏరియేటర్లపై జీఎస్టీని 18నుంచి 5 శాతానికి తగ్గించాలని ముఖ్యమంత్రి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. కేంద్రమంత్రికి లేఖ రాసిన సీఎం భారత అమెరికా వాణిజ్య ఒప్పం దంతో ఆక్వా దిగుమతులపై సుంకం 10శాతానికి తగ్గినా ఇంకా చట్టపరమైన అనిశ్చితి కొనసాగుతోందని టారిఫ్ సంక్షోభంపై కేంద్ర ఆర్థికశాఖ జోక్యం చేసుకోవాలని సీఎం కోరారు.కిసాన్ క్రెడిట్‌కార్డు పై రూ. 5లక్షల వరకూ వన్ టైమ్‌టాప్‌అప్ ఇవ్వాలని సీఎం కేంద్ర ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశీయ మార్కె టింగ్ కోసం ఎన్ఎఫ్‌డీబీ ద్వారా రూ.100 కోట్ల కార్పస్ ఫండ్ ను ఏర్పాటు చేయాలని సీఎం కోరారు.



సోమవారం అధికారులతో చర్చిస్తున్న సిఎం చంద్రబాబు

# గిరిజన సంఘాలతో ప్రభుత్వం త్వరలో చర్చలు: సిఎం చంద్రబాబు

## జోన్ 1లోకి అల్లూరి, జోన్ 2లోకి పోలవరం జిల్లా

**విజయవాడ జూలై 20,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తుందని...ఈ విషయంలో గిరిజన ప్రజలు ఎటువంటి ఆందోళనకు, అనుమానాలకు గురి కావాల్సిన అవసరం లేదని సిఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి ఆ శాఖ అధికారులుతో సచివాలయంలో సోమవారం సమీక్ష చేశారు. జీవో నెంబర్ 3 పై గత ప్రభుత్వంలో సుప్రీంకోర్టు తీర్పు, తదనంతర పరిణామాలపై చర్చించారు. స్థానికులకే ఉద్యోగాలు దక్కడం సహా పలు అంశాలపై గిరిజన ప్రజల ఆకాంక్షలపైనా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో 2000 సంవత్సరంలో జీవో నెంబర్ 3 తీసుకువచ్చాం. దీని ద్వారా షెడ్యూల్ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే 100 శాతం రిజర్వేషన్లు దక్కేలా చూశాం. దాదాపు 20 ఏళ్ల అమల్లో ఉన్న ఈ ఉత్తర్వును గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. నాటి ప్రభుత్వం ఈ అంశంపై బలమైన వాదనలు వినిపించకపోవడం వల్ల సుప్రీంకోర్టు 2020 ఏప్రిల్ 22న కొట్టేసింది. దీంతో రెండు దశాబ్దాల పాటు గిరిజనులు పొందిన ప్రయోజనాలు కొనసాగించే వీలు లేకుండా పోయింది. నాటి ప్రభుత్వం ఈ సమస్యపై కనీసం స్పందించలేదు. జీవో నెంబర్ 3కి ఉన్న అన్ని ప్రత్యామ్నాయ అవకాశాలను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది. సుప్రీంకోర్టు 5గురు సభ్యుల ధర్మాసనం స్పష్టమైన తీర్పు నేపథ్యంలో ఏ విధంగా న్యాయం చేయాలనే దానిపై కసరత్తు చేస్తున్నాం." అని అన్నారు. స్థానికులకే ఉద్యోగాలు అంశంతో పాటు...గిరిజనులకు సంబం ధించి పలు సమస్యలపై గిరిజన సంఘాలతో వెంటనే చర్చించాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా అంశాలపై గిరిజన సంఘాలను ఆహ్వానించి...ఉన్నతాధికారులు, గిరిజన ప్రజా ప్రతినిధులు చర్చించాలని సూచించారు. అదే విధంగా అల్లూరి సీతారామరాజు జిల్లాను జోన్ 1లోకి మార్చాలని, పోలవరం జిల్లాను జోన్ 2లో చేర్చాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

# మునికూడలికి మోడల్ పుష్కర్

>> డీసీఎం పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే, కమిషనర్ కృష్ణ తేజలతో సమీక్షించారు. ఈ సందర్భంగా మునికూడలి గ్రామ పంచాయతీ పరిధిలో ఉప ముఖ్యమంత్రివర్యుల చొరవతో సాగుతున్న అభివృద్ధి పనుల ప్రస్తుత స్థితిని అధికారులు వివరించారు. గోదావరి పుష్కరాలకు వచ్చే యాత్రికులు ఎలాంటి అసౌకర్యం లేకుండా సప్త ఋషి ఘాట్‌కు చేరుకునేందుకు గ్రామం మధ్య నుంచి ఘాట్ వరకు ఉన్న మార్గాన్ని అభివృద్ధి చేసి సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. ఈ పనులు దాదాపు పూర్తయ్యాయి. అలాగే ఘాట్ ప్రాంతంలో నీటి ప్రవాహాలు, తడి కారణంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా 3.5 మీటర్ల వెడల్పుతో కాంక్రీట్ ప్లాట్‌ఫారమ్ నిర్మాణం చేపట్టగా, ఈ పనులు కూడా చివరి దశకు చేరుకున్నాయి. సప్త ఋషి ఘాట్ పరిసరాలను రాత్రి వేళల్లో సైతం సురక్షితంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు హైమాస్ట్ విద్యుత్ దీప స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు అవసరమైన సిమెంట్ పునాది నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. విద్యుత్ శాఖకు సంబంధించి రూ. 1.50 కోట్లు పనులు పూర్తయ్యాయి. అందులో మెరుగైన విద్యుత్ సరఫరా కోసం ఆరు ట్రాన్స్ ఫార్మర్లు, నూతన విద్యుత్ లైన్లు, స్తంభాలు తదితర పనులు దాదాపు పూర్తయ్యాయి.

# ఉభయసభల్లో రభస

>> సభ్యులు నీట్‌పేపర్ లీక్‌పైనా, అయోధ్యపైనల ప్లకార్డులు చేతపట్టి మరీ తమ నిరసనలను కొనసాగించారు. సమావేశాల ప్రారంభంలోనే నిరసనలు ఎదురవడంతో పార్లమెంటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు ఇలాగే నిరసనలు కొనసాగిస్తే సభను సజావుగా కొనసాగించడం కష్టం అవుతుందని విజ్ఞప్తిచేయడం కనిపించింది. స్పీకర్‌స్థానంలో దిలీప్ సైకియా ఉన్న సమయంలోనే మధ్యాహ్నం మళ్లీ లోక్‌సభ ప్రారంబం అయింది. సభ్యులు తమ సీట్లలో కూర్చోవాలని స్పీకర్ పదేపదే విజ్ఞప్తిచేసినా సభ్యులు చర్చలు జరపాల్సిందేననంటూ పట్టుబట్టారు. ఇప్పటికే అనేక కీలక అంశాలపై చర్చించాల్సి ఉందని, మీకు ఆసకినత కనిపించడంలేదని, ప్రజల సమస్యలు చర్చించడం మీకు ఇష్టం లేదని, ఇది సరైన పద్ధతి కాదని, మీరు పదేపదే సభకు అంతరాయం కలిగిస్తునాననరంటూ కేంద్ర మంత్రి విపక్ష సభ్యులనుద్దేశించి మాట్లాడతంతో మరింతగా నిరసనలు హోరెత్తాయి. సభలో బ్యానర్లు, ప్లకార్డులు ప్రదర్శించడం అనుమతించబోమని అన్నారు. నిరసనలమధ్యలోనే న్యాయశాఖమంత్రి సుప్రీంకోర్టు జడ్జిల సంఖ్యను 34 ఉంచి 38కి పెంచేందుకు నిర్దేశించిన బిల్లును ప్రవేశపెట్టారు. అయితే నిరసనలమధ్య ఈ బిల్లుకు సానుకూలత రాలేదు. రాజ్యసభలో కూడా ఇదే విదంగాపదేపదే వాయిదాలు పడుతూ వచ్చింది. నీట్‌పేపర్ లీకేజిలపై ఢిల్లీలోనిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులపై లాఠీ ఛార్జి చేయడాన్ని విపక్ష పార్టీలన్నీ తీవ్ర నిరసన తెలుపుతూ నినాదాలుచేసాయి. ఎలాంటి కార్యకలాపాలు లేకుండానే ఉభయసభలు తొలిరోజు వాయిదా పడ్డాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలోని విపక్షాలు పేపర్‌లీక్ వివాధంలో నిందితులపై చర్యలు ఏమయ్యాయంటూ నిలదీసారు. అనేకమంది యువత శాంతియుత నిరసనను అర్థంచేసుకోకుండా లాఠీ ఛార్జిచేసారని ఆరోపించారు. డిప్యూటి ఛైర్మన్ హరివంశ్ స్పందించి సభ్యులకు బిఎసి నిర్ణయాలను వివరించబోయారు. దీనిపై చర్చించేందుకు ప్రభుత్వానికి సమయం కూడా కేటాయించామని చెప్పినా విపక్షసభ్యులునినాదాలు హోరెత్తించారు. సమావేశాలుప్రారంభంలో ఉభయసభల్లోను ఖతార్ షేక్ మహమద్‌బిన్ ఖలీఫా అల్‌థాని మృతికి సంతాపం ప్రకటిస్తూ మౌనం పాటించారు. రాజ్యసభలో ఎఐసిసి అధ్యక్షుడు సభాపక్షనేత మల్లిఖార్జున్ మాట్లాడుతూ మీకు పరీక్షలు నిర్వహించడం చేతకాకపోతే కుర్చీ దిగిపోవాలని విమర్శించారు. శాంతియుత నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీ ఛార్జిచేయించిందని ఆరోపించారు. స్పీకర్‌స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ సభ్యుల వైఖరికి తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసారు. జీరోఅవర్ ప్రశ్నోతరాల చర్చలను కొనసాగించాలని కోరినా సభ్యులు వినలేదు. దీనితో సభ మూడు గంటలవరకూ వాయిదా వేసారు. బిజినెస్ అడ్వయిజరీ కమిటీలో చర్చించిన అంశాలనే సభలో చర్చకు వస్తున్నాయని సభ్యులు సహకరించాలని అటు రాజ్యసభ ఛైర్మన్ సిపిరాధాకృష్ణన్, ప్యానెల్ స్పీకర్‌లు దిలీప్‌సైకియా, జగదాంబికా పాల్‌లు పదేపదే విజ్ఞప్తిచేసినా విపక్ష సభ్యులు తాజా సమస్యలపై చర్చకు రావాల్సిందేనని పట్టుబట్టడంతో సభ తొలిరోజు ఎలాంటి చర్చలులేకుండానే వాయిదాపడింది.

# ఉత్తరాంధ్ర మణిహారం భోగాపురం ఎయిర్ పోర్టు

>> మంగళవారం నుంచి చేపట్టే కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు అంతా హాజరు కావాలని సీఎం నిర్దేశించారు. ఈసమీక్షకు హోం మంత్రి అనిత, సీఎస్ సాయిప్రసాద్, ఐఅండ్ఐ ప్రత్యేక ప్రధానకార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.

# బాధితురాలి ఫిర్యాదు మేరకు చట్టపరమైన చర్యలు

## గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



**గుంటూరు క్రైమ్,జులై20,ప్రభాతవార్త:** గుంటూరు జిల్లా నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణబాబు కాలనీలో జరిగిన ఘటనకు సంబంధించి బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు చట్టపరమైన చర్యలు వేగంగా చేపట్టినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఈ ఘటనపై ఈ నెల 16వ తేదీన పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది. ఫిర్యాదుదారు గాయాలకు చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లి తిరిగి పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా క్రైమ్ నెం. 268/2026 కింద సెక్షన్లు 331(6), 79, 115(2), 118(1) r/w 3(5) బీఎన్ఎస్ ప్రకారం కేసు నమోదు చేశారు. సంఘటనలో పాల్గొన్న తొమ్మిది మంది నిందితులను గుర్తించి అరెస్ట్ చేసి,అవసరమైన రికార్డులు సిద్ధం చేసి కోర్టులో హాజరుపరచగా,న్యాయస్థానం వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ కేసులో చట్టపరిధిలో తీసుకోవాల్సిన అన్ని చర్యలను పోలీసులు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంపాలెం సీఐ సత్యనారాయణను సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు.అయితే కొందరు వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా బాధిత మహిళకు సంబంధించిన వీడియోలను సోషల్ మీడియా వేదికల్లో షేర్ చేస్తూ ఆమె ఆత్మగౌరవానికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై క్రైమ్ నెం. 273/2026 కింద సెక్షన్ 67 ఐటీ యాక్ట్ ప్రకారం మరో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.తమ స్వార్థ ప్రయోజనాల కోసం అసత్య ప్రచారాలు చేయడం,బాధిత మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేయడం,ఆమె గౌరవానికి భంగం కలిగించే వీడియోలను ప్రసారం చేయడం లేదా సోషల్ మీడియాలో షేర్ చేయడం వంటి చర్యలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.

# ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం

>> మహిళా ఐపిఎస్ అధికారిణిపై సహచర ట్రైనీ ఐపిఎస్ అధికారి లైంగి క వేధింపుల కేసు సోమవారం మరో మలుపు తిరిగింది. ఆదివారం సాయంత్రం వెలుగు చూసిన ఈ ఘటన పోలీసు వర్గాలను షాక్‌కు గురిచే యడం తెలిసిందే. శిక్షణలో వున్న కర్నాటకు చెందిన మహిళా ఐపిఎస్ అధికారిణిని ఎపికి చెందిన ట్రైనీ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదుపై నగర పోలీసు విభాగంలోని అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం విదితమే. ఈ నెల తొమ్మిదవ తే దీన తనపై ఉదయ్ కృష్ణారెడ్డి భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, కత్తితో చంపుతానని బెదిరించినట్లు ట్రైనీ మహిళా అధికారిణి పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు ఉదయ్ కృష్ణారెడ్డిపై బిఎన్ఎస్ 74,75,77, 315(2) సెక్షన్లతో పాటు ఐటి చట్టంలో ని 66 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. దీనిపై మీడియాలో వార్తలు రావడంతో ఢిల్లీలోని డిఓపిటి అధికారులు ఎన్‌పిఎ అధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకుని వెంటనే నివేదిక తెప్పించుకున్నట్లు సమాచారం. దీని తరువాత ఉదయ్ కృష్ణారెడ్డిని అకాడమి నుంచి ఉన్నతా ధికారులు తాత్కాలికంగా బయటకు పంపి అనంతరం సస్పెండ్ చేయగా ఆయన నగరంలోని మోతీనగర్‌లో గల తన సోదరుడి ఇంటికి వెళ్లిన ట్లు తెలిసింది. దీనిపై ఓవైపు పోలీసుల విచారణ కొనసాగుతుండగానే సోమవారం ఉదయం ఉదయ్ కృష్ణారెడ్డి తన సోదరుడి ఇంట్లో గుర్తు తె లియని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా సోదరుడు ప్రణయ్ కృష్ణారెడ్డి వెంటనే ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించాడు. అక్కడ వైద్యులు ఉదయ్ కృష్ణారెడ్డి అ త్యవసర చికిత్స అందించడంతో కోలుకున్నాడు. ఉదయ్ కృష్ణారెడ్డి ఆరోగ్యం బాగానే వుందని వైద్యులు తెలిపారు. దీనిపై ఎస్ఆర్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టినట్లు తెలిసింది. ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నంపై ఎస్ఆర్ నగర్ పోలీసులు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఉదయ్ కృష్ణారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

ఇదిలావుండగా జాతీయ పోలీసు అకాడమి నుంచి ఉదయ్ కృష్ణారెడ్డిని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ అక్కడి ప్రివిలెజ్ కమిటీ ఆదేశాలు జా రీ చేయగా సోమవారం అకాడమి అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. అంతకు ముందు బాధిత ట్రైనీ మహిళా ఐపిఎస్ అధికారిణి తన బాధలను అకాడమి అధికారులకు చెప్పుకోగా, దీనిపై విచారించిన ప్రివిలెజ్ కమిటీ ఇదంతా నిజమని నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ట్రైనీ మ హిళా అధికారిణిని ఉదయ్ కృష్ణారెడ్డి లైంగికంగా వేధించినట్లు, భౌతికంగా దాడులకు పాల్పడినట్లు, బ్లాక్ మెయిల్ చేసినట్లు ప్రివిలెజ్ కమిటి ని ర్ధారించినట్లు తెలిసింది. దీని తరువాత బాధిత మహిళా అధికారి చేత అత్తాపూర్ పోలీసు స్టేషన్‌లో ఉదయ్ కృష్ణారెడ్డిపై ఫిర్యాదు చేయించినట్లు తెలిసింది. అనంతరం దీనిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం.

కాగా ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్య యత్న ఘటనపై పోలీసుల విచారణలో సంచలన విషయాలు వెలుగు చూశాయని తెలిసింది. అతను గుర్తు తెలియని పురుగుల మందు తాగినట్లు సోదరుడు తెలపగా ఇది నిజం కాదని పోలీసులు చెబుతున్నారు. అతిగా మద్యం తాగడం వల్లే అతను అనారోగ్యం పాలయ్యాడని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని పోలీసులు చెబుతున్నారు. దీనిపై విచారణ సాగుతోందని వారు తెలిపారు.

# త్రిపుర డిజిపి ఆత్మహత్య

>> పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, ఈ ఘటనపై అధికారిక దర్యాప్తు ప్రారంభమైందని అధికారులు తెలి పారు. కాగా, 1994 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అనురాగ్ ధన్‌కర్ వృత్తిలో ఉన్నతంగా రాణిం చారు.పలు అవార్డులు గెలుపొందారు. అనురాగ్ మే 2025లో త్రిపుర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర పోలీస్ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టడానికి ముందు త్రిపు రలో డైరెక్టర్ జనరల్ (ఇంటెలిజెన్స్)గా పని చేశారు. అలాగే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగే షన్ సిబిఐలో విశిష్టమైన సేవలందించారు. తన పదవీకాలంలో అనేక కీలకమైన కేసుల దర్యా ప్తును చేపట్టి అందరి మన్ననలు పొందారు.

# తల్లి-బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలు

>> కార్యక్రమం అమలు విధానం, వాహనాల నిర్వహణ, రాష్ట్రవ్యాప్తంగా సేవల విస్తరణపై ముఖ్యమంత్రికి వివరించారు. వాహనాలపై అధి కారిక స్టిక్కరింగ్ పూర్తి చేసి, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వీటి సేవలు అందించనున్నారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, ఆ శాఖ ఉన్నతా ధికారులు, జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎ) అధికారులు పాల్గొన్నారు.

## మద్యం టెండర్ల కేసు

# నిందితులకు రెండు వారాల రిమాండ్

**విజయవాడ.జులై 20,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌కు రిమాండ్ విధించింది. చంచల్‌గూడ జైలుకు తరలించాలని ఆదేశించింది. మద్యం రవాణా టెండర్ల కేసు నిందితులను సిట్ అధికారులు ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ కేసులో నిందితులైన వాసుదేవరెడ్డి, రాజ్ కెసిరెడ్డి, సునీల్‌ను పీటీ వారెంట్‌పై కోర్టులో హాజరుపరిచారు., అంతకుముందు విచారణ నిమిత్తం వీరిని హైదరాబాద్ నుంచి విజయవాడకు తీసుకొచ్చారు. విజయవాడ జీజీహెచ్‌లో ఈ ముగ్గురికి వైద్య పరీక్షలు పూర్తి చేశారు. అనంతరం న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టేందుకు కోర్టుకు తీసుకెళ్లారు.

## వారం - వర్జ్యం

21-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
అష్టమి తె.5.17
చిత్త రా.8.52
వర్జ్యం : రా.2.59-తె.4.44
దు.ఉ.8.20-ఉ.9.12,
(2)రా.11.54-రా.12.46
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో స్వల్ప విభేదాలు ఏర్పడతాయి. నూతన కార్యక్రమాలలో తొందరపాటు వద్దు.

**వృషభం:** పనులు నిదానంగా పూర్తి చేస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది. స్పెక్యులేషన్స్ లాభించదు.

**మిథునం:** మీ గురించి మీరు శ్రద్ధ తీసుకోవడానికి మాత్రం సమయం సరిపోదు. ఆరోగ్యంపట్ల జాగ్రత్తలు పాటించండి.

**కర్కాటకం :** సంఘ సేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. విందు వినోదాలలో పాల్గొంటారు.

**సింహం:** ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునేటప్పుడు పెద్దలు, అనుభవజ్ఞుల సలహాలు కూడా పాటించండి.

**కన్య :** తరచూ దూరప్రాంత ప్రయాణాలు చేయవలసి రావడం వలన శ్రమ, అలసట అధికమవుతాయి. బంధువుల కలయిక.

**తుల :** సన్నిహితుల నుండి అందిన సమాచారం కొంత ఆందోళనకు గురి చేస్తుంది. వ్యాపారాలలో స్వల్ప మార్పులు వుంటాయి.

**వృశ్చికం:** మర్చిపోయిన విషయాలను జ్ఞప్తికి చేసుకొని వివాదాలకు దిగడం వలన ప్రయోజనం ఉండదని గుర్తించండి.

**ధనుస్సు:** అన్ని రకములైన పోటీ పరీక్షలకు అవసరమైనటువంటి వస్తువులను, వనరులను సమకూర్చుకుంటారు.

**మకరం:** పరిశ్రమలలో ఎదురైన ఆటంకాలు పరిష్కారదశకు చేరుకుంటాయి. క్రయ విక్రయాలలో ఆశించిన లాభాలు రావు.

**కుంభం:** కాంట్రాక్ట్ పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షించడం చెప్పదగినది. రాయభారములు నడిపి లాభపడుతారు.

**మీనం :** ఎంతగా వత్తిడి ఉన్నా గతంలో సోదర వర్గానికి మీరిచ్చిన మాట నిలబెట్టుకోగలుగుతారు. వస్త్రలాభం.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# భోగాపురం విమానాశ్రయం.. కౌంట్‌డౌన్!

● విమానయాన రంగంలో సరికొత్త మైలురాయి ● ఆగస్టు 1న అందుబాటులోకి అత్యాధునిక విమానాశ్రయం

● యేటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు ● మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి



**విజయనగరం, జులై 20 ప్రభాతవార్త:** అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం అని పేరుపెట్టిన సరికొత్త విశాఖ విమానాశ్రయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 1 ఆగస్టు 2026న జాతికి అంకితం చేసేందుకు సిద్ధం కావడంతో, విశాఖ విమానాశ్రయ ప్రారంభోత్సవానికి అధికారికంగా సమయం దగ్గర పడుతోంది. ఈ ప్రారంభోత్సవం భారతదేశంలోని అత్యంత ముఖ్యమైన వైమానిక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో ఒకదాని పరిపూర్ణతను సూచిస్తుంది. ఉత్తర కోస్తా ఆంధ్రకు అనుసంధానం, ఆర్థిక వృద్ధి, ప్రాంతీయ అభివృద్ధిలో మెరుగైన ఒక కొత్త శకానికి నాంది పలుకుతుంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ అనుబంధ సంస్థ జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీవీఐఏఎల్) ఈ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాన్ని పెరుగుతున్న ఈ ప్రాంత విమానయాన అవసరాలు తీర్చే విధంగా రూపొందించింది. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణీకులు (ఎంపీపీఏ) ప్రయాణించే సామర్థ్యంతో ప్రారంభమవుతున్న ఈ విమానాశ్రయం భవిష్యత్తులో దశల వారీగా 4 కోట్ల ఎంపీపీఏలకు పైగా వీలు కల్పిస్తుంది. విమానాశ్రయంలో 3,800 మీటర్ల కోడ్ 4ఈ రన్‌వే, ఆధునిక ఇంటిగ్రేటెడ్ ప్యాసింజర్ టెర్మినల్, ప్రత్యేక కార్గో సౌకర్యాలు, ఆధునిక విమానయాన ప్రాథమిక సౌకర్యాలు ఉన్నాయి. దేశీయ, అంతర్జాతీయ కార్యకలాపాలను నిర్వహించగల సామర్థ్యం వీటికి ఉంటుంది. వాణిజ్య కార్యకలాపాలకు సంసిద్ధతను ప్రదర్శిస్తూ, ఈ విమానాశ్రయం డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) నుంచి ఏరోడ్రోమ్ లైసెన్స్, బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నుంచి భద్రతా మదింపు పరిశీలన ఆమోదాలు, ఇమ్మిగ్రేషన్ చెక్ పోస్ట్ (ఐసీపీ)గా నోటిఫికేషన్, కస్టమ్స్ చట్టంలోని సెక్షన్ 8 కింద కస్టమ్స్ నోటిఫికేషన్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి నుంచి దీన్ని నిర్వహించడానికి అనుమతి (సీటీఓ)తో పాటు, సంబంధిత నియంత్రణ అధికారుల నుంచి ఇతర తప్పనిసరి కార్యాచరణ ఆమోదాలతో సహా అన్ని ప్రధాన చట్టబద్ధమైన, నియంత్రణ అనుమతులను పొందింది. ఈ ఆమోదాల వల్ల ప్రారంభోత్సవం జరిగిన వెంటనే షెడ్యూల్డ్ వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించడానికి మార్గం సుగమం అవుతుంది. విశాఖ సమీపంలో భోగాపురం దగ్గరున్న విమానాశ్రయం విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, దక్షిణ ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లలోని పొరుగు జిల్లాలకు ప్రాథమిక విమానయాన మార్గంగా ఉంటుంది. ప్రధాన దేశీయ, అంతర్జాతీయ గమ్యాలను చేరుకోవడంలో చెప్పుకోదగిన మెరుగుదల తీసుకువస్తుంది. పర్యాటకం, వాణిజ్యం, లాజిస్టిక్స్, తయారీ, పెట్టుబడులకు మద్దతు ఇవ్వడం ద్వారా ఉత్తర కోస్తా ఆంధ్రలో విశాఖపట్నం ఎకనామిక్ రీజియన్ (వీఈఆర్)ను బలోపేతం చేస్తుందని ఆశిస్తున్నారు. ప్రారంభోత్సవానికి ముందే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖపట్నం, దాని సమీప జిల్లాలతో విమానాశ్రయాన్ని అనుసంధానం చేసే రోడ్డు కనెక్టివిటీ ప్రాజెక్టులను వేగవంతం చేశాయి. ఏడు అప్రోచ్ రోడ్లు ప్రజా రవాణా సేవలను మెరుగుపరచాయి. హైవే కనెక్టివిటీ విమానాశ్రయానికి ప్రయాణీకులు వచ్చిపోయేందుకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అత్యంత సౌకర్యంగా ఉంటుంది. ప్రయాణీకులకు కనెక్టివిటీ కల్పించడమే కాకుండా, ఈ విమానాశ్రయం దీర్ఘకాలంలో ఆర్థిక అభివృద్ధికి ప్రేరకంగా పనిచేస్తుందని ఆశిస్తున్నారు. కార్గో ప్రాథమిక సౌకర్యాలు, పారిశ్రామిక ప్రాంతాలకు సమీపంలో ఉండడం, లాజిస్టిక్స్ సామర్థ్యం మెరుగుగా ఉండడంతో, సమాచార సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఎలక్ట్రానిక్స్, సముద్ర ఆహార ఎగుమతులు, ఆధునిక తయారీ వంటి ఎదుగుతున్న రంగాలకు మద్దతుగా ఉంటుంది. సమర్థవంతమైన, సుస్థిరమైన, భవిష్యత్తుకు సన్నద్ధంగా ఉండే కార్యకలాపాలకు మద్దతు ఇచ్చే విధంగా, పునరుత్పాదక శక్తి, వర్షపు నీటి సేకరణ, శక్తి సామర్థ్య వ్యవస్థలు, పర్యావరణ బాధ్యతాయుత మౌలిక సదుపాయాలను పొందుపరుస్తూ, సుస్థిరతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ఈ విమానాశ్రయం అభివృద్ధి చేయడం జరిగింది. తుది సన్నాహాలు చివరి దశకు చేరుకోవడంతో, విమానాశ్రయ ప్రారంభోత్సవాన్ని, కార్యకలాపాల నిర్వహణ ప్రారంభాన్ని విజయవంతం చేసేందుకు ప్రభుత్వ ఏజెన్సీలు, నియంత్రణ అధికారులు, విమానాశ్రయ భాగస్వాములు, సంస్థలు సన్నిహిత సమన్వయంతో కృషి చేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఆంధ్రప్రదేశ్ విమానయాన ప్రస్థానంలో చెప్పుకోదగ్గ మైలురాయిగా నిలిచిపోతుంది. ఇది ప్రయాణీకులకు, వ్యాపారాలకు, పెట్టుబడిదారులకు నూతన అవకాశాలను సృష్టించడంతోపాటు, విశాఖపట్నంను "తూర్పు ముఖద్వారం"గా, తూర్పు భారతదేశ ఆర్థికాభివృద్ధికి ఒక ప్రధాన చోదక శక్తిగా మరింత



బలోపేతం చేస్తుంది.

**మొదటి దశ రూ.4,592 కోట్లతో పూర్తి:** భారత విమానయాన రంగం మరో కీలక అడుగుకు రంగం సిద్ధమయ్యింది. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రయాణికుల రాకపోకలు, వాణిజ్య రవాణా సామర్థ్యాన్ని పెంచే లక్ష్యంతో అత్యాధునిక హంగులతో భోగాపురంలో సరికొత్త అంతర్జాతీయ విమానాశ్రయం తన కార్యకలాపాలకు సంసిద్ధమైంది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఆధునిక హంగులతో నిర్మించిన ఈ ఎయిర్‌పోర్ట్, ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్‌లా పనిచేయనుంది.

**రికార్డు స్థాయి సౌకర్యాలు:** భోగాపురం విమానాశ్రయం సుమారు 2,203 ఎకరాల విస్తీర్ణంలో రూ. 4,592 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ప్రయాణికులకు ప్రపంచస్థాయి అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఇక్కడ అన్ని రకాల వసతులను కల్పించారు.

**అంతర్జాతీయ స్థాయి రన్‌వే:** 3,800 మీటర్ల పొడవైన కోడ్ ఈ రన్‌వేను నిర్మించారు. ఇది భారీ వైడ్‌బాడీ అంతర్జాతీయ విమానాలు సురక్షితంగా ల్యాండ్ అయ్యేందుకు, టేకాఫ్ చేసేందుకు వీలు కల్పిస్తుంది.

**వాణిజ్యానికి ఊతం:** ఎగుమతులు, దిగుమతులను వేగవంతం చేసేందుకు 5,000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో అత్యాధునిక కార్గో టెర్మినల్‌ను అందుబాటులోకి రానుంది.

ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ టవర్, సమాంతర ట్యాక్సీవేలు, ఫ్యూయల్ హైడ్రెంట్ సిస్టమ్ వంటి అధునాతన సాంకేతిక వ్యవస్థలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

**దశలవారీగా భారీ విస్తరణ:** ప్రస్తుతానికి ఈ విమానాశ్రయం ఏటా 60 లక్షల మంది ప్రయాణికులకు సేవలందించేలా సిద్ధమైంది. అయితే, భవిష్యత్తులో విమాన ప్రయాణికుల రద్దీని ఊహించి, దశలవారీగా దీనిని ఏటా 4 కోట్ల మందికి పైగా ప్రయాణికులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం వరకు విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి, దానికి అనుగుణంగా మొదటి దశ పనులను పూర్తి చేశారు.

**ఆర్థికాభివృద్ధికి బాటలు:** ఈ విమానాశ్రయం కేవలం ప్రయాణాలకే పరిమితం కాకుండా, చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక, వాణిజ్య కార్యకలాపాలకు ఊతమివ్వనుంది. రాకపోకలు సులభతరం కావడంతో పెట్టుబడులు పెరగడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా భారీగా మెరుగుపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఇదొక మేలి మలుపుగా పేర్కొనవచ్చు.

**ఆగస్టు 1న జాతికి అంకితం:** ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జీఎంఆర్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన ఈ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆగస్టు 1న ప్రధాని మోడీ జాతికి అంకితం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.



## యుకెకు తిరుపతి మామిడి గుజ్జు ఎగుమతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** భారత్-యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి వచ్చిన నేపథ్యంలో తిరుపతి నుండి మామిడి గుజ్జు తొలిసారిగా ఎగుమతి జరిగింది. తిరుపతికి చెందిన వర్ల ఫుడ్స్ సంస్థ యూకేకు తొలి మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) ఎగుమతి కంటైనర్‌ను ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఏపీఈడీఏ ప్రాంతీయ ఏజీఎం ఆర్. పి. నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ఫణి కిరణ్, ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి మాట్లాడుతూ భారత్-యూకే ఎఫ్‌టీఏ ద్వారా ఆంధ్రప్రదేశ్ ఉద్యాన ఉత్పత్తులకు కొత్త ఎగుమతి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. తిరుపతి నుంచి తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ఎగుమతులు పెరగడం వల్ల రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. నాణ్యమైన ఉత్పత్తులు, ప్రాసెసింగ్ ద్వారా అంతర్జాతీయ మార్కెట్లో ఆంధ్రప్రదేశ్‌కు మరింత గుర్తింపు లభిస్తుందని తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక సహాయాన్ని ఉద్యాన శాఖ అందిస్తుందని, రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులు సమన్వయంతో పనిచేస్తే రాష్ట్ర ఉద్యాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించారు.

## దొంగ ఓట్లు పూర్తిగా తొలగిస్తాం

● జగన్‌కు మతిభ్రమించింది: రాష్ట్రమంత్రి అనగాని



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో దొంగ ఓట్లను పూర్తిగా తొలగిస్తామని, ఎన్నికల సవరణ (సర్)ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతోందని రాష్ట్ర రిజిస్ట్రేషన్, రెవెన్యూ శాఖల మంత్రి అనగాని సత్యప్రసాద్ స్పష్టం చేశారు. దొంగ ఓట్ల తొలగింపుతో వైఎస్ జగన్‌కు మతి భ్రమించిందని, ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేయడం ఆయనకు అస్సలు ఇష్టం లేదని మంత్రి విమర్శించారు. రామాయపట్నం పోర్టు విషయంలో జగన్ డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ఇదే సమయంలో మాజీ ఐపిఎస్ అధికారి ఎవి వెంకటేశ్వరరావు వ్యాఖ్యలపై కూడా మంత్రి విరుచుకుపడ్డారు. ఆయనో పెద్ద మేధావిలా ఫీల్ అవ్వాల్సిన అవసరం లేదంటూ ఘాటుగా స్పందించారు. తిరుపతిలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంను కూడా నిర్మించబోతున్నామని మంత్రి చెప్పారు.

## విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం

### అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి




**మదనపల్లె, జులై 20 ప్రభాతవార్త:** విద్యార్థులను అన్ని రకాలుగా ప్రోత్సహించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జ్, రోడ్లు భవనాల మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి తెలిపారు. సోమవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా షైనింగ్ స్టార్స్-2026, మై స్కూల్-మై ఫ్రెండ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యాశాఖ అధికారులు ముఖ్య అతిథులుగా హాజరై కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా వారిలో పోటి తత్వాన్ని పెంపొందిచడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. జిల్లాను విద్యా ఫలితాల్లో అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులను అభినందించారు. రాయలసీమలో జిల్లా ప్రథమ స్థానం, రాష్ట్రంలో 9వ స్థానంలో నిలవడం గర్వకారణం అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాలోకేష్‌లు విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోరని వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకే షైనింగ్ స్టార్స్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులు జీవితంలో ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన అందుకొన్న పురస్కారం జీవితాంతం గుర్తు ఉండేలా మరింత కృషి చేయాలని సూచించారు. ఒక విద్యార్థి విజయం మరొకరికి స్ఫూర్తిగా మారాలన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఐఏఎస్, ఐపిఎస్, ఇంజనీరింగ్, డాక్టర్లు కావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తుని, విద్యతోనే వ్యక్తిత్వ వికాసం సాధ్యం అవుతుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా వేలాది మంది విద్యార్థులు లబ్ధిపొందుతున్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులే అన్నమయ్య జిల్లా భవిష్యత్తుకు బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ.20వేలు ప్రోత్సాహక నగదు అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 188మంది విద్యార్థులకు రూ.37,60లక్షలు నగదు ప్రోత్సాహకం అందజేయడం సంతోషకరమన్నారు. తల్లికి వందనంతో పాటు మధ్యాహ్న భోజనం కూడా నాణ్యమైనదిగా వడ్డించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఈఓ సుబ్రమణ్యం, డైరెక్టర్ అనూరాధ, ఇంటర్ మీడియట్ జిల్లా అధికారి రవి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మెట్ల పై నుండి పడి టెన్నీస్ కోచ్ మృతి

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లింగేశ్వర్ నగర్ లో సోమవారం మధ్యాహ్నం మెట్లపై నుండి జారిపడి యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. శ్రీకాళహస్తికి చెందిన భాస్కర్ (28) తిరుపతి లింగేశ్వర్‌నగర్ ఆంధ్ర బ్యాంకు కాలనీ లో టెన్నిస్ అసిస్టెంట్ కోచ్ గా ఉంటున్నాడు. సోమవారం లింగేశ్వర్ నగర్ లోని ఓ ఇంటిలో స్నేహితునితో కలిసి భాస్కర్ గదిలో ఉంటున్నాడు. స్నేహితుడు ఊరికి వెళ్లగా ఒంటరిగా ఉన్న భాస్కర్ మద్యం మత్తులో మొదటి అంతస్తు నుండి దిగుతూ బోర్లపడ్డాడు. భాస్కర్ తలకు బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీ కి తరలించారు. భాస్కర్ తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు తిరుపతి రూరల్ సిఐ మద్దయ్య ఆచారి కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Rayapudi, Thullur Mandal, Amaravati-522237 (A.P.)
NIT No. 05/A-12024/1/2026-AC-II/2nd call Dt: 20/07/2026
E PROCUREMENT SHORT TENDER NOTICE (SECOND CALL)
Name of Work: APCRDA - "RFP for Selection of Agency for Providing Strategic Resource Augmentation and Knowledge Support Services to APCRDA on Requirement Basis".
The bid can be downloaded on AP e-procurement portal from 21.07.2026 to 29.07.2026 up to 14.00 Hrs. Due date for submission of Bid is 29.07.2026 up to 15.00 Hrs, Technical bid opening 29.07.2026 @ 16.00 Hrs. For further details Please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in.
Sd/- Addl. Commissioner, APCRDA, Amaravati

## ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ విజేతగా సాయి నచికేత్

### జూనియర్ ఛాంపియన్‌గా తొలి భారతీయుడుగా ఖ్యాతి



**నెల్లిమర్ల, జులై 20 ప్రభాతవార్త:** ఇంగ్లాండులోని బర్మింగ్ హామ్ నగరంలో ఈ నెల 17 నుంచి జరుగుతున్న ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ (అండర్ 19) పోటీల్లో విజయనగరానికి చెందిన భట్రాజు సాయి నచికేత్ బంగారు పతకం సాధించాడు. ఆల్ ఇంగ్లాండ్ జూనియర్ బాడ్మింటన్ ఛాంపియన్షిప్‌లో బంగారు పతకం సాధించిన తొలి భారతీయుడుగా చరిత్ర సృష్టించాడు. ఆరేళ్ల వయసు నుంచే బ్యాడ్మింటన్ ఆటపై ఆసక్తిని పెంచుకొని తొలి కోచ్ భాస్కర బాబు వద్ద మెలకువలు నేర్చుకున్నాడు. ప్రస్తుతం ప్రఖ్యాత చేతన ఆనంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో చేతన్ ఆనంద్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి విజయనగరంలోని పిఎస్ఆర్ కాలనీ ప్రాంతానికి చెందినవారు. తండ్రి ఉద్యోగరీత్యా హైదరాబాదులో నివాసం ఉంటున్నారు. నచికేత్ ఇప్పటికే మలేషియా, ఇండోనేషియా, సైప్రస్, బంగ్లాదేశ్, స్వీడన్, బల్గేరియా దేశాల్లో జరిగిన పోటీల్లో పాల్గొని మంచి గుర్తింపు సాధించాడు. 2025 ఆగస్టులో శ్రీలంకలో జరిగిన శ్రీలంక జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్‌లో పాల్గొని తృతీయ బహుమతి సాధించాడు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియాలో నచికేత్ ప్రస్తుతం 12వ ర్యాంకులో ఉన్నాడు. బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్‌లో 56వ ర్యాంకులో ఉన్నాడు. నచికేత్ సోదరుడు సాయి హృషికేత్ కూడా బ్యాడ్మింటన్ క్రీడాకారిడే. ఆయన కూడా చేతన్ ఆనంద్ అకాడమీ లోనే శిక్షణ పొందుతున్నాడు. నచికేత్ తల్లి నాగమణి సీనియర్ వాలీబాల్ క్రీడాకారిణి. ఆమె విజయనగరంలో వాలీబాల్ క్రీడపై మక్కువ పెంచుకొని రాష్ట్ర జాతీయ స్థాయిలో పలు పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. ఆంధ్ర యూనివర్సిటీ మహిళా వాలీబాల్ టీంకు నాయకత్వం వహించారు. జాతీయస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టులో పాల్గొని ప్రతిభ చూపించారు. నచికేత్ సాధించిన విజయం పట్ల వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, విజయనగరానికి చెందిన టివి భగవాన్ దాస్, వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు కృష్ణంరాజు, కెవిఎన్ రాజు(చిన్నారి) నచికేత్‌ను, తల్లి నాగమణిని అభినందించారు.

# విజయాలకు వేదికగా షైనింగ్ స్టార్స్

● విద్యా సంస్కరణలకు నిదర్శనం: మంత్రి అనగాని సత్యప్రసాద్ ● 258 మంది విద్యార్థులకు రాష్ట్ర స్థాయి గౌరవం ● ఒక్కొక్కరికి రూ.20 వేల ప్రోత్సాహకం



**తిరుపతి(విద్య), జులై 20 ప్రభాతవార్త:** పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 258 మంది విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక షైనింగ్ స్టార్స్-2026 పురస్కారాలతో ఘనంగా సత్కరించింది. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమం విద్యార్థుల విజయోత్సాహంతో పండుగ వాతావరణాన్ని తలపించింది. జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర రిజిస్ట్రేషన్- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు, జ్ఞాపికలతో పాటు ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారానే రాష్ట్ర భవిష్యత్తు మరింత బలపడుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యలో నాణ్యత పెంపు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన అవకాశాల కల్పన లక్ష్యంగా అనేక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, ఇంటర్మీడియట్ విద్యార్థులకు భోజన పథకం పునరుద్ధరణ, మెగా డీఎస్సీ వంటి కార్యక్రమాలు విద్యా రంగానికి కొత్త ఊపునిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో ప్రతిభా పురస్కారాలు పరిమిత సంఖ్యలోనే అందించేవారని, ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఒకే వేదికపై సత్కరించడం ద్వారా ప్రతిభకు తగిన గుర్తింపు కల్పిస్తున్నామని మంత్రి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు ఇతర విద్యార్థులకు కూడా స్ఫూర్తినిస్తూ ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తాయని అభిప్రాయపడ్డారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. మార్కులు మాత్రమే విజయానికి కొలమానం కాదని, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యాలు, సామాజిక బాధ్యత కూడా సమానంగా అవసరమని సూచించారు. విద్యార్థులు చిన్న లక్ష్యాలతో సరిపెట్టుకోకుండా పెద్ద కలలు కని వాటి సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, అరవ శ్రీధర్, నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అమలు చేస్తున్న ప్రోత్సాహక కార్యక్రమాలు ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంచుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల విజయాల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కూడా ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.వి.ఎన్. కుమార్, ఆర్ఐఓ గోపాల్ రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పురస్కార గ్రహీతలను అభినందించిన అతిథులు, వారు భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

# తిరుపతి పోలీస్ కమిషనరేట్ దిశగా వేగంగా అడుగులు!

● పుణ్యక్షేత్రం ప్రాధాన్యతతో భద్రత మరింత కట్టుదిట్టం

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైన హిందువుల పుణ్యక్షేత్రం... యాత్రాస్థలం తిరుపతి నగరం త్వరలో పోలీస్ కమిషనరేట్ ఏర్పాటు దిశగా మార్పుకానుంది. ఇందుకోసం అవసరమైన కార్యాచరణ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర పోలీస్ బాస్ (డిజిపి) హరీష్ కుమార్ గుప్త నుండి నివేదికలు, ప్రతిపాదనలతో కూడిన డాటాను పంపాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడుకు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రముఖ యాత్రాస్థలంగా కూడా ఖ్యాతిచెందిన తిరుపతి జిల్లాలో తిరుపతిని పోలీస్ కమిషనరేట్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి ఇటీవల ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. కొత్త కమిషనరేట్‌గా మార్చాలని ప్రాథమిక ప్రక్రియలో పేర్కొంది. తిరుపతి జిల్లాలో ప్రధానంగా తిరుమల శ్రీవారి ఆలయం, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీకాళహస్తి కాళహస్తీశ్వర స్వామి ఆలయం, నాగలాపురం వేదనారాయణస్వామి ఆలయం, పెద్దపారిశ్రామికవాడ సత్యవేడు నియోజక వర్గంలోని శ్రీసిటీ ఉండటంతో ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుపతి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు యాత్రికులు వస్తుండటం, ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, న్యాయాధికారులు, ప్రముఖులు, విదేశాల నుండి ప్రముఖులు పర్యటిస్తుండటంతో వారికి భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు అదనపు పోలీస్ బలగాలు అవసరం ఉంది. ఎంతో సుదీర్ఘ చరిత్ర ఉన్న చిత్తూరు జిల్లాను పోలీస్‌శాఖాపరంగా విభజించి తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాగా 2010లో నెలకొల్పారు. అప్పటివరకు ఎస్పీతో నడిచిన పోలీస్‌శాఖ ఐపిఎస్ అధికారి హోదాలో ఎస్పీ క్రిందకు పోలీసుశాఖ తీసుకువచ్చారు. అప్పటి నుండి అర్బన్ జిల్లాకు బాలారిష్టాలు తప్పలేదు. కనీస మౌళిక వసతులు కూడా కరువయ్యాయి. ఆ తరువాత 2019లో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత 2022లో జిల్లాల పునర్విభజనలో పరిపాలన పరంగా చిత్తూరు జిల్లాను విడగొట్టి తిరుపతి జిల్లాగా ఏర్పాటుచేశారు. ఈ జిల్లాలో నెల్లూరు జిల్లా నుండి కొంతభాగం, రెవెన్యూ డివిజన్లను తిరుపతిలో కలిపారు. పరిపాలన పరంగా అస్తవ్యస్థ విభజనతో జనం ఇబ్బందులు ఎక్కువయ్యాయి. తిరుపతి పోలీస్ జిల్లాతోనే పాలన సాగించారు. 2024లో రాష్ట్రంలో మళ్ళీ టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో తిరుపతిపై ప్రత్యేక ఫోకస్ పెట్టింది. సిఎం చంద్రబాబునాయుడు సొంత జిల్లా కూడా కావడంతో ఇక్కడ పరిపాలన పరంగా, పోలీస్ శాఖను మరింత బలోపేతం చేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు.

**జిల్లా పోలీస్ కార్యాలయం నుండి కమిషనరేట్ దిశగా:** తిరుపతి జిల్లా ఏర్పాటైన తరువాత కూడా జిల్లాకు ప్రత్యేకంగా ఐపిఎస్ అధికారినే ఎస్పీ హోదాలో పాలన సాగిస్తున్నారు. పెరిగిన విస్తీర్ణం, కొత్తగా ఏర్పాటైన సబ్‌డివిజన్లు, పోలీస్ సర్కిళ్ళతో పరిపాలన మరింత ఎక్కువైంది. ఈ నేపథ్యంలో తిరుపతి నగరం జనాభా అనూహ్యంగా పెరిగింది. జనాభా 6లక్షల వరకు చేరగా ఓటర్లు 3లక్షల మంది ఉన్నారు. ఇదేగాక తిరుపతి నగరపాలక సంస్థ గ్రేటర్‌గా రూపుదిద్దుకోనున్న తరుణంలో పరిసరాల్లోని గ్రామాలు, కాలనీలు, పంచాయతీలు తిరుపతి గ్రేటర్ కార్పొరేషన్ క్రిందకు చేరనున్నాయి. దీంతో జనాభా కూడా మరింతగా అధికం కానుంది. ఈ నేపథ్యంలో తిరుపతి జిల్లాతోబాటు తిరుపతి మహానగరంలో శాంతిభద్రతల పరిరక్షణ, పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని తిరుపతిని పోలీస్



కమిషనరేట్‌గా మార్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. తిరుపతి అర్బన్ పోలీస్ జిల్లాను పూర్తి స్థాయి పోలీస్ కమిషనరేట్‌గా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించడంతో ఇందుకు అవసరమైన కార్యాచరణ, ప్రతిపాదనలు, నూతన సబ్‌డివిజన్లు, నగరంలో ట్రాఫిక్, క్రైమ్, శాంతిభద్రతల విభాగాలకు ఎస్పీలు రానున్నారు. కమిషనరేట్‌కు ఐజి హోదాలో పోలీస్ కమిషనర్ నియామకం కానున్నారు. ఆయన నేతృత్వంలో ముగ్గురు నలుగురు ఎస్పీలు, అదనపు ఎస్పీలు (ఎసిపిలు, డిసిపిలు)గా మారనున్నారు.

తిరుపతి అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రం కావడం, పర్యాటకుల రద్దీ పెరగడం, పెరుగుతున్న నేరాల నియంత్రణకు నగర స్థాయి పోలీసు వ్యవస్థ అవసరమని ప్రభుత్వం భావించింది ఇప్పటికే తిరుపతి నగరాన్ని పరిపాలన పరంగా రెండు ప్రధాన సబ్‌డివిజన్లుగా విభజించారు.

తిరుపతి సబ్‌డివిజన్ నగరం పరిధిలో తిరుపతి తూర్పు, అలిపిరి, తిరుపతి పడమర, ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ పోలీసు స్టేషన్లు, ట్రాఫిక్, క్రైమ్ సబ్‌డివిజన్లు ఉన్నాయి. ఇదేగాక చంద్రగిరి సబ్‌డివిజన్ కింద ఎం.ఆర్.పల్లి (తిరుపతి రూరల్), తిరుచానూరు, రామచంద్రాపురం, పాకాల, యర్రావారిపాలెం, భాకరాపేట, చంద్రగిరి పోలీసు స్టేషన్లు ఉన్నాయి. తిరుమల సబ్‌డివిజన్‌లో తిరుమల 1, 2 టౌన్, తిరుమల ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. ఇదేగాక రేణిగుంట, శ్రీకాళహస్తి, పుత్తూరు సబ్‌డివిజన్లు ఉన్నాయి. తిరుపతి నగరం కమిషనరేట్‌గా మారితే కొత్త పరిపాలనా జోన్లు, పోలీస్ సర్కిళ్ల విభజన కానుంది. కొత్తగా పాకాల, పూతలపట్టు వరకు కమిషనరేట్ క్రిందకు వచ్చే సూచనలున్నాయి. పోలీసు పునర్వ్యవస్థీకరణలో తిరుపతి కమిషనరేట్ పరిధిలోనూ మరిన్ని కొత్త పోలీస్ సబ్‌డివిజన్లు ఏర్పాటయ్యే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పోలీస్ కమిషనరేట్ చేయడానికి నగర విస్తరణ, జనాభా పెరుగుదల ఆధారంగా శాంతిభద్రతలను పర్యవేక్షించడానికి సంబంధించి ప్రతిపాదనలు రూపొందించే దిశగా కార్యాచరణ మొదలుపెట్టారు. త్వరలోనే కమిషనరేట్ క్రిందకు సరిహద్దులను ఖరారు చేయడం, ప్రజలకు మెరుగైన రక్షణ కల్పించేందుకు పూర్తి స్థాయి రూపురేఖలు హద్దులకు సంబంధించిన జియోగ్రాఫికల్ నోటిఫికేషన్లు అధికారికంగా నివేదికలను తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు రాష్ట్ర ప్రభుత్వానికి పంపనున్నారు.

వార్త

ప్రపంచపు నైతిక స్పృహను సమీకరించుకోగలిగితే గొప్ప సైన్యానికి మించిన శక్తి మనకి లభిస్తుంది.

- ఉడ్రోవిల్సన్

# వణుకుతున్న 'ఉత్తరం'

ప్రకృతి విజృంభించినప్పుడల్లా అది ప్రకృతి ప్రకోపమా, మానవ తప్పిదమా అని ప్రశ్నించుకుంటూనే ఉంటాం. ప్రకృతి కన్నెర్ర చేస్తే చేయగలిగినదేమీ ఉండక పోయినా తగిన జాగ్రత్తలు తీసుకుంటే జనంఅప్రమత్తమై ఉంటే ఎంతో కొంత నష్టాలను తగ్గించుకోగలమనే అంశం దీనితో ముడిపడి ఉంది. ప్రస్తుతం ఉత్తరాదిన వరదలు ముంచెత్తుతున్నాయి. కనీవినీ ఎరుగని బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ఉత్తరాఖండ్, నాగాలాండ్‌లలో ఆకస్మిక వరదలు చుట్టుముట్టాయి. జనజీవనం స్తంభించింది. జమ్మూకాశ్మీర్‌లో భారీ వర్షాలతో అతలాకుతలం అయిపోయింది. ఆదివారం నాటి వరదలకే కనీసం 17 మంది దుర్మరణం పాలయ్యారు. ఎడతెగని వర్షాలతో రాజౌరి, పూంచ్, అనంతనాగ్ జిల్లాలో మెరుపు వరదలు సంభవించాయి. రాజౌరి నదులు పొంగిపొర్లాయి. రహదారులపై నీళ్లు చేరాయి. శనివారం సాయంత్రం నుంచి కురిసిన భారీ వర్షాలకు వరదలు పోటెత్తాయి. రాజౌరి జిల్లాలోని దర్హాలి, ఖండ్లీ, సుక్తోహ్, జమెలా నదులతోసహా అన్ని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మరోపక్క కొండచరియలు జారిపడుతున్నాయి. జనసంచారం ఎంత తక్కువగా ఉన్నా ఎక్కడో అక్కడ జన నష్టానికి చేరువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అమర్‌నాథ్ యాత్రకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఆదివారం నుంచి భక్తజన సందోహాన్ని ముందుకు కదలనీయకుండా ప్రభుత్వాలు ఆంక్షలు విధించారు. బేస్ క్యాంపుల్లో ఉన్న భక్తులను ఎక్కడికీ కదలనీయకూడదని ఆదేశాలు జారీ చేశారు. అమర్‌నాథ్‌తోపాటు ప్రఖ్యాత వైష్ణోదేవి అమ్మవారియాత్ర కూడా స్తంభించిపోయింది. తదుపరి ఆదేశాలు ప్రకటించే వరకు వీటిని పునరుద్ధరించలేమని ప్రభుత్వ అధికారులు నిర్ద్వంద్వంగా ప్రకటించారు. జమ్మూ, కాశ్మీర్‌ల మధ్య యాత్రికులను అటునిటు వెళ్లకుండా ఆంక్షలు విధించడంతో ఎక్కడికక్కడ బ్లాక్ అయిపోయారు. వారంతా జమ్మూ, ఉధంపూర్ రాంబన్‌లలో ఏర్పాటు చేసిన వసతి కేంద్రాల వద్దే తలదాచుకోవాలి. బంగాళాఖాతం అరేబియా సముద్రాల నుంచి వస్తున్న తీవ్రతకు గాలుల ప్రభావంతో జమ్మూకాశ్మీర్‌లో ఈ నెల 23 వరకు కుండపోత వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. 21 నుంచి 23 వరకు కశ్మీర్‌లో అతి భారీ వర్షాలు పడవచ్చునని, 20 నుంచి 23 వరకు మధ్య జమ్మూ రీజియన్‌లోని రియాంస్, ఉద్దంపూర్ జిల్లాలో రికార్డుల స్థాయి వానలు కురిసే పరిస్థితిఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. అనంత నాగ్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, మేఘా విస్ఫోటనాలు, ఫ్లాష్‌ఫ్లడ్ లతోపాటు, కొండచరియలు విరిగిపడ్డాయి. పూంచ్, సురన్‌కోట్‌లోని లోయర్ ముర్రాలో 10 మంది రాజౌరిలో ఇద్దరు చనిపోగా, ఆరుగురి ఆచూకీ దొరకలేదు. చిట్టగ్రఉల్ ప్రాంతంలో సాయంత్రం 7 గంటల దాకా మేఘవిస్ఫోటనం సంభవించింది. జమ్మూకాశ్మీర్‌లకు ఇది మూడో మేఘ విస్ఫోటనం దెబ్బ. ఇటీవలనే కిష్త్వార్‌లోని క్వార్ హైడ్రో ప్రాజెక్టు వద్ద దోడాలోని తత్రిలో కూడా ఇదే విధంగా క్లౌడ్‌బరస్ట్ సంఘటనలు జరిగాయి. హిమాలయ ప్రాంతం పూర్తిగా ఫ్లాష్ ఫ్లడ్‌లకు అలవాటుగా మారింది. ప్రధానంగా విలయానికి కారణం ప్రభుత్వాల వైఫల్యం, మానవ తప్పిదాలు కూడా అనిచెప్పాలి. జమ్మూ కాశ్మీర్ అంటే అందాల లోయలే కాదు, ప్రకృతి సౌందర్యానికి ఆలవాలంగా ఉంటుంది. అలాంటి చోటప్రకృతిని కాపాడుకోవడం మనవంతు, ప్రభుత్వ బాధ్యత. ప్రకృతిని గౌరవించకుండా పర్వతాలపై దాడి చేస్తే ప్రకృతి పగ బట్టినట్లుంటుంది. పర్యావరణాన్ని కాపాడుకోవడంలోవేసే ప్రతి నిర్లక్ష్యపుటడుగు మానవాళికి ప్రమాదమే. హిమాలయ ప్రాంతాల్లో నిర్మాణాలపై కఠిన నిబంధనలు, నదీ ప్రవాహ మార్గాలను ఆక్రమణల నుంచి కాపాడే విధాన నిర్ణయాలు, ప్రకృతి బీభత్సాల ముందస్తు సమాచారాన్ని గ్రామాలకు తక్షణమే చేరవేయడం వలన కొంత మేరకు నష్టాలను తగ్గించొచ్చు. అడవులను నరకడాన్ని తక్షణమే నిలుపుదల చేయాలి. సుస్థిర పర్యాటకం కోసం ఇవన్నీ తప్పని సరి. లేకుంటే వర్షాకాలపు ప్రకృతి విపత్తులతో బహుళ స్థాయిలో నష్టాలు వాటిల్లుతాయి. ఇలా అనుకోని వరదలొచ్చినప్పుడు ప్రభుత్వపరంగా కొద్దిపాటి సంసిద్ధతలు సరిపోవు. వరద సమాచారం తెలియక జనం తల్లడిల్లిపోయిన సందర్భాల్లో వారిని ఆదుకునే ప్రత్యేక యంత్రాంగం ఏదీలేదనే చెప్పాలి. భారీయంత్రాలు ముందస్తుగానే ప్రమాద సూచిత ప్రాంతాలకు చేర్చాలి. లోయల్లోని గ్రామాలకు ప్రభుత్వ యంత్రాంగం చేరాలంటే చాలాసమయం పడ్తుంది. ఒకసారి వర్షానికి సమయం చిక్కితే నిరంతరం కురుస్తూనే ఉండడంవల్ల ప్రభుత్వ సాయం ఆలస్యంగా అందుతుంది. సహాయక చర్యలు ఎప్పుడైతే తక్షణమే అందవో అప్పుడే నష్టాలు ఎక్కువవుతున్నాయి. బాధితులకు తక్షణ ఆహారపొట్లాలు, లేదా సహాయం అందకపోతే వారి ఆక్రందనలకు అంతే ఉండదు. ఇప్పుడు కశ్మీర్‌లో ప్రకృతి విలయానికి సహాయం అందక ఎంతో మంది విలవిల్లాడుతున్నారు. అనంతనాగ్‌లో వరి పొలాలు, యాపిల్ తోటలు బాగా దెబ్బతిన్నాయి. రైతుకు ఆదాయం బాగా పోయేటట్లుంది. నిర్మాణాలు, అడవుల నరికివేత, సహజనీటి ప్రవాహ మార్గాలకు ఆటంకాలు, పర్యాటకులు పడేసిన చెత్తను సైతం తొలగించే ఏర్పాటు లేక పోవడం వల్లనే ప్రకృతితెచ్చే నష్టాలు ఎక్కువవుతున్నా యని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డా. మన్నా నిసార్ వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కేరళ రాష్ట్రం వయెనాడ్ విలయం నాటి అనుభవాల గుణపాఠం నేర్చుకోవాలి. ప్రకృతి విలయాలను తట్టుకుని తక్షణ సహాయాన్ని పునర్నిర్మాణ పనులకు పూర్తి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు ఏర్పాటు అవసరం.

పొగిడేవారు లేనప్పుడు కష్టాలు చుట్టుముట్టినప్పుడు మనల్ని మనం బాగా తెలుసుకోగలం.



శామ్యూల్ జాన్సన్

ఎవడు మహాబలశాలి అయినప్పటికీ, కోమల హృదయం కలిగి ఉంటాడో, అతడే నిజమైన మానవుడు, ధీరుడు.



స్వామి వివేకానంద

# వైద్యం, విద్యే పాలకుల లక్ష్యం కావాలి

**ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయంగా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అం దుకనే 'విద్య'ను లక్ష్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ విద్యా ధికులను అభ్యున్నతి కోసం తయారు చేయాలి!**



రావులపాటి సీతారాంరావు

రాజకీయాలు ఎట్లున్నా దేశంలో విద్యా విధానాన్ని సంస్కరించాల్సిన అవసరం ఏర్పడింది! అటు రాష్ట్ర ప్రభుత్వాలకూ ఇటు కేంద్ర ప్రభుత్వానికి విద్యావిధానంలో మార్పులు, చేర్పులు సంస్కరణలూ కాలానుగుణంగా చేసినప్పుడే విద్యకు విలువనిచ్చినవారవుతారు. 'విద్య నొసగు వినయంబు'తో బాటు జీవనవిధానాన్ని నేర్పుతుంది! మాతృదేవో భవ, పితృదేవో భవలతో పాటు ఉపాధ్యాయుడికి సమాజంలో వున్న ఉన్నత స్థానాన్ని తెల్పటానికి, పూర్వీకులు గురువును కూడా తల్లిదండ్రులతో పాటు 'గురుదేవోభవ'ను చేర్చి విద్యనొసగే గురు స్థానానికి సముచిత రీతిలో సూక్తుల పరంగా గుర్తు చేయటం జరిగింది! విద్యను 7వ షెడ్యూలులో కంకరెంట్ లిస్టులో చేర్చటం వల్ల రాష్ట్రాలతో పాటు కేంద్రానికి ఈ విషయంలో చట్టాలు చేసి సంస్కరించాల్సిన గురుతర బాధ్యత వుంది! పార్లమెంటు సమావేశాల్లో విద్య ప్రాముఖ్యతను ప్రజా ప్రతినిధులు గుర్తించి, డిబేట్లను చేపల మార్కెట్టు ధోరణిలో చేయకుండా అర్థవంతంగా పార్టీలకు అతీతంగా విద్యావిధానాలను అవసరమైతే సంస్కరించటానికి చట్టాలను పాస్ చేయాల్సిన బాధ్యత వుందని భావించటంలో తప్పులేదేమో! వైద్యం, విద్య ప్రజల అభ్యున్నతికి మూల స్థంభాల్లాంటివి! ఆ రెండింటిని ప్రైవేట్ పరం చేయటానికే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల్లో ఏ పార్టీ అధికారానికి వచ్చినా సరే, సిద్ధపడ్తుండటం దురదృష్టంగా భావించక తప్పదు. 'నీట్' పరీక్ష ఎంతోమందికి ప్రభుత్వాన్ని ప్రశ్నించే అవకాశం కల్పించింది. సోనమ్ వాంగ్ చుక్ అనే విద్యావేత్త మార్పుల కోసం ప్రాణాన్ని ఫణంగా పెట్టి నిరాహార దీక్ష చేస్తున్నారు. కేంద్ర విద్యా మంత్రి రాజీనామా ఆయన డిమాండ్! వాంగ్ చుక్ను హాస్పిటల్కు తరలించారు! ఈ నేపథ్యంలో విద్యావిధానంలోని లొసుగులు, కావల్సిన మార్పులు విశ్లేషించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది! విద్యను సాధ్యమైనంత త్వరగా ప్రైవేట్ వ్యక్తుల నుంచి, సంస్థల నుంచి తొలిగించి ప్రభుత్వ పరిధిలోకి తీసుకొని రావాలి! గవర్నమెంట్ స్కూళ్ళను, కాలేజీలనే ప్రోత్సహించాలి! అప్పుడే ఒకే రకమైన విద్యను గరపటానికి, విద్యా విధానాలను పాటించటానికి అవకాశం వుంటుంది. నీట్ లాంటి సంస్థల్లో తప్పుల ప్రమాదం అదుపులో ఉంటుంది! బాధ్యతలు ఏకీకృతమవుతాయి! రాష్ట్ర ప్రభుత్వాలు గూడా ప్రైవేటు పరంగా విద్యను ఒప్పచెప్పకూడదు! బాధ్యతలు ప్రభుత్వాలు తొలగించుకొని, కేవలం కర్ర పెత్తనానికి, అధికారానికి మాత్రమే పరిమితమవుతే అంతే సంగతులు! ఆచరణ మొదట్లో కష్టమే అయినా, స్వాతంత్ర్యం వచ్చిన కాలంలో మన దేశంలో విద్య ప్రయివేటు వారి చేతుల్లో చాలా తక్కువగా వుండేది. ప్రయివేట్ స్కూళ్ళల్లో, విద్యాలయాలల్లో చదువుకున్న వారిని ఆరోజుల్లో చిన్నచూపు చూసేవారు! కోచింగ్ కల్చర్ను పూర్తిగా తొలిగించాలి! కోచింగ్ల పేరుతో బలవంతంగా విద్యార్థులపై ఒత్తిడిని ప్రయివేట్ కోచింగ్ సెంటర్లు అమితంగా పెంచుతున్నాయి! అంతేగాదు ఒకరి కంటే మరొకరు మిన్న అని నిరూపించుకోటానికి అనేక రకాల మార్గాలను అన్వేషించటం మొదలుపెట్టారు! దీనితో మార్కులు ఇబ్బడి ముబ్బడిగా విద్యార్థులు తెచ్చుకుంటు



న్నారు కానీ, నాలెడ్జి పరంగా వారిలో సాధించేది దాదాపు సున్నాగా మిగులుతుంది. తల్లిదండ్రులు కోచింగ్ కోసం డబ్బులు విపరీతంగా ఖర్చు చేస్తున్నారు! ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్లు విద్యార్థులు ఎదగటానికి బదులు కేవలం మార్కుల కోసం జరుగుతున్న యుద్ధంగా మారింది! చాటుమాటుగా కోచింగ్ ఇచ్చేవారు పరీక్షలల్లో వచ్చే క్వశ్చన్ పేపర్లు నిజమైన పేపర్లుగా నమ్మబలికి వారి అనుయాయులతో పరీక్ష ఇచ్చే విద్యార్థులకు నమ్మించి డబ్బు చేసుకుంటున్నారన్న వదంతులు గూడా వున్నాయి! కొన్నిచోట్ల ఆ గెస్ పేపర్లు నిజమైన పేపర్లుగానే బయటపడి రభసగా మారటంతో పరీక్ష రాసిన వారందరికీ భయాందోళనలు కలిగించాయి. ప్రభుత్వాలకు తలవొంపులు గూడా తెచ్చాయి! అందుకనే కోచింగ్ సెంటర్లను నియంత్రించే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి! నిజమైన విద్య ఎప్పుడు అబ్బుతుందంటే నిష్ణాతులైన అధ్యాపకులు బోధించినప్పుడే! అందుకనే ప్రభుత్వ విద్యాలయాలలో అసలు సిసలైన, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను ఎంపిక చేసి విద్యార్థులను నిజమైన విద్యావంతులుగా మార్చే ప్రయత్నం చేయక తప్పదు! ద్రోణాచార్యులు, సాందీపుడు లాంటి ఆచార్య శ్రేష్ఠులు దొరకక పోవచ్చు కానీ ఈ ఆధునిక యుగంలో మన దేశంలో ఎందరో మెరికల్లాంటి టీచర్లు వున్నారు! వారి అవసరం, వారు అందుబాటులో వుండే విధంగా తీర్చి వారిని నియమించగలుగుతే విద్యార్థుల నిజమైన ప్రతిభను వెలికి తీసిన వారవుతారు! ఉద్యోగాలే లక్ష్యంగా వున్నా నైతికంగా విద్య వల్ల శ్రేష్టమైన విజ్ఞానం సంపాదించటం వల్ల విద్యార్థిలోకం పరిపూర్ణ విజ్ఞతతో భాసిల్లి యువకులుగా మారి, దేశాన్ని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టే విధంగా అన్ని రంగాలలో ఆరితేరిన రీతిలో ప్రభుత్వాలకు అందుబాటులో ఉంటారు! ఆ మార్గంలో చర్యలు తీసుకోవాలి! విద్యాలయాలలో టీచర్ల ఉద్యోగాలలో ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి! ఒక పాఠ్యాంశం బోధించే ఉపాధ్యాయుడికి మరో అంశం బోధించే పని లేకుండా జాగ్రత్తలు ప్రభుత్వాలు ఏర్పరిచినప్పుడే సరియైన ఫలితాలు వస్తాయి! లేబరేటరీస్, లైబ్రరీలు, ఆటస్థలాలు, డిజిటల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్, పరిశుభ్ర పరిసరాలు, కనీసం ఒక స్థాయిలో వుండే విధంగా తీర్చిదిద్దినప్పుడు (ప్రతి విద్యాలయంలో) పిల్లలకు ముఖ్యంగా ప్రైమరీ స్థాయి వారికి చదువంటే ప్రేమ ఏర్పడుతుంది. ఆకర్షణీయంగా విద్యావిధానాన్ని రూపుదిద్దగలిగితే విద్యార్థులు ఎగిరిగంతేసి చదువులను, జ్ఞానసంపదను ఎగరేసుకొని పోగలరు! ప్రభుత్వాలు విద్య కోసం గణనీయంగా బడ్జెట్‌ను పెంచాలి! ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సమకూర్చటమంటే ఉచితాలు అప్పనంగా ఇవ్వటం వారిని నిర్వీర్యులను చేసి ఓట్లు దండుకోవటానికే అన్న విమర్శలు ఎక్కువగా వినబడుతున్నాయి! ఉచితంగా వైద్యం, విద్య అందుబాటులో ఉంచగలుగుతే అంతకు మించి ప్రజానీకానికి సంక్షేమ కార్యక్రమాలు ఏముంటాయి? రాజకీయాలు చేయటం ఎప్పుడూ అక్కరకు రావు! ఓట్లు పడుతేనే ప్రభుత్వంలోకి ఏ పార్టీ అయినా రాగలదు! కానీ ప్రజలను అన్ని రకాలుగా యోగ్యులుగా చేయగలిగే విధంగా అన్ని రాజకీయ పక్షాలు ఆలోచించే సమయం వచ్చింది! ఎన్నికల్లో గెలవటమే ప్రధానం కాదు! ఎన్నికల్లో గెలిచిన తర్వాత పార్టీలు తర్వాత ప్రజలందరూ ఒకటే అన్న సమున్నత విధానాన్ని అమలు చేయగలుగుతే దీర్ఘ కాలిక ప్రయోజనాలు ప్రజాస్వామ్య పరిధిలో న్యాయంగా నిజాయితీగా ప్రజలకు సమకూర్చిన వారవుతారు! అందుకనే 'విద్య'ను లక్ష్యంగా పెట్టుకొని గెలిచిన పార్టీ విద్యాధికులను అభ్యున్నతి కోసం తయారు చేయాలి! ●

# జంక్ ఫుడ్‌తో ఇంకిపోతున్న ఆరోగ్యం

బుర్ర మధుసూదన్ రెడ్డి

పాశ్చాత్య దేశాలు వంటింటికి ఎప్పుడో విడాకులు ఇచ్చాయి. వారి ఇండ్లల్లో జంక్ ఫుడ్స్ దండయాత్ర చేశాయి. ఒక్క పూట కూడా జంక్ ఫుడ్ లేకుండా దినం గడవడం లేదు. జంక్ అంటేనే చెత్త అని కదా అర్థం. 1950 తర్వాత మైక్రోబయాలజిస్ట్ మైఖేల్ జాకబాసన్ రూపొందించిన పదం 'జంక్ ఫుడ్' నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్ద పెద్ద మాల్స్ నుంచి చిన్న చిన్న షాపుల వరకు అంతటా జంక్‌ఫుడ్ ప్యాకెట్ దండలే స్వాగతం పలుకుతున్నాయి. చిన్న, పెద్ద అందరూ తరుచుగా ఏదో ఒక సందర్భంలో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్ అండ్ ప్యాకెట్ ఫుడ్స్‌ను అమితానందంగా రుచి చూస్తున్నారు. పిల్లలు మాత్రం జంక్ ఫుడ్ విషవలయంలో చిక్కినట్లే కనిపిస్తున్నది. మన ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యాన్ని శాసిస్తాయి. ఆధునిక వేగవంతమైన జీవనశైలిలో నేటి మానవుడు కొట్టుకుపోతున్నాడు. ఫ్యాషన్ల పేరుతో జంక్ ఫుడ్‌ను లొట్టలేసుకుంటూ ఆరగిస్తున్నాడు, ఆరోగ్యాలను పాడు చేసుకుంటున్నాడు. నేటి డిజిటల్ నరుడు జంక్, ఫాస్ట్‌ఫుడ్స్‌కు బానిస అయిపోయి తమ తమ ఆరోగ్యాలను గాలికి వదిలేస్తున్నాడు. జంక్, ఫాస్ట్ ఫుడ్‌కు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, జంక్‌ఫుడ్ పట్ల జనాల్లో అవగాహన కల్పించవలసిన అగత్యం ఏర్పడిందని గమనించిన అంతర్జాతీయ సమాజం ప్రతి ఏటా 21 జూలై రోజున 'జాతీయ జంక్ ఫుడ్ వ్యతిరేక దినం (నేషనల్ యాంటి జంక్ ఫుడ్ డే)' పాటించడం ఆనవాయితీగా మారింది. సాలీనా సగటున పొగాకు దురలవాట్లతో 8 మిలియన్ల ప్రజలు మరణిస్తే, జంక్ ఫుడ్ అతిగా తీసుకోవడం వల్ల 11 మిలియన్ల ప్రజలు మరణిస్తున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. 70 ఏండ్లు పైబడిన వృద్ధుల్లో సైతం 22 శాతం మరణాలు జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల జరిగినట్లు స్పష్టం అవుతోంది. అధిక కొవ్వులు, చక్కెరలు, ఉప్పు, క్యాలరీలతో పాటు అతి తక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను జంక్ అండ్, ఫాస్ట్‌ఫుడ్ అని నిర్వచిస్తారు. తొలుత అమెరికాలో కాలుమోపిన జంక్ ఫుడ్ సంస్కృతి నేడు విశ్వవ్యాప్తం అయ్యింది. పెద్దపెద్ద మాల్స్



లో జంక్, ఫాస్ట్, ప్రాసెస్డ్, ప్యాకేజ్డ్, బేకరీ, ఫ్రోజెన్ ఫుడ్స్ వినియోగదారులకు నోరూరిస్తూ, వారిని బుట్టలో వేసుకుంటున్నాయి. డిజిటల్ నరులు ప్రయాణాలు అధికంగా చేయడం, భార్యాభర్తలు ఉద్యోగాలు చేయడం, ఆర్థికంగా బలపడడం, బజారు రుచులకు అలవాటు పడడం లాంటి అవలక్షణాలతో జంక్ ఫుడ్ విప్లవం కొనసాగుతున్నది. డీప్ ఫ్రై లేదా అతి వేపుడు చేసిన జంక్ అండ్ ఫాస్ట్ ఆహారం తీసుకోవడం వల్ల స్థూలకాయం లేదా అధిక బరువు, మధుమేహం/బిపీ లాంటి జీవనశైలి రుగ్మతలు, కొలెస్ట్రాల్ పెరగడం, గుండె జబ్బులు, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధ వ్యాధులు, అలసట, సోమరితనం, మానసిక అస్థిరత, ఏకాగ్రత లోపించడం, దంత సమస్యలు, కొన్ని రకాల క్యాన్సర్లు, కాలేయం/ మూత్రపిండ సమస్యలు, పోషకాహార లోపం, నిరాశ, దురలవాటుగా మారడం, మానసిక సమస్యలు లాంటి అనారోగ్యాలు కలుగుతాయి. మహా నగరాలకు పరిమితమైన జంక్ ఫుడ్ నేడు వాడవాడల్లో తిష్ట వేసింది. 1996లో మెక్‌డొనాల్డ్ సెంటర్ల రాకతో నేడుఅలాంటి శాఖలు 400లకు పైగా ఉన్నాయి. నేడు భారత్‌లో దాదాపు 400 వరకు పేరుమోసిన సెంటర్లు నడుస్తున్నాయి. జంక్ ఫుడ్‌ను ప్రచారం చేస్తున్నాయి. నేడు బహుళ జాతి సంస్థలు నెలకొల్పిన మాల్స్ ద్వారా జంక్‌ఫుడ్ విరివిగా అమ్ముడుపోతున్నది, ఆరోగ్యాలను కాటు వేస్తున్నది. బర్గర్లు, పిజ్జాసు, వైట్ బ్రెడ్, వేపుడు పదార్థాలు, కుక్కీస్, పొటా టో చిప్స్, ఐస్ క్రీమ్స్, శీతల పానీయాలు, చాకొలేట్స్, ప్రాసెస్డ్ మీట్, స్ట్రీట్ ఫాస్ట్ ఫుడ్స్ లాంటిరూపాల్లో జంక్ ఫుడ్స్‌గా మార్కెట్‌లను ముంచెతున్నాయి. భారత్‌లో ప్రతి ఏటా జంక్ ఫుడ్ వినియోగం 10 శాతం వరకు పెరగడం తో పాటు 93శాతం వరకు పిల్లలు వారానికి రెండు పూటలు జంక్ ఫుడ్, 56శాతం పిల్లలు ఐస్‌క్రీమ్స్/ చాకొలెట్స్ తింటున్నారు. కౌమార యువత రోజుకు ఒక్కసారైనా ప్యాకెట్ ఫుడ్స్ తింటున్నట్లు, 40శాతం పిల్లలలంచ్‌బాక్సుల్లో ప్యాకెట్ ఫుడ్స్ ఉంటున్నాయని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ఇంటి వంటలు ఆరోగ్య ప్రదాయినులని, బజారు చిరుతిండ్లు బేజారు చేస్తాయని, జంక్‌ఫుడ్స్ తింటే రోగాలు దండయాత్ర చేస్తాయని, మన ఆహారమే మన ఆరోగ్యానికి మూలమని తెలుకొని, అనునిత్యం పోషకాహారం తీసుకుంటూ, సంపూర్ణ ఆయురారోగ్యాలతో జీవిద్దాం. ●

# ప్రజావాక్కు



## ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌కు సగం జనరల్ బోగీలు వెయ్యాలి

వందే భారత్, వందే మాతరం రైళ్లు ఎవడు అడిగాడు? అన్నీ ఏసీ రైళ్లు వేస్తున్నారు. రైల్వే మంత్రికి ప్రజల సామాజిక పరిస్థితులు తెలుసా! సామాన్యుడు రైలు ఎక్కాలంటే యుద్ధం చేసినంత పని అవుతుంది. ప్యాసింజర్ రైళ్లు తీసేసి వాటిని ఎక్స్‌ప్రెస్ రైళ్లుగా మార్చారు. ఒకటి రెండు జనరల్ బోగీలు వేస్తారు. బుద్ధి జ్ఞానం ఉందా ఆ అధికారులకు అన్న అనుమానం వస్తుంది. గతంలో కాకినాడ తిరుపతి ప్యాసింజర్ రైలు ఉండేది. తిరుపతి వెళ్లే వారికి అది చాలా అనుకూలంగా ఉండేది. ఇప్పుడు దాన్ని రద్దుచేసి ఎక్స్‌ప్రెస్ చేసి ఒకటి రెండు జనరల్ బోగీలు వేశారు. రైల్వే మంత్రిని ఈ జనరల్ బోగీల్లో ప్రయాణం చెయ్యమని చెప్పండి. ప్రయాణికుల బాధలు తెలుస్తాయి. కృష్ణ ఎక్స్‌ప్రెస్ కూడా మొదటిలో అన్ని జెనరల్ బోగీలు ఉండేవి. ఒకటి రెండు రిజర్వేషన్ ఉండేది. ఇప్పుడు అన్ని రిజర్వేషన్ చేసి, ఒకటో రెండో జనరల్ బోగీలు వేశారు. ప్రతి ఎక్స్‌ప్రెస్‌కు సగంజనరల్ బోగీలు వేయాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

## కుటుంబ సభ్యులందరికి ఒకే చోట..

సర్ కొన్నిచోట్ల బీఎల్ఓ తెలియకనో, చాదస్తమో, మరి యోంటోగాని ఫాం ఒకే కుటుంబం ఓటర్‌లిస్ట్ గతంలో తప్పులుగా నమోదుచేసి బిలెవోలు నేటికీ నాల్గురు నాలుగు పామ్ తీసుకువచ్చి మాకు ఇవ్వాలని అనడం వారి విధుల పట్ల వారికి ఎంతవరకు అవగాహన ఉందో దీన్ని బట్టి అర్థమవుతోంది. ఇప్పటికైనా విషయంతెలుసుకొని వ్యవహరించాలి. తప్పుడు సమాచారం మిడిమిడి జ్ఞానంతో ఉండకూడదు. మీకే కదా పనిభారం తగ్గుతుంది. ఒకే కుటుంబంలోని ఓటర్ లిస్ట్‌ఒకే బూతులో ఉండాలి. గతంలోనీ తప్పులు వేరువేరు బూతులలో మళ్ళీ జరుగకుండా జాగ్రత్త తీసుకోవాల్సిందే. ఎన్నికల కమిషన్ అధికారులు నమోదు చేసేవిధంగా ఉండాలి.

- సింగు లక్ష్మీనారాయణ, కరీంనగర్

## అదనపు టీచర్లను ఏర్పాటు చేయాలి

కరీంనగర్ జిల్లాలో ఉన్న ఎస్సీ సైనిక్ స్కూల్, వరంగల్ జిల్లాలో ఉన్న ఎస్టిసైనిక్ స్కూల్‌లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఎక్కువ సిబ్బంది ఉండాలి. అన్ని టీచింగ్ సబ్జెక్టులతో పాటుగా జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్, పోటీ పరీక్షలు ఆర్థిక సామాజిక విషయాలపై అవగాహన కోసం మిగులు టీచింగ్ సిబ్బందిని ఉపయోగించాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

## రైతుల ఆదాయం పెంచాలి

కేంద్ర ప్రభుత్వం ఎప్పుడు రైతులఆదాయం రెట్టింపు చేయాలి అని కోరికను వెళ్ళిబుచ్చుతూ ఉంటుంది. నిజమే రైతుల ఆదాయం రెట్టింపు చేయవలసిందేఅందులో సందేహం లేదు. కరోనా, యుద్ధ వాతావరణం సృష్టించిన సంక్షోభ పరిస్థితులు రైతులు ఆయిల్ ఫామ్‌వైపు వెళ్ళేట్టు చేసాయి. రైతులు ఆయిల్‌ఫామ్ ద్వారా కొంతపంట వైవిధ్యతను ఆదాయన్ని పొందుతున్నారు. ఉపాధి హామీ ద్వారా ఒక పిట్ తీసి అందులో మొక్క పెడితే దాని ద్వారా వచ్చేఆదాయం 33 రూపాయలు ఆలా ఎకరం స్థలంలో 1000 మొక్కలు పెడితే వచ్చే ఆదాయం ఎంతో మనమే ఊహించవచ్చు. అంత మాత్రమే కాదు వాటిని ఎకరం స్థలంలో పెట్టి కాపాడినందుకు నెలకు ఒక మొక్కకు 20 రూపాయల చొప్పున చెల్లించే ఈ అవకాశం రైతులు ఉపయోగించుకుంటే బాగుంటుంది. ఇలా చేస్తే రైతుల ఆదాయం పెరగడం మాత్రమే కాదు వారి జీవన ప్రమాణ స్థాయీ కూడా పెరుగుతుంది.

- భారత అవినాష్, జనగామ

## ఉత్తీర్ణత శాతం పెంచాలి

పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత శాతం పెరగాలని ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యం కావడంతో ప్రతి సబ్జెక్టు టీచర్ ఒక్కో రోజు ఒక్కో స్టడీ అవర్ నిర్వహించవలసి వస్తూ ఉన్నది ఉదయము సాయంత్రం రెండు గంటలు అదనంగా పని చేయవలసి వస్తూ ఉన్నది. ఇలాంటి ఈ నేపథ్యంలో ప్రతి దానికి ప్రధానోపాధ్యాయుడు అనుమతి అవసరమైన సందర్భంలోప్రధానోపాధ్యాయుడు కూడా ఉదయము సాయంత్రం సదరు ఉపాధ్యాయునితో ఖచ్చితంగా ఉండేలాంటి నియమ నిబంధన ప్రభుత్వం ఎందుకు విధించడం లేదు? అతనిని బాధ్యుడిగా ఎందుకు చేయడం లేదు? భార్యాభర్తల అయిన వారు వేరువేరు పాఠశాలల్లో పని చేసినప్పటికీ ఒకే ఇంట్లో ఉంటారు. వారికి జీతభత్యాలతో పాటు ఇస్తున్నటువంటి ఇంటి అద్దె ఇద్దరికీ ఇవ్వడం ఎంతవరకు సమంజసం?

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## ఆకాశం వైపు అన్నదాత చూపు

జూలై మాసం గడుస్తున్న ఇంకా సరిపడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాగే ఉంటే అన్నదాతలు అప్పులపాలు అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ప్రత్యామ్నాయ పంటల పట్ల అవగాహన కల్పించాలి. రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా


గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# వాన కోసం ఎదురు చూపులు.. కరవు కోరల్లో రైతులు

మేకిరి దామోదర్

తెలంగాణలో జూలై సగం దాటినా ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. సాధారణంగా ఈ సమయానికి పచ్చదనంతో కళకళలాడాల్సిన పొలాలు ఇంకా బీడుగా కనిపిస్తున్నాయి. విత్తనాలు చేతిలో పట్టుకుని రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి కొరతపై చర్చలు మొదలయ్యాయి. చెరువులు, కుంటలు, వాగులు నీరులేక వెలవెలబోతున్నాయి. వర్షం కురవకపోతే కేవలం పంటలేకాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం కుదేలయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇటీవలి వాతావరణ విశ్లేషణలు ఈ ఏడాది సూపర్ ఎల్‌నినో ప్రభావం కొనసాగవచ్చని, దాని కారణంగా దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటేతక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని సూచిస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాధారణ స్థాయికంటే గణనీయంగా తక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది. వర్షపాతం లోటు కొన్ని ప్రాంతాల్లో 30నుంచి 40శాతం వరకు ఉండే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇది కొనసాగితే కరవు పరిస్థితులు ఏర్పడే ప్రమాదాన్ని విస్మరించలేం. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం వల్ల ఏర్పడే వాతావరణ దృగ్విషయం. ఈ ప్రభావం ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం నమూనాలను మార్చేస్తుంది. భారత నైరుతి రుతుపవనాలపై కూడా దీని ప్రభావం పడుతుంది. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షాలు తగ్గడం, వేడి తరంగాలు అధికం కావడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి. గతంలో కూడా బలమైన ఎల్‌నినో సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిన్న సందర్భాలున్నాయి. ఇప్పుడు శాస్త్రవేత్తలు 'సూపర్ ఎల్‌నినో' అవకాశాలపై హెచ్చరిస్తుండటం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తుంది. తెలంగాణ వ్యవసాయం ఇప్పటికీ ప్రధానంగా వర్షాధారంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి పంటల సాగు సమయానికి వర్షాలు అత్యంత కీలకం. ఇప్పటికే విత్తే కాలం ఆలస్యం కావడంతో రైతులు తీవ్ర అనిశ్చితిలో ఉన్నారు. ఆలస్యంగా విత్తిన పంటలకు దిగుబడి తగ్గే అవకాశం ఎక్కువ. తిరిగి విత్తనాలు కొనుగోలు చేయడం, భూమిని మళ్లీ సిద్ధం చేయడం రైతులకు అదనపు ఆర్థిక భారంగా మారుతోంది. వ్యవసాయ శాస్త్రవేత్తలు ఈ పరిస్థితుల్లో తక్కువ నీటితో సాగయ్యే జొన్న, సజ్జ, రాగులు, పెసలు, కందులు, మినుములు వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మళ్లాలని సూచిస్తున్నారు. మార్కెట్, నేల స్వభావం, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ మండల స్థాయిలో రైతులకు శాస్త్రీయ సలహాలు అందించాలి. రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులు, మధ్యతరహా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు ఆశించిన స్థాయిలో లేకపోతే ముందుగా ప్రభావం తాగునీటిపైనే పడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో



బోర్లు ఎండిపోవడం, భూగర్భ జలమట్టాలు పడిపోవడం, పట్టణాల్లో కూడా నీటి సరఫరాపై ఒత్తిడి పెరగడం వంటి పరిణామాలు సంభవించవచ్చు. భారతదేశంలో వినియోగించే మంచినీటిలో దాదాపు 80 శాతానికి పైగా వ్యవసాయ రంగమే వినియోగిస్తోంది. వర్షాలు తగ్గితే సాగునీటి అవసరాలు పెరుగుతాయి. అదే సమయంలో తాగునీటి అవసరాలను కూడా తీర్చాల్సి వస్తుంది. ఈ పరిస్థితిలో నీటి వినియోగంపై కఠినమైన ప్రణాళిక అవసరం. కరవు అంటే కేవలం పంటలు ఎండిపోవడం మాత్రమే కాదు. గ్రామీణఉపాధి తగ్గిపోవడం, వ్యవసాయ కూలీలకు పని లేకపోవడం, పశుగ్రాసం కొరత, పాల ఉత్పత్తి తగ్గడం, ఆహార ధరలు పెరగడం, గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరగడం వంటి అనేక సామాజిక-ఆర్థిక సమస్యలు వెంటవస్తాయి. చిన్న రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, పశుపోషకులే మొదటిగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. పరిస్థితి మరింత దిగజారకముందే ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన కరవు నివారణ కార్యాచరణ ప్రారంభించాలి. మండలాల వారీగా వర్షపాతం, పంటల పరిస్థితిపై నిరంతర పర్యవేక్షణ. తాగునీటి సరఫరాకు ప్రత్యేక కార్యాచరణ. పశుగ్రాస నిల్వ కేంద్రాల ఏర్పాటు. ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన, ఉచిత సాంకేతిక సలహాలు. పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, వడ్డీ భారం తగ్గింపు. పంట బీమా క్లెయిమ్‌లను వేగవంతం చేయడం. ఉపాధి హామీ పనులను విస్తరించి గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడం. మైక్రో ఇరిగేషన్, డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతులకు అధిక ప్రోత్సాహం. చెరువులు, కుంటలు, వర్షపు నీటి సంరక్షణ పనులను అత్యవసరంగా చేపట్టడం. కరవు నివారణలో ప్రభుత్వం ఒక్కటే బాధ్యత వహించదు. ప్రతి కుటుంబం నీటిని పొదుపుగా వినియోగించాలి. వర్షపు నీటి సంరక్షణను అలవాటు చేసుకోవాలి. చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురికాకుండా స్థానిక సంస్థలు చర్యలు తీసుకోవాలి. భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించకుండా జాగ్రత్తలు పాటించాలి. వాతావరణ మార్పుల యుగంలో నీటి సంరక్షణ ఒక సామాజిక ఉద్యమంగా మారాల్సిన అవసరం ఉంది. కరువును ఎదుర్కోవాలంటే ప్రతి ఏడాది వర్షాలపై ఆధారపడే వ్యవస్థకు బదులుగా వాతావరణ మార్పులకు అనుగుణమైన వ్యవసాయ విధానాలను అవలంబించాల్సిన సమయం వచ్చింది. తక్కువ నీటితో అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలు, పంటల వైవిధ్యీకరణ, నీటి పొదుపు సాంకేతికతలు, వాతావరణ సూచనలను రైతులకు వేగంగా చేరవేసే డిజిటల్ వ్యవస్థలు, గ్రామస్థాయిలో నీటి బడ్జెట్ రూపొందించడం వంటి చర్యలు భవిష్యత్తులో కరవు తీవ్రతను తగ్గించగలవు. తెలంగాణ మరోసారి కరవు నీడలోకి జారిపోకుండా ఇప్పుడే అప్రమత్తం కావాల్సిన సమయం ఇది. కరవు అనేది కేవలం వర్షాల లేమి కాదు, అది పాలనా సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల బాధ్యతను పరీక్షించే పరిస్థితి. ఆకాశం నుంచి కురిసే ప్రతిచుక్కను ఒడిసిపట్టే సంకల్పం, రైతును నిలబెట్టే విధానాలు, నీటిని కాపాడే సామాజిక చైతన్యం కలిసివస్తేనే ఈ సవాలును అధిగమించగలం. నేడు తీసుకునే ముందస్తు నిర్ణయాలే రేపటి రాష్ట్ర జీవజలంగా నిలుస్తాయి. వర్షాల కోసం ఎదురుచూడడం ఒక్కటే కాదు, కరవునుముందే అడ్డుకోవడం మనందరి సామూహిక బాధ్యత కావాలి. ●

# సిట్‌ను పునర్వ్యవస్థీకరించండి



## ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి సూచించిన సుప్రీంకోర్టు

## రామమందిర విరాళాల వివాదం

**న్యూఢిల్లీ, జులై 20:** శ్రీ రామ్ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్‌కు అందిన విరాళాలు, కానుకల నిర్వహణలో జరిగినట్లు ఆరోపించబడిన ఆర్థిక అవకతవకలపై దర్యాప్తు చేయడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను పునర్వ్యవస్థీకరించడాన్ని పరిశీలించాలని సుప్రీంకోర్టు సోమవారం ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ దర్యాప్తునకు ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వం వహించాలని, దానిని 'తార్కిక ముగింపు'కు తీసుకువెళ్లాలని కూడా పేర్కొంది. భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఈ అంశాన్ని రాజకీయం చేయవద్దని హెచ్చరించింది. ఒక నేరం జరిగినట్లు ఆరోపణలు వచ్చినప్పుడు, దానిపై నిష్పక్షపాత దర్యాప్తు జరిగేలా చూడటమే న్యాయస్థానాల బాధ్యత అని వ్యాఖ్యానించింది.

విచారణ సందర్భంగా, కేంద్రం, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఒక సీల్డ్ కవర్‌లో స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసినట్లు తెలియజేశారు. 'దర్యాప్తు కొనసాగుతోంది. ఎనిమిది మందిని అరెస్టు చేశారు. ఈ దశలో ఎక్కువ వివరాలు వెల్లడించలేం' అని ఎస్‌జి మెహతా తెలిపారు.

దర్యాప్తు బృందం కూర్పు వివరాలను సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కోరగా, ఆరోపణల వాస్తవికతను నిర్ధారించడానికి మాత్రమే గతంలో సిట్‌ను ఏర్పాటు చేశారని, అదే స్వయంగా నేర దర్యాప్తు చేపట్టడం లేదని ఎస్జీ మెహతా స్పష్టం చేశారు. 'ఇప్పుడు ఎవరు దర్యాప్తు చేస్తున్నారు? దర్యాప్తు అధికారులు ఎవరు?' అని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దీనికి స్పందిస్తూ, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ పర్యవేక్షణలో సంబంధిత పోలీసు అధికారులు దర్యాప్తు నిర్వహిస్తున్నారని ఎస్జీ మెహతా తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన సిట్‌లో ఇద్దరు ఐఏఎస్ అధికారులు, ఒక సీనియర్ ఐపి ఎస్ అధికారితో సహా సీనియర్ అధికారులు ఉన్నారని సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. కొనసాగుతున్న దర్యాప్తును, ఈ విషయంపై ఇప్పటికే అవగాహన ఉన్న ఒక సీనియర్ ఐపిఎస్ అధికారి నేతృత్వంలో పునర్వ్యవస్థీకరించిన సిట్‌కు అప్పగించాలని సూచించింది. 'కొనసాగుతున్న దర్యాప్తు కోసం ఒక సిట్‌ను ఏర్పాటు చేయండి. ఈ అధికారికి ఈ విషయంపై అవగాహన ఉంది కాబట్టి, ఆయనే దానికి నేతృత్వం వహించవచ్చు. ప్రభుత్వంతో మాట్లాడి, సిట్ ను పునర్వ్యవస్థీకరించండి. ఏవైనా అదనపు ఆదేశాలు అవసరమైతే, తాము వాటిని జారీ చేస్తాము' అని సుప్రీంకోర్టు పేర్కొంది. సిట్ పునర్వ్యవస్థీకరణ ప్రతిపాదనపై స్టేటస్ రిపోర్ట్, రాష్ట్ర ప్రభుత్వ స్పందనను పరిశీలించిన తర్వాత, వచ్చే సోమవారం ఈ విషయాన్ని మళ్లీ విచారణకు స్వీకరిస్తామని సుప్రీంకోర్టు సూచించింది. 'తాము కేవలం హెచ్చరిస్తున్నాము, ఈవిషయాన్ని రాజకీయం చేయవద్దు. దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగి, తార్కిక ముగింపునకు చేరాలి' అని సీజేఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానిస్తూ, 'కోర్టులు రాజకీయాలకు వేదిక కాదు' అని కూడా పేర్కొంది.

# హైకోర్టు జడ్జిలకు ఒకే విధానం

## అత్యున్నత కమిటీని ఏర్పాటు చేయండి

## 3 నెలల్లోగా సిఫారసుల నివేదికివ్వండి

## కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 20:** దేశంలోని పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు సౌకర్యాల కల్పనలో ఏకరూప విధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇందుకోసం ఒక కమిటీని ఏర్పాటుచేసి, మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. పదవీ విరమణ చేసిన హైకోర్టు న్యాయమూర్తులకు లభించే భద్రత, ఇతర పదవీ విరమణానంతర సౌకర్యాలకు సంబంధించి పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల సంఘం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారించింది. తమ ముందు లేవనెత్తిన ఆందోళనలను విన్న సిజెఐ, 'రాష్ట్రానికి రాష్ట్రానికి ఇటువంటి సౌకర్యాలు మారడానికి ఎటువంటి కారణం లేదుకాబట్టి, ఈ సౌకర్యాలను ఏకరూప ప్రాతిపదికన నిర్ధారించాలనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ దృక్కోణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఏకరూప మార్గదర్శకాలను, అలాగే ఆర్థిక సహాయం అందించే విధానం, యంత్రాంగాన్ని నిర్దేశించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తాము భారత కేంద్ర ప్రభుత్వాన్ని కోరాము' అని అన్నారు. దీని ప్రకారం, ఏర్పాటు చేసిన కమిటీ, అది ఏర్పడిన తేదీ నుండి మూడు నెలలలోపు తన సిఫార్సులను కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని, అలాగే వాటిని కోర్టు ముందు కూడా ఉంచాలని ధర్మాసనం ఆదేశించింది.

# 'అపార్' ఐడి నిర్బంధం కాదు, ఐచ్ఛికమే!

## డేటా రక్షణ ఆందోళనలు పరిశీలించాలి

## సిబిఎస్ఇకి సుప్రీంకోర్టు ఆదేశాలు

**న్యూఢిల్లీ, జులై 20:** 'ఆపార్' (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) ఐడిల జారీ కోసం ఇచ్చే సమ్మతి పత్రంలో స్పష్టమైన "ఆప్ట్ అవుట్" ఎంపికను తప్పనిసరి చేస్తూ ఒడిశా హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సిబిఎస్ఇ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్య కాంత్, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం, ఎపిఎఎఆర్ (అపార్) పథకం స్వచ్ఛందంగా ఉండేలా, తల్లిదండ్రుల సమ్మతి పత్రాలలో సమ్మతిని నిరాకరించడానికి స్పష్టమైన అవకాశం ఉండేలా తగిన ఆదేశాలు జారీ చేస్తామని సూచించింది. 'ఒడిశా హైకోర్టు ఉత్తర్వును అంగీకరించినందున... ఈ తీర్పును పాన్‌ఇండియా ప్రాతిపదికన అమలు చేయాలి. ఈ సమస్యలను కూడా పరిశీలించాలని తాము సిబిఎస్ఇని ఆదేశిస్తున్నాము," అని విచారణ సందర్భంగా సిజెఐ కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం వ్యాఖ్యానించింది. సిబిఎస్ఇ సర్క్యులర్లు డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డిపిడిపి) చట్టం, 2023తో సహా అమలులో ఉన్న చట్టానికి లోబడి ఉంటాయని, ఈ పథకాన్ని ప్రస్తుత చట్టపరమైన చట్రానికి అనుగుణంగా అమలు చేయాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'అపార్' ఐడి పథకం రాజ్యాంగ బద్ధతను, బోర్డు పరీక్షల రిజిస్ట్రేషన్ కోసం 'అపార్' ఐడిలను తప్పనిసరి చేయాలన్న సిబిఎస్ఇ నిర్ణయాన్ని సవాలు చేస్తూ నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులు దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపి ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

# హిందూ వివాహం ఒక ఒప్పందం కాదు

## భార్యపై ఆసక్తి పోయిందంటే కుదరదు: కర్ణాటక హైకోర్టు స్పష్టీకరణ

## విడాకుల అభ్యర్థనను కొట్టివేసిన కోర్టు



**బెంగళూరు, జులై 20:** కేవలం తన జీవిత భాగస్వామిపై ఆసక్తి పోయిందన్న కారణంతో ఒక వ్యక్తి వివాహబంధం నుండి వైదొలగడం లేదా విడాకులు కోరడం కుదరదని కర్ణాటక హైకోర్టు విస్పష్ట తీర్పునిచ్చింది. న్యాయమూర్తులు డి.కె.సింగ్, టి.ఎం.నాడాఫ్‌లతో కూడిన ధర్మాసనం, హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం అని, అది కేవలం ఒక ఒప్పందం కాదని నొక్కి చెప్పింది. కాబట్టి, వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం కొనసాగుతుందని పేర్కొంది. 'హిందూ చట్టం ప్రకారం వివాహం అనేది ఒక పవిత్ర బంధం, అది ఒప్పందం కాదు. వివాహం జరిగిన తర్వాత అది జీవితకాలం ఉంటుంది. అవతలి వ్యక్తిపై ఆసక్తి లేదన్న కారణంతో ఎవరూ ఆ వివాహ బంధం నుండి వైదొలగలేరు' అని ధర్మాసనం తీర్పునిచ్చింది. హిందూ వివాహ చట్టం, 1955లోని సెక్షన్ 13(1ఎ) కింద విడాకులు కోరుతూ భర్త దాఖలు చేసిన అప్పీల్‌ను కొట్టివేసే క్రమంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రేమించి పెళ్లి చేసుకుని, ఇప్పుడు దాదాపు వయోజనురాలైన కుమార్తెకు తండ్రి అయిన భర్త, కేవలం వివాహంపై ఆసక్తి కోల్పోయానని చెబుతూ కోర్టును ఆశ్రయించడం ద్వారా తన తప్పును తానే సొమ్ము చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని హైకోర్టు గమనించింది. హిందూ చట్టం ప్రకారం వివాహం ఒక సంస్కారం, ఒప్పందం కాదని, ఆసక్తి లేదనే కారణంతో ఒక పక్షం దాని నుండి వైదొలగలేదని కోర్టు పునరుద్ఘాటించింది. అందువల్ల, ఫ్యామిలీ కోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎటువంటి కారణం కనిపించక పోవడంతో, అప్పీల్‌ను కొట్టివేసింది.

# చర్చలు అర్థవంతంగా, వాస్తవాల ఆధారంగా సాగాలి

## పార్లమెంటు సమావేశాల సందర్భంగా విపక్షాలకు మోడీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ,జులై 20:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభానికి ముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు, రాజకీయ పార్టీలకు కీలక సందేశం ఇచ్చారు. ఈ సమావేశాలు దేశానికి అత్యంత ఫలవంతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, పార్లమెంట్‌లో చర్చలు తర్కం, వాస్తవాల ఆధారంగా సాగాలని అన్నారు. వాదనలు, వాస్తవాలు ఉన్నచోట అనవసరమైన రాద్ధాంతం అవసరం లేదు. వాస్తవాలు బలంగా ఉంటే గొంతు పెంచాల్సిన అవసరం ఉండదని ప్రధాని వ్యాఖ్యానించారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు మీడియాతో మాట్లాడిన ప్రధాని మోడీ రుతుపవనాలు ఎంత ముఖ్యమో, వర్షాకాల పార్లమెంట్ సమావేశాలు కూడా అంతే ఫలవంతంగా సాగాలని ఆకాంక్షించారు. రుతుపవనాలు చురుకుగా ఉండి రైతులకు మేలు చేయడంతో పాటు, పార్లమెంట్ సమావేశాలు కూడా సజావుగా జరిగి దేశ ప్రయోజనాలకు దోహదపడాలని కోరుకున్నారు. దేశ అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపట్టిన పలు కార్యక్రమాలను కూడా ప్రధాని వివరించారు. ఇటీవల రాజస్థాన్లో భారీ చమురు శుద్ధి కర్మాగారాన్ని దేశానికి అంకితం చేసినట్లు గుర్తు చేశారు. అలాగే దేశంలోని మూడో సెమీకండక్టర్ ప్లాంట్ ప్రారంభం, గ్రీన్ హైడ్రోజన్తో నడిచే రైలు ప్రారంభం వంటి ప్రాజెక్టులు భారత సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనాలని పేర్కొన్నారు. ప్రపంచంలో కొద్ది దేశాలకు మాత్రమే ఉన్న గ్రీన్ హైడ్రోజన్ రైలు సాంకేతికత ఇప్పుడు భారత్లో అందుబాటులోకి రావడం గర్వకారణమని చెప్పారు ప్రధాని మోడీ. గత నెలలో భారత్ సాధించిన పలు విజయాలను ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. జాతీయ, అంతర్జాతీయ, అంతరిక్ష రంగాల్లో దేశం విశేష పురోగతి సాధించిందని తెలిపారు. ఇటీవల ఒక భారతీయ యువత నేతృత్వంలోని స్టార్టప్ అంతరిక్ష రంగంలో కీలక మైలురాయిని చేరుకోవడం దేశానికి గర్వకారణమని అన్నారు. గత ఏడాది భారతీయ వ్యోమగామి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉండగా, ఇప్పుడు భారత యువత అంతరిక్ష సాంకేతిక రంగంలో కొత్త అవకాశాలను సృష్టిస్తోందని పేర్కొన్నారు. ఇది యువత సామర్థ్యం, ఆశయాలు అపరిమితమని



ప్రపంచానికి చాటి చెబుతోందని అన్నారు మోడీ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపిన వివరాల ప్రకారం, జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు 25 రోజుల వ్యవధిలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు కొనసాగనున్నాయి. ఈ కాలంలో మొత్తం 19 సమావేశాలు జరగనున్నాయి. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై చర్చలు, సంప్రదింపులు, కీలక నిర్ణయాలు ఈ సమావేశాల్లో తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం, ప్రతిపక్షాలు ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించి ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేయాలని ఆకాంక్షించారు ప్రధాని నరేంద్ర మోడీ.



# డెంగ్యూ వ్యాక్సిన్ 'క్యూడెంగా' రెడీ

**న్యూఢిల్లీ,జులై 20:** వర్షాకాలం ప్రారంభమైతే దేశవ్యాప్తంగా డెంగ్యూ కేసులు వేగంగా పెరుగుతుంటాయి. ప్రతి ఏడాది వేలాది మంది ఆసుపత్రుల్లో చికిత్స పొందుతుండగా, కొన్నిసార్లు ప్రాణాపాయ పరిస్థితులు కూడా ఎదురవుతుంటాయి. ఈ నేపథ్యంలో భారతదేశానికి ఊరటనిచ్చే కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశంలో తొలిసారిగా డెంగ్యూ నివారణ కోసం క్యూడెంగా వ్యాక్సిన్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా ఆమోదం లభించింది. ఈ వ్యాక్సిన్ ప్రత్యేకత ఏమిటంటే, టీకా తీసుకునే ముందు డెంగ్యూ పరీక్ష చేయించుకోవాల్సిన అవసరం లేదు. గతంలో డెంగ్యూ వచ్చినవారు అయినా, ఎప్పుడూ డెంగ్యూ రాకపోయినా ఈ టీకాను తీసుకోవచ్చు. దీంతో డెంగ్యూ నివారణలో ఇది ఒక కీలక ముందడుగుగా వైద్య నిపుణులు భావిస్తున్నారు. క్యూడెంగా వ్యాక్సిన్‌ను రెండు డోసులుగా ఇస్తారు. మొదటి డోస్ తీసుకున్న మూడు నెలల తర్వాత రెండో డోస్ వేయించుకోవాలి.

ఈ టీకాను చర్మం కింద (సబ్‌క్యూటేనియస్) ఇంజెక్షన్ రూపంలో ఇస్తారు. జపాన్‌కు చెందిన ఔషధ సంస్థ టకేడా అభివృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌ను 4 నుంచి 60 సంవత్సరాల వయస్సు గల వారికి వినియోగించేందుకు అనుమతించారు. ప్రపంచవ్యాప్తంగా డెంగ్యూ కేసులు అధికంగా నమోదయ్యే దేశాల్లో భారత్ ఒకటి. ప్రపంచ డెంగ్యూ భారంలో దాదాపు మూడింట ఒక వంతు కేసులు భారతదేశంలోనే నమోదవుతున్నట్లు అంచనా. గత రెండు దశాబ్దాల్లో దేశంలో డెంగ్యూ కేసులు దాదాపు 11 రెట్లు పెరిగినట్లు ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. గత ఏడాదిలోనే లక్షకు పైగా కేసులు నమోదయ్యాయి. అయితే అసలు సంఖ్య ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా. డెంగ్యూ వైరస్‌కు నాలుగు రకాల (సెరోటైప్స్) ఉన్న సంగతి తెలిసిందే. ఈ నాలుగు రకాల వైరస్‌ల నుంచి రక్షణ కల్పించేలా క్యూడెంగాను రూపొందించారు. కంపెనీ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ వ్యాక్సిన్‌పై 28 వేల మందికి పైగా క్లినికల్ పరీక్షలు నిర్వహించారు. రెండో డోస్ తర్వాత 12 నెలలకు డెంగ్యూ నివారణలో 80.2 శాతం ప్రభావవంతంగా, డెంగ్యూ కారణంగా ఆసుపత్రిలో చేరే ప్రమాదాన్ని 90.4 శాతం వరకు తగ్గించడంలో ఇది సమర్థవంతంగా పనిచేసిందని అధ్యయనాలు సూచించాయి. దీర్ఘకాలిక పరిశోధనల్లో కూడా 4.5 సంవత్సరాల తర్వాత ఆసుపత్రి చికిత్స అవసరాన్ని 84.1 శాతం వరకు తగ్గించినట్లు గుర్తించారు.

ఈ వ్యాక్సిన్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే సిఫార్సు చేసింది. నాణ్యత, భద్రత, ప్రభావం వంటి అంతర్జాతీయ ప్రమాణాలను ఇది అందుకుందని డబ్ల్యుహెచ్ఓ ప్రీక్వాలిఫికేషన్ కూడా పొందింది. ప్రస్తుతం భారత్‌తో పాటు 43 దేశాల్లో ఈ వ్యాక్సిన్‌కు అనుమతి లభించింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే 3.2 కోట్లకు పైగా డోసులు పంపిణీ అయ్యాయి. బ్రెజిల్, అర్జెంటీనా, కొలంబియా, ఇండోనేషియా వంటి దేశాల్లో ప్రజారోగ్య టీకా కార్యక్రమాల్లో దీనిని వినియోగిస్తున్నారు.

# సుప్రీం జడ్జిల పెంపు బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్రం

**న్యూఢిల్లీ,జులై 20:** సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను మరోసారి పెంచేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం రూపొందించిన బిల్లును కేంద్రం లోక్‌సభలో సోమవారం ప్రవేశపెట్టింది. సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) అమెండ్‌మెంట్ బిల్, 2026ను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్‌పాల్ సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనిప్రకారం ఇప్పటికే ఉన్న సుప్రీంకోర్టు (నంబర్ ఆఫ్ జడ్జెస్) యాక్ట్, 1956ను మార్చనున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టడం విశేషం. ప్రస్తుతం సుప్రీంకోర్టులో 33 మంది జడ్జీలున్నారు. ఈ బిల్లు ఆమోదం పొందితే సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్య 37కు పెరుగుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో నీట్ యూజీ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ప్రతిపక్షాల ఆందోళన మధ్యే ప్రభుత్వం ఈ బిల్లును కేంద్రం సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు కొత్తదేం కాదు. దీనిపై కేంద్రం గతంలోనే ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. దీనికి రాష్ట్రపతి కూడా ఇంతకుముందే ఆమోదం తెలిపారు. ఈ ఆర్డినెన్స్ ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను 37కు పెంచు కోవచ్చు. దీన్ని పూర్తిస్థాయి చట్టంగా తీసుకురావాలని కేంద్రం ప్రయత్నిస్తోంది. అందుకోసమే బిల్లును రూపొందించి, ప్రవేశపెట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 ప్రకారం సుప్రీంకోర్టు జడ్జీల సంఖ్యను చట్టం ద్వారా పార్లమెంటే నిర్ణయించవచ్చు. దీనికోసం సాధారణ మెజారిటీ ఉంటే చాలు. ఇతర రాజ్యాంగ సవరణ చట్టాలలాగా మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం లేదు. దీంతో ఈ బిల్లు త్వరగానే ఆమోదం పొందే అవకాశం ఉంది.

# హమాస్ కొత్త అధినేతగా ఖలీల్ అల్‌హయ్యా



**గాజాసిటీ,జులై 20:** తీవ్రవాద సంస్థ హమాస్‌కు కొత్త నాయకుడు ఎన్నికయ్యారు. ఖలీల్ అల్-హయ్యాను తమ అధిపతిగా ఎన్నుకున్నట్లు హమాస్ ప్రకటించింది. గతంలో గాజాలోని హమాస్ రాజకీయ విభాగానికి నాయకత్వం వహించిన అల్‌హయ్యా ఇప్పుడు సంస్థకు అత్యున్నత స్థాయి నాయకుడిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై జరిగిన హమాస్ దాడి అనంతరం ప్రారంభమైన యుద్ధంలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు సంబంధించిన చర్చల్లో ఖలీల్ అల్‌హయ్యా కీలక పాత్ర పోషించారు. హమాస్ ప్రధాన సంధానకర్తగా కూడా ఆయన వ్యవహరించారు. హమాస్ మాజీ నాయకులు యహ్యా సిన్వార్, ఇస్మాయిల్ హనియే మరణాల తర్వాత గత రెండేళ్లుగా ఐదుగురు సభ్యులతో కూడిన నాయకత్వ మండలి సంస్థను నడిపించింది. తాజాగా జరిగిన అంతర్గత ఎన్నికల్లో అల్‌హయ్యా కొత్త నాయకుడిగా ఎంపికయ్యారు. గాజా స్ట్రిప్‌లో జన్మించిన ఖలీల్ అల్‌హయ్యా తన జీవితంలో ఎక్కువ భాగాన్ని అక్కడే గడిపారు. 2023 అక్టోబర్ దాడులకు కొద్దికాలం ముందు గాజా నుంచి ఖతార్‌కు వెళ్లిన ఆయన అప్పటి నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం.

# భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు



## అమెరికాకు ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, జులై 20:** అమెరికా భూతల దాడికి దిగితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినా గట్టిగా బదులిస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి మాట్లాడుతూ 'అమెరికాతో కుదిరిన అవగాహన ఒప్పందం స్పష్టంగా ఉంది. అందులో ఎలాంటి సందిగ్ధత లేదు. ఒప్పందం చిన్నదే అయినా మొత్తం 14 క్లాజ్‌లు ఉన్నాయి. హార్ముజ్ జలసంధి భవిష్యత్ నిర్వహణ బాధ్య ఇరాన్‌కే చెందుతుంది. ఈ అంశాన్ని ఒమన్‌తోపాటు ప్రాంతీయ దేశాలతో చర్చిస్తూ ముందుకు తీసుకెళ్తాం. ఒప్పందంలోని నిబంధనలు స్పష్టంగా ఉన్నందున, దాన్ని ఉల్లంఘించడానికి అమెరికాకు ఎలాంటి అవకాశం లేదు' అని తెలిపారు. ఇదిలా ఉండగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై సైనిక చర్యలు విస్తరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే సైనిక సామర్థ్యం అమెరికాకు ఉన్న ప్పటికీ దాన్ని ఎక్కువ రోజులు ఆధీనంలో ఉంచు కోవడం అంత సులభం కాదని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ఒకవేళ ఆక్రమణకు దిగితే ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. బుషెహర్ ప్రావిన్స్ తీరానికి 55 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖర్గ్ ద్వీపం ఇరాన్ చమురు ఎగుమతులకు ప్రధాన కేంద్రం. ఇరాన్ చమురు ఎగుమతుల్లో సుమారు 90శాతం ఈ ద్వీపం నుంచే జరుగుతుంది.

**చుక్క చమురు కూడా హార్ముజ్ దాటదు: ఇరాన్**

అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణలు రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతున్నాయి. తమ హెచ్చరికలను ఖాతరు చేయకుండా హార్ముజ్ మీదుగా వెళ్తోన్న రెండు నౌకలను ఐఆర్‌జిసి టార్గెట్ చేసింది. వాటిలో పేలుడు సంభవించిందని, అవి కదల్లేని స్థితిలో ఉన్నాయని వెల్లడించింది. అమెరికా దురాక్రమణ కొనసాగుతున్నంతకాలం ఒక్క చుక్క చమురు కూడా సురక్షితంగా హార్ముజ్‌ను దాటదని ఐఆర్‌జిసి హెచ్చరించింది. ప్రతీకార చర్యలకు సిద్ధంగా ఉండాలని



అమెరికాను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది. మరోవైపు ఇరాన్‌పై సోమవారం తెల్లవారుజామున అగ్రరాజ్యం మరోసారి దాడులు చేపట్టింది. తమ సైనికుల మరణాలకు ప్రతీకారం తీర్చుకున్నామని, శక్తిమంతమైన దాడులు చేశామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం మొదలైన ఈ ఘర్షణల్లో ఇప్పటివరకు అమెరికాకు ప్రాణనష్టం 17కు పెరిగింది. ఇదిలా ఉండగా పశ్చిమాసియా దద్దరిల్లుతుండటంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. సోమవారం బ్రెంట్ క్రూడ్ ఒక బ్యారెల్ ధర 90 డాలర్లకు చేరింది.

**కువైట్ ప్లాంట్స్‌లో చెలరేగిన మంటలు..**

అమెరికా-ఇరాన్ ఘర్షణలతో గల్ఫ్ దేశాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కువైట్‌లోని అల్ సుబియా పవర్ జనరేషన్, వాటర్ డీసాలినేషన్ ప్లాంట్‌పై టెహ్రాన్ దాడులు చేసింది. దాంతో భారీగా మంటలు చెలరేగాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు వైరల్ అవుతున్నాయి.

# 400 డ్రోన్లతో విరుచుకుపడిన ఉక్రెయిన్

**క్యీవ్,జులై 20:** రష్యా రాజధాని మాస్కో లక్ష్యంగా ఉక్రెయిన్ ప్రతికార దాడులను తీవ్రతరం చేసింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం తెల్లవారుజామున ఒకేసారి 400 కంటే ఎక్కువ డ్రోన్లతో మాస్కోపై విరుచుకుపడింది. ఇటీవల ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో పాటు ఇతర నగరాలపై రష్యా జరిపిన తీవ్ర బాలిస్టిక్ క్షిపణి దాడులకు నిరసనగా ఉక్రెయిన్ ఈ చర్యకు దిగినట్లు అంతర్జాతీయ మీడియా స్పష్టం చేసింది. మాస్కో దిశగా వచ్చిన అత్యధిక డ్రోన్లను రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయి. మాస్కో పరిసరాల్లో దాదాపు 85 డ్రోన్లను అడ్డుకున్నట్లు మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ వెల్లడించారు. మాస్కో పరిసర ప్రాంతాల్లో జరిగిన దాడుల్లో 10 మంది గాయపడినట్లు



సమాచారం. పడోల్స్క్‌లోని ఒక ఆయిల్ డిపోతో పాటు, మాస్కో సమీపంలోని యుజ్నే ప్రాతా ఇండస్ట్రియల్ పార్క్‌లో తీవ్ర అగ్నిప్రమాదాలు సంభవించాయి. పలు నివాస భవనాలు దెబ్బతిన్నాయి. ఉక్రెయిన్ వైమానిక రక్షణ లోపాలను అనుకూలంగా మార్చుకునేందుకు రష్యా ఇటీవల బాలిస్టిక్ క్షిపణుల ప్రయోగాన్ని గణనీయంగా పెంచింది. ఆదివారం రష్యా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌లో ఆరుగురు ప్రాణా లు కోల్పోగా, పదుల సంఖ్యలో గాయపడినట్లు తెలిసింది.

# సంక్షిప్త వార్తలు

## ఎబోలా వైరస్: కాంగోలో 930కి పెరిగిన మృతుల సంఖ్య




**బునియా, జులై 20:** మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. మే15నుంచి శనివారంనాటికి దేశ వ్యాప్తంగా 2,344 కేసులు నమోదు కాగా దాదాపు 930 మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఆ దేశ ఆరోగ్యశాఖ తాజాగా వెల్లడించింది. శుక్రవారం నుంచి 24 గంటల వ్యవధిలో 37మరణాలు నమోదైనట్లు తెలిపింది. ప్రస్తుతం కాంగోలో నమోదవుతున్న కేసులన్నీ బుండిబుగ్యో ఎబోలా రకానివే. ఈ తరహా కేసులు నమోదవుతున్నట్లు మే 15న అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఈ వైరస్‌ను అరికట్టేందుకు ప్రస్తుతం వ్యాక్సిన్ గానీ, చికిత్స గానీ అందుబాటులో లేవు.

## నాలుగో బిడ్డకు జన్మనిచ్చిన ఉషావాన్స్



**వాషింగ్టన్, జులై 20:** అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ శుభవార్త పంచుకున్నారు. ఆయన సతీమణి ఉషావాన్స్ ఆదివారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం) పండంటి మగబిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. అతనికి అలెక్ నీల్ వాన్స్ అని పేరు పెట్టామని చెప్పారు. తల్లి, బిడ్డఇద్దరు ఆరోగ్యంగా ఉన్నారంటూ జెడి వాన్స్ తన ప్రకటనలో పేర్కొన్నారు. తమ ముగ్గురు పిల్లలు తమ్ముడిని చూసి సంతోషిస్తున్నారని తెలిపారు. 2014లో ఉష, జెడివాన్స్ వివాహం చేసుకున్నారు. వీరికి ఇప్పటికే ఇద్దరు కుమారులు ఇవాన్(9), వివేక్(6), కుమార్తె మిరాబెల్ (4)ఉన్నారు. ఇప్పుడు నాలుగో సంతానానికి జన్మనిచ్చారు. ఉషావాన్స్ తెలుగు మూలాలున్న వ్యక్తి అన్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తమ చిన్న కుమారుడి పేరులో 'నీల్' అని చేర్చడం ఆసక్తికరంగా మారింది.

## భారీ వర్షాలతో చార్‌ధామ్ యాత్రకు తాత్కాలిక బ్రేక్



**డెహ్రాడూన్,జులై 20:** ఉత్తరాఖండ్‌లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, భారత వాతా వరణశాఖ జారీ చేసిన రెడ్ అలర్ట్ నేపథ్యంలో చార్‌ధామ్ యాత్రను సోమవారం నుంచి తాత్కాలికంగా నిలిపివేశారు. కుండపోత వర్షాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం, వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. గఢ్వాల్ కమిషనర్ అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం యాత్ర మార్గంలో ఉన్న భక్తులను సురక్షిత ప్రాంతాల్లో వసతి కల్పించాలని, రహదారులు పూర్తిగా సురక్షితమని అధికారులు ప్రకటించిన తర్వాతే యాత్రను తిరిగి కొనసాగించేందుకు అను మతించాలని సూచించారు.

## అయోధ్య కానుకల లెక్కింపునకు ఎస్‌బిఐ పర్యవేక్షణ



**న్యూఢిల్లీ, జులై 20:** అయోధ్య రామమందిరానికి భక్తుల నుంచి అందుతున్న విరాళాల లెక్కింపు ప్రక్రియను మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఆలయ విరాళాల (కానుకల) లెక్కింపు బాధ్యతలను దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పర్యవేక్షించనుంది. భక్తుల రద్దీ విపరీతంగా పెరగడం, అందుకు అనుగుణంగా కానుకల రూపంలో వస్తున్న నగదు, బంగారు, వెండి కానుకలను ఎప్పటికప్పుడు లెక్కించడం ట్రస్ట్ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది.

## సిఎంపై వివాదాస్పద వ్యాఖ్యలు.. డిఎంకె ఎమ్మెల్యే అరెస్టు



**చెన్నై,జులై 20:** ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌పై బహిరంగ సభలో బెదిరింపు వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో డీఎంకే ఎమ్మెల్యే మార్కండేయన్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేశారు. కోవిల్‌పట్టిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీయగా, రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేగింది. మార్కండేయన్ అరెస్టు నేపథ్యంలో విలాతికుళంలోని ఆయన నివాసం వద్ద డీఎంకే కార్యకర్తలు, అనుచరులు పెద్ద సంఖ్యలో చేరుకుని నిరసన చేపట్టారు. పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అనంతరం పోలీసులు నిరసనకారులను చెదరగొట్టి, రోడ్డును ఖాళీ చేయించి ఎమ్మెల్యేను అదుపులోకి తీసుకున్నారు.

# విపత్తు ఎప్పుడు, ఎంత తీవ్రతతో సంభవిస్తుందో ఖచ్చితంగా అంచనా వేయడమే కీలకం

● ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాల నుండి విముక్తి: పరిశ్రమలు, వాణిజ్యం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విపత్తు ఎప్పుడు సంభవిస్తుంది, ఎంతసేపు కొనసాగుతుంది, దాని తీవ్రత ఎంత ఉంటుందో ముందుగానే ఖచ్చితంగా అంచనా వేయడం సమర్థవంతమైన విపత్తు నిర్వహణ కు మూలాధారం. విపత్తు వచ్చిన తర్వాత స్పందించ డం కంటే ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గిస్తుంది" అని పరిశ్రమలు, వాణిజ్యం (చేనేత, జౌళి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా పేర్కొన్నారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీఎచ్ఆర్డీఐ)లో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు విపత్తు నిర్వహణ అంశంపై ఆయన సోమవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగానే అవసరమైన సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని సమీకరించేందుకు కార్యాచరణ సిద్ధంగా ఉండాలని సిసోడియా సూచించారు. ప్రమాద సూచనలు అందిన వెంటనే ప్రజలకు వేగంగా సమాచారం చేరవేయడం, ప్రమాద ప్రాంతాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయడం, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు అత్యంత కీలకమని తెలిపారు.

విపత్తు సంభవించిన అనంతరం సహాయక చర్యలు, పునరావాసం, మౌలిక వసతుల పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్య మవుతాయని సిసోడియా అన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆధునిక టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు,



డ్రోన్ల వంటి సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల ముందస్తు అంచనా, పరిస్థితుల పర్యవేక్షణ, నష్టం అంచనా, సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్ లో సంభవించిన వివిధ ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను ప్రస్తావిస్తూ ఇటీవల సంభవించిన విజయవాడ వరదల నిర్వహణపై ప్రత్యేకంగా వివరించారు.

అలాగే రాష్ట్రాన్ని తరచూ ప్రభావితం చేసే తుఫాన్లు, వరదలు, కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక అధికారిగా పనిచేసిన అనుభవాన్ని కూడా ఆయన శిక్షణార్థులతో పంచుకున్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే భారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలంటే ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, వనరుల సమర్థ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. ఏపీఎచ్ఆర్డీఐ నిర్వహిస్తున్న 12 వారాల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉపన్యాసం జరిగింది. ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

## యువతిపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో సత్యనారాయణ పురంలో ఒక యువతిపై గురువు లాంటి వ్యక్తి లైంగికదాడికి దాడికి పాల్పడ్డాడు. నగరంలో శారీరక వ్యాయమం, పిట్‌నెస్ కోసం ఒక యువతి జిమ్ ట్రైనింగ్ సెంటర్లో చేరింది. అక్కడ ఆమెపై జిమ్ ట్రైనర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమెకు మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసి, నగ్న ఫోటోలు తీసినట్లు వేదింపులకు గురిచేస్తున్నాడు. దాంతో ఆ బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్‌పై కేసు నమోదు చేసారు. ఫిర్యాదు చేసిన యువతి ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తున్నారు. ప్రైవేట్ టీచర్‌గా పనిచేస్తున్న మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయిన జిమ్ ట్రైనర్ అబ్దుల్ ఖాదర్. లావుగా ఉన్న తనను స్లిమ్‌గా మార్చేందుకు జిమ్ సలహాలు ఇస్తూ పరిచయం పెంచుకున్నాడు. ప్రైవేట్ హోటల్‌కు తీసుకువెళ్ళి బరువు తగ్గడానికి షేక్ తాగాలంటూ మత్తు మందు ఇచ్చాడని యువతి ఆరోపిస్తుంది. మత్తు ఇచ్చి అత్యాచారం చేశాడని సత్యనారాయణపురం పోలీసులను ఇచ్చిన ఫిర్యాదులో యువతి అభియోగించింది. కేసు నమోదు చేసి యువతిని వైద్య పరీక్షల కోసం పోలీసులు తరలించారు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

## సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్ రికార్డ్

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** రౌడీ షీటరు గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసు దర్యాప్తును సిట్ మరింత వేగవంతం చేసింది. అందులో భాగంగా సోమవారం విజయవాడలోని సాయికృష్ణ నివాసానికి సిట్ అధికారులు చేరుకున్నారు. అతడి తల్లి విజయలక్ష్మి స్టేట్‌మెంట్‌ను వారు రికార్డ్ చేశారు. ఈ లాకప్ డెత్ వెనుక ఉన్న కారణాలు ఏమిటనే అంశంపై ఆమెను ప్రశ్నించారు. హైకోర్టులో సాయికృష్ణ తల్లి పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ వివరాలు కూడా సిట్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. సీఐ నాగరాజు, కృష్ణలంక పోలీసులపై విజయలక్ష్మి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో అందుకు సంబంధించిన ఆధారాలను ఆమెను అడిగిన తెలుసుకున్నారు. ఈ కేసులో కృష్ణలంక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ పోలీసుల ప్రమేయానికి సంబంధించిన అంశాలను విజయలక్ష్మి నుంచి సిట్ అధికారులు సేకరించారు. ఇక ఈ కేసులో తనకు తెలిసిన అన్ని వివరాలను ఈ సందర్భంగా సిట్ అధికారులకు విజయలక్ష్మి వివరించారు.

## జియో స్పేషియల్ సాంకేతిక పరిజ్ఞానం సమాజాభివృద్ధికి ఎంతో అవసరం

● తిరుపతి ఐఐటిలో వర్క్ షాప్‌లో వక్తలు



తిరుపతి ఐఐటిలో మూడు రోజుల వర్క్‌షాప్‌లో పాల్గొన్న వివిధ దేశాల అతిథులు

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తికి సమీపంలో ఏర్పడిన తిరుపతి ఐఐటిలో బ్రిక్స్ దేశాలతో మూడు రోజుల వర్క్ షాప్‌ను నిర్వహించారు. సోమవారం ప్రారంభమైన ఈ వర్క్ షాప్‌కు తిరుపతి ఐఐటి ఆతిథ్యమిచ్చింది. ఈ కార్యక్రమాలకు హాజరైన జియో స్పేషియల్ టెక్నాలజీలు, దాని అనువర్తనాలపై 5వ బ్రిక్స్ వర్కింగ్ గ్రూప్ సమావేశానికి ఐఐటి తిరుపతి ఆతిథ్యం ఇస్తోంది. బ్రిక్స్ దేశాలలో జియో స్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు నొక్కి చెప్పారు. సమావేశానికి వివిధ దేశాల అతిథులను ఐఐటి డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ సారథ్యంలో స్వాగతం పలికారు.

అసోసియేట్ ప్రొఫెసర్ నవవిష్కర్ ఐహబ్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ రోషన్ శ్రీవాస్తవ్, సామాజిక సవాళ్లను పరిష్కరించడంలో జియో స్పేషియల్ టెక్నాలజీల పరివర్తనాత్మక పాత్రను ప్రముఖంగా ప్రస్తావించారు. బ్రిక్స్ దేశాల మధ్య సహకార పరిశోధన, సామర్థ్య నిర్మాణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. సుస్థిర అభివృద్ధి, వాతావరణ స్థితిస్థాపకత కోసం భౌగోళిక మౌలిక సదుపాయాలు, పొజిషనింగ్, నావిగేషన్, టైమింగ్ సాంకేతికతల గురించి వివరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఐఐటి తిరుపతి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్. సత్యనారాయణ, శాస్త్ర, సాంకేతిక శాఖ అండర్ సెక్రటరీ గౌతమ్ గోవింద్, జాతీయ జియో స్పేషియల్ ప్రోగ్రామ్ డివిజన్ హెడ్ డాక్టర్ మనోరంజన్ మొహంతి, సైంటిస్ట్ డాక్టర్ శుభా పాండే, డాక్టర్ అరిందమ్ భట్టాచార్య హాజరయ్యారు. బ్రిక్స్ దేశాలలో జియోస్పేషియల్ ఎకోసిస్టమ్‌లను బలోపేతం చేయడంలో అంతర్జాతీయ సహకారం, సాంకేతిక ఆవిష్కరణల ప్రాముఖ్యతను ప్రముఖులు వివరించారు.

## మరింత వేగవంతంగా వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరు

- డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండిలో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పీడీసీఎల్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరును వేగవంతం చేస్తున్నామని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. ఎస్పీడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వినియోగదారులు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన మంజూరు చేయాలని కోరారు. అలాగే వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ లో హెచ్చుతగ్గులు, సోలార్ బిల్లింగ్, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పిడి, తదితర సమస్యలను సంస్థ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ ఐటి) పి. అయూబ్ ఖాన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా 56 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను అధికారులకు విన్నవించారని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు1912 గానీ 1800 425 155333కు కాల్ చేయడం వాట్సాప్ నంబరు: 91333 31912కు చాట్ చేయడం, ఎస్పీడీసీఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె. ఆదిశేషయ్య, జె. రమణా దేవి, ఆర్. పద్మ, ఎం. మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కే. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఓ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై అవనిగడ్డ కరకట్టపై యువకుడి దాడి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** అవనిగడ్డ నుంచి విజయవాడ వెళ్లే ఆర్టీసీ బస్సు డ్రైవర్, కండక్టర్‌పై కరకట్టపై ఓ యువకుడి దాడి భయాందోళనకు గురిచేసింది. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు వద్ద ద్విచక్ర వాహనంతో అడ్డగించి మరీ వారిద్దరిపై యువకుడు దాడికి తెగబడ్డాడు. బస్సు ఆపలేదనే కారణంతో డ్రైవర్ సురేష్, కండక్టర్ లీలాప్రసాద్‌పై దాడి చేశాడు. అడ్డొచ్చిన ప్రయాణికులనూ అసభ్య పదజాలంతో దూషించాడు. దీంతో అతడిని స్థానికులు అడ్డుకున్నారు. ఈ ఘటనతో కరకట్టపై గంటపాటు ట్రాఫిక్ స్తంభించింది. యువకుడి వీరంగం దాదాపు 94 మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన వ్యక్తిని పి.కృష్ణప్రసాద్‌గా గుర్తించారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కిషోర్ వెల్లడించారు.

## ఏజెన్సీలో అశాంతిని సృష్టించొద్దు

### ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి విజ్ఞప్తి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆదివాసీల దీర్ఘకాలిక హక్కులకి భంగం వాటిల్లుతున్న నేపథ్యంలో 1/70 చట్టాన్ని సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేసారు. ఈ మేరకు ఆయన మీడియాకు విడుదల చేసిన సమాచార పత్రంలో చట్టాన్ని రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేయాలని, గతంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జీవో నెంబర్ 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ అంతటా ప్రదర్శనలు, సభలు జరుగుతున్నాయి. ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నేడు రంపచోడవరంలో జరుగుతున్న ర్యాలీ, సభపై పోలీసులు తీవ్రమైన ఆంక్షలు పెట్టి జనం రాకుండా నిరోధించేందుకు ప్రయత్నిస్తున్నారు. సిపిఐ(ఎం) దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నది. రంపచోడవరం నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి ఆదివాసి ప్రజలు ప్రత్యేకించి యువతి యువకులు ప్రశాంతంగా వస్తున్న సందర్భంలో వారిని దారి మధ్యలో ఆటంకపరిచి రెచ్చగొట్టడం ద్వారా ఏజెన్సీలో అశాంతి పరిస్థితినీ ప్రభుత్వమే సృష్టిస్తున్నది. ఆదివాసి యువత అసంతృప్తికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. వారు చెప్పేది విని 24వ తేదీ ముఖ్యమంత్రి రంపచోడవరం వస్తున్న సందర్భంగా వాటిపై స్పందించి పరిష్కరిస్తే యువతలో ఆందోళన పరిష్కారం అవుతుంది. అందుకు బదులుగా నిర్బంధ పద్ధతుల ద్వారా అడుకోవాలనుకోవడం అవివేకం. 24న ముఖ్యమంత్రి సభకు కూడా ఇదే మాదిరి జనాన్ని రాకుండా ఆటంకపరుస్తారా అని ప్రశ్నిస్తున్నాము. అధికార పార్టీకి పోలీసు యంత్రాంగం అన్ని రకాల అండదండలు ఇస్తూ ఆదివాసీల సంఘాలపై నిర్బంధం ప్రయోగించడం దారుణం. వెంటనే హోం మంత్రి, డీజీపీ జోక్యం చేసుకొని రంపచోడవరం సభ ప్రశాంతంగా జరిగే విధంగా పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నానన్నారు.

# తిరుమల సమాచారం



## టిటిడి విద్యాదాన ట్రస్ట్‌కు రూ.కోటి విరాళం

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు దాతలు తమవంతు విరాళాలు అందిస్తున్నారు. దాతలకు కల్పించే సదుపాయాలు కోత విధించినా దాతలు నుండి విశేష స్పందన లభిస్తోంది. సోమవారం ఉదయం విజయవాడకు చెందిన అన్ బ్లిక్స్ క్లౌడ్ డేటా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సిఇఒ తిరుమల కుమార్ కనకమేడల వేంకటేశ్వర విద్యాదాన ట్రస్టుకు కోటి రూపాయలు విరాళంగా అందించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథంకు విరాళం డిడిలను అందజేశారు.

## తిరుమలలో మహారాష్ట్ర భక్తుడు అదృశ్యం



**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలేశుని దర్శనార్థం వచ్చి కొండపై మహారాష్ట్ర భక్తుడు తప్పిపోయాడు. సోమవారం అతని కుటుంబసభ్యులు తిరుమల 1టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెలుగుచూసింది. మహారాష్ట్ర పుణె జిల్లాకు చెందిన హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ (40) తన కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం ఈనెల 15వతేదీ తిరుమలకు వచ్చారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 2లో క్యూలైన్‌లో ప్రవేశించారు. ఆరోజు రాత్రి 8గంటలకు కంపార్ట్‌మెంట్-4 వద్ద కుటుంబ సభ్యుల నుండి విడిపోయి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ అతని ఆచూకీ లభించలేదు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోని సిసిటివి ఫుటేజీని పరిశీలించగా, హైదర్ అన్వరుల్లా హక్ ఖాన్ బాలాజీనగర్ వైపు కాలినడకన వెళ్తు, ఆ తరువాత కనిపించకుండా పోయాడు. అతని భార్య అర్చనా రోహిదాస్ రోకడే తిరుమల 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ తెలిసిన వాళ్ళు సమీప పోలీస్ స్టేషన్‌కు, తిరుమల 1టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని స్టేషన్ రైటర్ మోహన్‌నాయుడు విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిస్తే 94407 96771, 94407 96769, 0877- 2289027 నంబర్లకు తెలపాలని కోరారు.

## తిరుమలేశుని బ్రహ్మోత్సవాలపై టిటిడి ఫోకస్!

● సిద్ధమవుతున్న ఏడుకొండలు ● ఈ యేడాది సాలకట్ల, నవరాత్రి ఉత్సవాలు

**తిరుమల, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠవాసుడు తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామికి జరిగే ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన తొమ్మిదిరోజుల బ్రహ్మోత్సవాలు ముఖ్యం. సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిదిరోజులు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగ వైభవంగా "బ్రహ్మోత్సవాలు" ఈ ఏడాది రెండు సార్లు జరిపించనున్నారు. సెప్టెంబర్‌లో సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ తేదీలను ఇప్పటికే టిటిడి ఆగమ సలహా మండలి పండితులు ఖరారుచేశారు. దేవదేవుని బ్రహ్మోత్సవాలకు శేషాచలకొండల్లోని సప్తగిరులు సిద్ధమవుతున్నాయి. ఈఏడాది ఉత్సవాలపై ఇప్పటికే టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఇటీవల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యాచరణ రూపొందించి ఆ దిశగా పనులు చేపట్టాలని ఆదేశించారు. తిరుమల ఆలయం పరిసరాలు, మాఢవీధులు సుందరంగా తీర్చిదిద్దాలని, రంగురంగుల రంగవల్లులు, భక్తులకు సాఫీగా గ్యాలరీలు, అదనపు తాగునీటి కొళాయిలు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. మాఢవీధులు పూర్తిగా గ్యాలరీలు ఏర్పాటు చేయాలని, వర్షానికి, ఎండకు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు.



ఈ ఏడాది సెప్టెంబర్ 14నుండి 23వరకు సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. 14వ తేదీ అంకురార్పణ, 15న ధ్వజారోహణం, పెద్దశేషవాహనం, తొలిరోజే సిఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పించే ఘట్టాలు జరగనున్నాయి. ఆ తరువాత బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన గరుడసేవ సెప్టెంబర్ 19న రాత్రి నిర్వహిస్తారు. 20న సాయంత్రం బంగారురథం, 22న ఉదయం రథోత్సవం, 23న చక్రస్నానంతో పరిసమాప్తమవుతాయి.

ఆ తరువాత రెండు వారాల వ్యవధిలో అక్టోబర్‌లో నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరిపిస్తారు. అక్టోబర్ 11నుండి 20వ తేదీ వరకు జరిగే ఉత్సవాల్లో 17న పుష్పపల్లకీ సేవ, 16వ తేదీ రాత్రి గరుడవాహనం ప్రధానమైన ఘట్టాలు. నవరాత్రి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల్లో తొమ్మిదిరోజులు ప్రతిరోజూ ఉదయం వాహనసేవ 8గంటలకు ప్రారంభమవుతుంది. రాత్రి వాహనసేవ 7గంటలకు మొదలవుతాయి. దేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగ వైభవంగా జరిగే 'బ్రహ్మోత్సవాలు'కు దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహన సేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిది రోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకార భూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవ మూర్తులు శ్రీదేవి భూదేవి సమేత మలయప్పస్వామి ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులు ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు.

సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిది రోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి సారథ్యంలో వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

## దేవుని దర్శనం సులభతరం చేయండి: మాజీ సైనికోద్యోగులు

**తిరుపతి, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** దేశ సేవలో, దేశ భద్రతలో అహర్నిశలు ప్రాణాలు కూడా లెక్కచేయకుండా సేవ చేసిన మాకు తిరుమలేశుని దర్శనం సులభతరంగా కల్పించాలని మాజీ సైనికోద్యోగులు విజ్ఞప్తి చేశారు. తాము అనేక రకాల ఆరోగ్య సమస్యలు సైతం లెక్కచేయకుండా దేశసేవ చేశామన్నారు. సోమవారం ఉదయం పలు డిమాండ్లతో తిరుపతి టిటిడి పరిపాలన భవనం వద్దకు మాజీ సైనికులు చేరుకున్నారు. దేశ సేవ చేసిన మాజీ సైనికులకు దర్శన భాగ్యం కల్పించాలని టిటిడి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దేశ సేవ చేసి రిటైర్డ్ అయిన 1.10లక్షల మంది మంది మాజీ సైనికులు ఉన్నారన్నారు. మాజీ సైనికులకు టిటిడిలో మరింత ప్రాధాన్యత నివ్వాలని కోరారు.





## కన్నుల పండువగా ద్రౌపదీ దేవి గ్రామోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 20 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వ రాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ద్రౌపదీ సమేత శ్రీకృష్ణుడు, అర్జునుని విగ్రహాలనుకన్నుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. ఛైర్మన్ కొట్టె సాయి ప్రసాద్, ఇఒ బికె వెంకటేశులు, ధర్మకర్తల మండలి సభ్యుడు వాకచర్ల గురప్పశెట్టి పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఉత్సవానికి ఆలయ పూజారి పురుషోత్తం వారి సహాయకులు చక్కగా అమ్మవారిని అలంకరించారు. సప్పరంలో ప్రతిష్టించి చెన్నై రోడ్డు మీదు నుంచి పాతవరదయ్యపాళెం రోడ్డు, జయరామారావు వీధి, బజారువీధి, తేరువీధి, నెహ్రూవీధుల మీదుగా ఉత్సవం సాగింది, ఉత్సవంతో పాటు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుబ్రమణ్యం, ఉత్సవాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో సాగింది.

## ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు రికార్డుల నిర్వహణలో కొత్త అధ్యాయం మొదలైంది. ఇప్పటివరకు ఉన్న ఫిజికల్ సర్వీసు రికార్డుల స్థానంలో ఎలక్ట్రానిక్ సర్వీస్ రిజిస్టర్‌ను వినియోగించనున్నారు. దీనికోసం ప్రత్యేకంగా ఈఎస్ఆర్ 2.0 అప్లికేషన్‌ను అమలు చేస్తోంది. ఈ నూతన డిజిటల్ విధానం ద్వారా ఉద్యోగుల సర్వీసు వివరాల నమోదు, నిర్వహణ మరింత సులభతరం కానుంది. పారదర్శకత కూడా పెరుగుతుంది.

## నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని సీతారామ్ భూకబ్జా

- విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకరు తమ్మినేని సీతారామ్ సహా ఆయన కుటుంబ ఖరీదైన భూకబ్జా లక్ష్యంగా పలు అక్రమాలకు పాల్పడిందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఆరోపించారు. వైసీపీ నేత, ఏపీ అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం కుటుంబంపై తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. సోమవారం అమరావతిలో ఆయన మాట్లాడుతూ నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాలతో తమ్మినేని కుటుంబ సభ్యులు రూ.4 కోట్ల భూమి కబ్జా చేశారని ఆరోపించారు. బతికున్న వ్యక్తిని కాగితాల్లో మృతుడిగా చూపించారని ఆయన టీడీపీ ఎంపీ వివరించారు. శ్రీకాకుళం దావులపేరంలో 922 గజాల భూమి లక్ష్యంగా ఈ కుట్ర జరిగిందని వెల్లడించారు. నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించి ఈ రిజిస్ట్రేషన్ చేశారని ఎంపి కలిశెట్టి పేర్కొన్నారు. తమ్మినేని సీతారాం కుమారుడి పేరిట 2023లో ఈ భూమి రిజిస్ట్రేషన్ జరిగిందని తెలిపారు. నకిలీ ఆధార్ కార్డులు, క్రిమినల్ ముఠాల సహకారంతో ఈ దందా జరిగిందని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు తమ్మినేని సీతారాం కాలేజీ సిబ్బందిని సాక్షులుగా ఉపయోగించారని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. బాధితుడు కోర్టును ఆశ్రయించడంతో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చిందని విజయనగరం ఎంపీ అన్నారు. విచారణ తప్పించుకునేందుకు హైకోర్టు నుంచి స్టే తీసుకొచ్చే ప్రయత్నం చేశారంటూ తమ్మినేని సీతారాంతోపాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎంపీ కలిశెట్టి నిప్పులు చెరిగారు. తమ్మినేని కుటుంబ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపిస్తామని ఆయన స్పష్టం చేశారు. బాధితులకు న్యాయం చేసి దోషులపై ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు.

## రాష్ట్ర ఉత్సవంగా మండలి కృష్ణారావు జయంతి

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పూర్వపు విద్యామంత్రి దివంగత మండలి కృష్ణారావు జయంతిని రాష్ట్ర ఉత్సవంగా జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 4న మండలి వెంకట కృష్ణారావు జయంతిని జరపాలని ఉత్తర్వులు జారీ చేశారు. దివిసీమ గాంధీగా పేరొందిన మండలి తొలి తెలుగు ప్రపంచ మహాసభల నిర్వహణకు నాందిగా నిలిచారు. దివిసీమ ఉప్పెన సమయంలో అందించిన సేవలు అజరామరం. అవనిగడ్డలో గాంధీ క్షేత్రం ఏర్పాటు చేసి ఎందరికో అండగా నిలిచారు. ఆయన సేవలకుగాను ఏపీ ప్రభుత్వం అధికారభాషా సంఘానికి ఆయన పేరు పెట్టింది. మండలి జయంతిని అధికారికంగా నిర్వహించాలని పలు ఏపీ రచయిత్రుల సంఘం, పంచాయతీరాజ్ ఉద్యమ నాయకుడు జాస్తి వీరాంజనేయులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. ఇందుకు స్పందించిన ప్రభుత్వం మండలి జయంతిని అధికారికంగా నిర్వహిస్తుంది.


ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథయాత్రను బూడిద గుమ్మడికాయతో దిష్టితీసి, జెండా ఊపి ప్రారంభిస్తున్న రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్

## జగన్నాథుని ఆశీస్సులతో ధర్మవరం మరింత అభివృద్ధి చెందాలి

- రథయాత్రను ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

**ధర్మవరం టౌన్, జులై 20 ప్రభాతవార్త:** ఇస్కాన్ ఆధ్వర్యంలో సోమవారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది. ఈ రథయాత్రలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి, ధర్మవరం ఎమ్మెల్యే సత్యకుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బూడిద గుమ్మడి కాయతో దిష్టి తీసి, జెండా ఊపి రథయాత్రను ప్రారంభించారు. అనంతరం భక్తులతో కలిసి రథాన్ని లాగుతూ స్వామివారిపై తన భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ. ఇస్కాన్ సంస్థ అనేక సంవత్సరాలుగా ధర్మవరంలో శ్రీ జగన్నాథ రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులు ధర్మవరం ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని, పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అస్థిరంగా ఉండే పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో, జగన్నాథ స్వామి కటాక్షంతో ప్రకృతి అనుకూలించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. ధర్మవరం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగేందుకు స్వామివారి ఆశీస్సులు లభించాలని కోరారు. ఈ మహోత్సవంలో ఇస్కాన్ ప్రతినిధులు, వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మంగళగిరి రచయిత్రులకు అంతర్జాతీయ గుర్తింపు

**విజయవాడ, జులై 20 ప్రభాతవార్త ప్రతినిధి:** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్‌హామ్ భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో ఇటీవల నిర్వహించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఆధ్వర్యంలోని "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్" కార్యక్రమంలో భారతీయ యువ రచయిత్రులు ప్రణవి బిట్రా (16 సంవత్సరాలు), ఇషాన్వి బిట్రా విశిష్ట గౌరవాలు అందుకున్నారు. ఇరువురు సోదరీమణులు మంగళగిరి కి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు, మల్లికల కుమార్తెలు. ప్రణవి బిట్రాకు (16 సంవత్సరాలు) సృజనాత్మక రచనలో ప్రతిభ, ఊహాశక్తి, సాహిత్య నిబద్ధతకు గుర్తింపుగా "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్– 2026" ప్రదానం చేశారు. అదే కార్యక్రమంలో ఇషాన్వి బిట్రాకు (12 సంవత్సరాలు) సృజనాత్మక రచనా కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యానికి పాల్గొనిన ధ్రువపత్రం అందజేశారు. డా. కృష్ణ కుమార్, చిత్ర కుమార్ స్థాపించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ఈ యువ రచయిత్రుల సాహిత్య ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత సృజనాత్మక రచనలు చేసి ప్రపంచ సాహిత్యానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించింది. ప్రణవి బిట్రా, ఇషాన్వి బిట్రా సాధించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతీయ యువ రచయితల ప్రతిభకు ప్రపంచస్థాయిలో లభిస్తున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తూ, సాహిత్య రంగంలో ముందుకు రావాలనుకునే యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.




**తిరుపతి హెల్త్, జులై 20 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా ఏర్పేడు వద్ద గల వ్యాసాశ్రమంలో జులై 25న శాంతియుత నిరసన దీక్ష చేపట్టుతున్నట్టు శివానంద స్వామి తెలిపారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వామీజీ మాట్లాడుతూ మహర్షి సద్గురు మలయాళ స్వామి ఆరాధన ఉత్సవం సందర్భంగా వందలాది మంది భక్తులతో, పూర్వ విద్యార్థులతో, స్వామీజీలతో, భక్తాదులతో నిరసన దీక్ష చేపడుతున్నట్లు చెప్పారు. కేరళలో పుట్టిన మలయప్ప స్వామి ఆంధ్రను ఉద్ధరించడానికి ఇక్కడికి వచ్చి ఎందరికో స్ఫూర్తిదాయకంగా నిలిచారని పేర్కొన్నారు. ఆశ్రమం మేనేజరు, పీఠాధిపతులు, నిరసన దీక్షను అడ్డుకోవాలని చూస్తే చట్టపరంగా, శాంతియుతంగా ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. గతంలో బాలికలతో పాటు బాలురులకు సంస్కృతం, వేద పాఠశాల ఉండేవి అని, అవన్నీ ఇప్పుడు కనుమరుగయ్యా యని, వేసాశ్రమానికి మునుపటి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని, వాటన్నిటిని తిరిగి ఏర్పాటు చేయాలనే ఆకాంక్షతోనే నిరసన దీక్షకు దిగుతున్నట్లు చెప్పారు. రోజు రోజుకు వేసాశ్రమం ఖ్యాతి దిగజారుతున్నదని అన్నారు. ఈ విషయమై దేవదాయ శాఖ ఆనం రామనారాయణ రెడ్డిని కలిసి విన్నవించినా ఫలితం లేదని చెప్పారు. భావితరాలకు ధర్మాన్ని అందించాలంటే వ్యాసాశ్రమను మనం రక్షించుకోవాలని భక్తాదులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా కర్ణాటక, కేరళ నుండి భక్తులు ఈ నిరసన దీక్షలో అధిక సంఖ్యలో పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో స్వామీజీలు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు సమర్థవంతంగా సన్నద్ధం కావాలి

- రోజూ మానిటర్ చేయాలి.. ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలి
- అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదు
- నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటాం
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 20 ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ధీటుగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా సన్నద్ధం కావాలని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ ఆదేశించారు. నగరంలోని ఆర్.అండ్.బి అతిథి గృహంలో సోమవారం జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులు, త్రాగునీరు సరఫరాపై వ్యవసాయ, ఉద్యాన, హెచ్ఎన్ఎస్ఎస్, హెచ్.ఎల్.సి, మైనర్ ఇరిగేషన్, కెవికె శాస్త్రవేత్తలు, ఆర్డబ్ల్యుఎస్, డిపిఒ, ఆయా శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాశ్ కుమార్‌లతో కలిసి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. జిల్లాలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులను రోజు మానిటర్ చేయాలని, ఇందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు. అమరావతిలో ఉన్నతాధికారులతో మానిటర్ చేసేందుకు జిల్లా నుంచి ఒక లైజనింగ్ అధికారిని నియమించి అగ్రికల్చర్, మైనర్



ఇరిగేషన్, డ్వామా, తదితర శాఖల పరిధిలో తీసుకుంటున్న చర్యలు, పురోగతిపై ఎప్పటికప్పుడు మానిటర్ చేయాలన్నారు. ఎదురయ్యే సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

**హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలి:** ఎల్‌నినో నేపథ్యంలో హెచ్.ఎల్.సి సిస్టం హైఅలర్ట్ మోడ్‌లో ఉండాలని ఆదేశించారు. అధికారులు ఎవరూ విధులకు గైర్హాజరు కాకూడదని, ప్రతి ఒక్కరూ 24/7 విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించం.. కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెచ్.ఎల్.సి నుంచి నీరు వచ్చిన వెంటనే 25– 30 రోజుల్లోపు తాగునీటి ట్యాంకులను నింపాలని, ఇందుకు బ్లూ ప్రింట్ సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు కూడా ట్యాంకుల వద్ద మోటార్లను ఉపయోగించుకునేందుకు వీలుగా అదనపు ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయాలన్నారు. హెచ్.ఎల్.సి మెయిన్ కెనాల్ పై ఆయా శాఖల అధికారులకు డ్యూటీలు వేయాలని, ఇతర శాఖల అధికారులను కూడా డ్యూటీలు వేయాలని, ఎవరు విధుల్లో కనబడకపోయినా కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ సమస్య వస్తుందో ముందుగానే పసికట్టి కనుక్కోవాలని, జిల్లా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టరేట్లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నిత్యం మానిటర్ చేయాలని ఆదేశించారు. పిఏబిఆర్ లో స్టాప్ లాగ్ గేట్ కు సంబంధించి టెండర్ పిలవడం జరగగా, ఏర్పాటు చేసేలా చూడాలన్నారు.

**గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలి :** గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని డిపిఒ, ఆర్.డబ్ల్యు.ఎస్, ఇతర అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బందికి ఒక్కో బోర్వెల్ ను దత్తత ఇవ్వాలని, అవి పని చేస్తున్నాయా లేదా అనేది పర్యవేక్షణ చూస్తూ అవి పని చేసేలా చూడాలన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముందుగానే అన్ని విధాల సన్నద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జిల్లా వ్యవసాయ అధికారి సాలురెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, రెడ్డపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా.మల్లీశ్వరి, హెచ్.ఎల్.సి ఎస్ఈ సుధాకర్ రావు, డిపిఓ నాగరాజునాయుడు, కళ్యాణదుర్గం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త చెన్నరాయుడు, హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్2 ఎస్ఈ సిఆర్.రాజగోపాల్, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కృష్ణా జలాలు తీసుకొచ్చిన ఘనత చంద్రన్నదే

- కూటమి పాలనపై, వైసిపి పాలనపై చర్చకు సిద్ధమా..?
- మంత్రి సవిత సవాల్

**శ్రీ సత్యసాయి జిల్లా, జులై 20, ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాలను రాయలసీమకు తీసుకొచ్చి రతనాల సీమగా అభివృద్ధి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుదేననీ రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా బుక్కపట్నం చెరువును ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, ఇతర కూటమి నేతలు, కార్యకర్తలతో కలిసి మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.లక్ష కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గాను, పారిశ్రామిక హబ్ గాను సీఎం తీర్చిదిద్దుతున్నారన్నారు. అయిదేళ్ల వైసీపీ పాలనలో గాల్లో సినిమా సెట్టింగ్‌ల వేసి, కొబ్బరికాయలు కొట్టి హడావుడి తప్ప రాయలసీమకు జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. దోపిడీకి కేరాఫ్ అడ్రాస్ వైసీపీ అని మండిపడ్డారు. రెండేళ్ల కూటమి పాలన, అయిదేళ్ల వైసీపీ పాలనపై చర్చకు సిద్ధమా..? అని ఆ పార్టీ నేతలకు మంత్రి సవిత సవాల్ విసిరారు. ప్రపంచమంతా ఎల్‌నినో ప్రభావంతో విలవిలలాడుతుంటే రాయలసీమలో చెరువులు, ఇతర నదులు జలకళతో కళకళలాడుతున్నాయని, దానికి కారణంగా సీఎం చంద్రబాబేనని అన్నారు. అటు కుప్పం, ఇటు మడకశిర వరకూ కృష్ణా జలాలను తీసుకొచ్చిన ఘనత సీఎం



చంద్రబాబుదేనన్నారు. రాయలసీమలోని అన్ని జిల్లాల్లోనూ పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో జిల్లాను ఒక్కో రంగంలో అభివృద్ధి చేస్తున్నారన్నారు. తిరుపతిలో రాయల్ ఇన్ ఫీల్డ్ పరిశ్రమను తీసుకొచ్చారన్నారు. పులివెందులకు కూడా సాగు, తాగు నీరందించిన ఘనత సీఎం చంద్రబాబుదేనన్నారు.

అంతకుముందు బుక్కపట్నం చెరువులో బోటులో మంత్రి సవిత ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత వెంట ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పల్లె సింధూరెడ్డి, కూటమి నాయకులు పల్లె రఘునాథ్ రెడ్డి, పరిటాల శ్రీరామ్ ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్షా పిటిఐ ఉద్యోగుల పోరాటాలకు ఎపి జెఏసి మద్దతు

**విజయవాడ, జులై 20 (ప్రభాతవార్త):** సమగ్ర శిక్షా పథకంలో భాగంగా పనిచేస్తున్న ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయులతో పాటు ఇతర విభాగాల కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసంచేపట్టిన ప్రత్యక్ష పోరాటాలకు ఏ.పిజె.ఎ.సి అమరావతి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జెనరల్ పలిశెట్టి దామోదరరావు ప్రకటించారు.

ఆదివారం విజయవాడలోని రెవెన్యూ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సమగ్ర శిక్ష ఆర్ట్, వర్క్, వ్యాయామ ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి సదస్సులో తీసుకున్న నిర్ణయాలను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సైకం శివకుమారి రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకరరావు మీడియాకు వివరించారు.

14ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉద్యోగాల క్రమబద్ధీకరణ జరగలేదని, కనీస ఉద్యోగ భద్రత, కనీస వేతన టైమ్ స్కేల్ కూడా అమలు కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 13 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపిఎఫ్ సౌకర్యాలు కల్పించడంతో పాటు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని, పదవీ విరమణ సమయంలో గ్రాట్యుటీ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపట్టి ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సమగ్ర శిక్షలోని ఇతర విభాగాల ఉద్యోగ సంఘాలతో పాటు పీటీఐ సంఘాలను ఏకం చేసి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు వివరించారు.


ఇందుకోసం త్వరలోనే నిరసన కార్యక్రమాల షెడ్యూల్, కార్యాచరణను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు సైతం పిటిఐల పోరాటానికి తమ మద్దతు తెలిపారు.

ఏపిజెఏసి మహిళా విభాగం సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, పిటిఐ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగరాజు, కన్వీనర్లు వెంకటరమణ, కామేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టపడితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చు

- అపజయాన్ని విజయానికి పునాదిగా మలుచుకోవాలి
- మంత్రి పొంగూరు నారాయణ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డ్స్ ప్రదానం చేసిన మంత్రి, కలెక్టర్ హిమాన్షు


**నెల్లూరు(కలెక్టరేట్), జులై 20, ప్రభాత వార్త:** జీవితంలో ఏ లక్ష్యాన్నైనా సాధించాలంటే కష్టపడటమే ఏకైక మార్గమని, అపజయాన్ని చూసి నిరాశ చెందకుండా దానిని విజయానికి పునాదిగా మలుచుకోవాలని మంత్రి పొంగూరు నారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం ఉదయం విద్యాశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులో నిర్వహించిన షైనింగ్ స్టార్స్ అవార్డ్స్–2026 కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించి ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చిన్నప్పుడు ఆటలపై మక్కువతో చదువుపై శ్రద్ధ పెట్టకపోవడంతో తాను పదో తరగతిలో ఒకసారి విఫలమైనట్లు మంత్రి గుర్తు చేసుకున్నారు. అయితే ఆ అపజయాన్ని సవాల్ గా తీసుకుని రోజుకు 15–16 గంటలు కష్టపడి చదివి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించానని చెప్పారు. అనంతరం వీఆర్ కళాశాలలో డిగ్రీ, ఎస్వీ యూనివర్సిటీలో ఎంఎస్సీ పూర్తి చేసి రెండింటిలోనూ కాలేజ్ టాపర్‌గా నిలిచానన్నారు. నెలకు రూ.120 జీతంతో పార్ట్‌టైమ్ లెక్చరర్‌గా ప్రారంభమైన తన ప్రయాణం, నేడు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు విద్యను అందించే సంస్థలను నిర్మించే స్థాయికి చేరిందన్నారు. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించే బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందన్నారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యా రంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం ప్రతిభ ఉంటే సరిపోదని, జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే అంకిత భావం, కమిట్‌మెంట్, క్రమశిక్షణ అత్యంత అవసరమన్నారు. విద్యార్థుల విజయాల వెనుక తల్లిదండ్రులు, ముఖ్యంగా తల్లులు పడే కష్టం ఎంతో గొప్పదని కొనియాడారు. తాను కూడా 23 సంవత్సరాల క్రితం ఇంటర్మీడియట్ టాపర్‌గా ఇలాంటి వేదికపైనే నిలబడ్డానని, నేడు అదే వేదికపై విద్యార్థులను అభినందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాఠశాల విద్య పూర్తయిన తర్వాతే అసలైన జీవిత ప్రయాణం ప్రారంభమవుతుందని, ఇకపై ప్రతి నిర్ణయాన్ని బాధ్యతగా తీసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చదువుకునే సమయంలో యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా డిస్ట్రాక్షన్లకు దూరంగా ఉండాలని,



ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయించి చదివే క్రమశిక్షణ కలిగిన విద్యార్థులే గొప్ప విజయాలు సాధిస్తారని చెప్పారు. ప్రతిభకు కొదవ లేదని, క్రమశిక్షణతో కూడిన కృషి ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. విద్యార్థులు ఐఐటీ, ఎంబీబీఎస్ వంటి తమ లక్ష్యాలను సాధించి భవిష్యత్తులో నక్షత్రాల్లా వెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మార్చి–2026 పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రం, రూ.20 వేల నగదు బహుమతి అందజేశారు. జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 224 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ ప్రతిభావంతులైన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, నగర మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ విద్యార్థులు ఇదే స్ఫూర్తితో ఉన్నత లక్ష్యాలు అధిరోహించాలని పిలుపునిచ్చారు. క్రమశిక్షణ, కష్టపడే తత్వంతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులందరూ ఇదే సూత్రాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్ బాలాజీ రావు, సమగ్ర శిక్ష ఏపీసి వెంకటసుబ్బయ్య, వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అనంతపురంలో వైసిపి నేత అంకే నరేంద్ర ఆత్మహత్యాయత్నం

**అనంతపురం రూరల్, జులై 20 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం, అనంతపురం రూరల్ మండలం, ఆలుమూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అంకే నరేంద్ర స్థానిక టిడిపి నాయకుడు గోనుగుంట్ల సూర్యనారాయణ, రూరల్ పోలీసుల వేధింపులు కారణంగా వాటిని తట్టుకోలేక సోమవారం ఉదయం తన తోటలో సెల్ఫీ వీడియో తీసుకొని తన బాధలు చెప్పుకుంటూ పురుగుల మందు సేవించి ఆత్మహత్య ప్రయత్నం చేయడం జరిగిందని అంకె నరేంద్ర కుటుంబ సభ్యులు, బంధువులు తెలియజేశారు. ఆలమూరులో జగనన్న కాలనీలోని బోర్‌లకు మరమ్మతులు చేయించాలని కాంట్రాక్టర్ రమణారెడ్డి తెలియ జేయడంతో ఆయన పిలుపు మేరకు చెడిపోయిన బోర్లకు మరమ్మతులు చేయించి తిరిగి యథాస్థానంలో అంకే నరేంద్ర మార్చడం జరిగిందని, కానీ ఈదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు గొనుగుంట్ల సూర్యనారా యణ గ్రామంలో చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో దొంగ ఓట్లను ఎక్కిస్తుండ డంతో వాటిని నరేంద్ర అడ్డుకున్నందుకు అంకె నరేంద్రపై అక్రమంగా దొంగతనం కేసు రూరల్ పోలీస్ స్టేషన్‌లో పెట్టడంతో రూరల్ పోలీసులు ఆయన ఫిర్యాదు మేరకు అంకె నరేంద్రపై కేసు నమోదు చేసి ఎటువంటి విచారణ చేయకుండానే అంకె నరేంద్రరే జగనన్న కాలనీలో గల బోర్ల మోటర్‌ను దొంగలించినట్లు నిర్ధారించి బోర్లకు అమర్చిన మోటార్లను పైపులను వాటికి సంబంధించిన సామాగ్రిని తీయించి, స్టేషన్‌కు తరలించి, ఆ సామాగ్రితో పాటు అంకే నరేంద్రకు ముసుగు వేసి పోలీసులు మీడియా సమావేశం ఏర్పాటు చేయడంతో అంకె నరేంద్ర తన కుటుంబ పరువు పోయిందని, భావించి తన చావుకు గోనుగుంట్ల సూర్యనారాయణ, అదేవిధంగా దొంగతనం కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులే కారణ మంటూ అంకె నరేంద్ర తీవ్ర అవమానంగా భావించి, మానసిక వేధింపులను తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడముతో ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు, వైఎస్ఆర్సిపి నాయకులు వెంటనే ఆయనను హుటాహుటిన సవేరా ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యులు వైద్య సేవలు అందించి ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులకు, బంధువులకు, వైఎస్ఆర్సిపి నాయకులకు తెలియజేయడంతో కుటుంబ సభ్యులు బంధువులు వెంటనే మెరుగైన వైద్యం కోసం నరేంద్రను బెంగళూరుకు తరలించారు. నరేంద్ర ఆత్మహత్య ప్రయత్నానికి గల కారకుడు గోనుగుంట్ల సూర్యనారా యణతో పాటు, అక్రమంగా కేసు నమోదు చేసి వేధించిన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు.



## అనుమతి లేని ఇసుక తవ్వకాలపై కొరడా
# 13 డ్రెడ్జింగ్ బోట్లు సీజ్

- అధికారుల సంయుక్త తనిఖీలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై 20 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరం కోటిలింగాల డిసిల్టేషన్ రీచ్‌లో సోమవారం నిర్వహించిన సంయుక్త తనిఖీలో అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాలకు వినియోగిస్తున్న 13 డ్రెడ్జింగ్ బోట్లను అధికారులు సీజ్ చేశారు. నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ సమక్షంలో జిల్లా గనులు, భూగర్భ శాఖ అధికారులు, వారి సాంకేతిక సిబ్బంది, రాజమహేంద్రవరం అర్బన్ తహ సీల్దార్, రెవెన్యూ శాఖ అధికారులు, నీటిపారుదల శాఖ అధికారుల తో కలిసి కోటిలింగాల డిసిల్టేషన్ ర్యాంపు వద్ద సంయుక్తతనిఖీ నిర్వహించారు. తనిఖీలో సాయిరామ్ శాండ్ అండ్ బోట్స్‌మెన్ సొసైటీ పరిధిలో మొత్తం 13 డ్రెడ్జింగ్ బోట్లు అనుమతి లేకుండా ఇసుక త్రవ్వకాలు, రవాణా కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. విచారణలో మూడు డ్రెడ్జింగ్ బోట్ల యజమానిగా నండూరి రాజు (మాదిగపల్లి, వైకుంఠపురం, గుంటూరు), మరో మూడు బోట్ల యజమానిగా ముత్యాల వెంకట రమణ (రామాలయం వీధి, విజ్జేశ్వరం, తూర్పుగోదావరి జిల్లా), మరో మూడు బోట్ల యజమానిగా కూచిపూడి బాలస్వామి (గరుడాచలపాలెం, తకెళ్లపాడు, గుంటూరు జిల్లా) ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన నాలుగు డ్రెడ్జింగ్ బోట్లకు సంబంధించిన యజమానులు తనిఖీ సమయంలో గుర్తించబడకపోవడంతో వాటిని అన్‌క్లెయిమ్డ్ బోట్లుగా నిర్ధారించారు.

నూతన ఇసుక విధానం 2024, పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ బోట్లను ఇసుక త్రవ్వకాల కోసం వినియోగించినందున మొత్తం 13 బోట్లను సీజ్ చేసి తదుపరి చట్టపరమైన చర్యల కోసం నీటిపారుదల శాఖకు అప్పగించారు. సంబంధిత నిబంధనల మేరకు ఇరిగేషన్ శాఖ ద్వారా తదుపరి క్రిమినల్ చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

అలాగే వంతెనలకు ఇరువైపులా 500 మీటర్ల పరిధిలో ఎటువంటి ఇసుక త్రవ్వకాలు చేపట్టినా సంబంధిత వ్యక్తులపై కఠినమైన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

ఈ సంయుక్త తనిఖీలో రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆర్. శివరాముడు, జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి డి. ఫణిభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్ జి. విఘ్నేశ్వరుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ డి. జ్యోతిర్మయి, టెక్నికల్ అసిస్టెంట్ పి.ఎన్.వి.ఎల్. శైలజ, రాజమహేంద్రవరం అర్బన్ తహసీల్దార్ యు. రంజిత్ కుమార్, రెవెన్యూ, నీటి పారుదల శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు

- విద్యార్థుల చదువు రాష్ట్రానికి ఆర్థిక వనరు
- కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి


విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డును ప్రదానం చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల, డాక్టర్ కలికిరి మురళీమోహన్

**చిత్తూరు, జులై 20 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలలు ప్రతిభకు నిలయాలు అని, ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం పెరిగి అత్యధిక మంది షైనింగ్ స్టార్స్ వెలుగులోకి రావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్‌నాయుడు, డాక్టర్ కలికిరి మురళీ మోహన్‌లు పేర్కొన్నారు. జడ్పీ సమావేశభవనంలో సోమవారం జిల్లా విద్యా శాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గత విద్యాసంవత్సరం టెన్త్, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు 'షైనింగ్ స్టార్స్' అవార్డుల ప్రదానోత్స కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలు ఏ ఇతర ప్రైవేటు విద్యాసంస్థలకు తీసిపోవని, ప్రభుత్వ పాఠశాలల్లో సమర్ధవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన అవకాశాలు వున్నాయన్నారు. ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసంను పెంపొందించడానికి అధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యాశాఖ అధికారులు తరచు పాఠశాలలను సందర్శిస్తూ బోధన, మౌళిక వసతులు, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థిపై గణనీయమైన వ్యయం చేస్తోందని, అందుకు తగిన విధంగా విద్యా ఫలితాలు సాధించాల్సిన బాధ్యత అందరిపై వుందన్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తుకు విద్యార్థులు పునాదులని, ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థులకు చదువుతో పాటు ఆరోగ్యం, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం కూడా ముఖ్యమన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారంను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో దేశం, రాష్ట్రానికి సేవ చేసే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ మాట్లాడుతూ షైనింగ్ స్టార్స్ కార్యక్రమం కేవలం అవార్డుల ప్రదానోత్సం మాత్రమే కాదని, ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే మహత్తరమైన కార్యక్రమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏ మాత్రం తీసిపోవన్నారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన 168 మంది విద్యార్థులు, ఇంటర్మీడియేట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 34 మంది విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు ప్రదానం చేసి, ఒకొక్కొ విద్యార్థికి రూ.20 వేలు నగదు ప్రోత్సహకం, ప్రశంసాపత్రంను అందజేశారు.

ఆట

# టీమిండియాకు మిడిల్ ఓవర్ బౌలర్ కొరత

## భారత్ మ్యాచ్ విన్నర్ బెంచ్‌కే పరిమితం

## ఇంగ్లండ్ వన్డే ఓటమిపై పోస్ట్‌మార్టమ్

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో టీమ్ ఇండియా ఓటమి అనేక ప్రశ్నలను లేవనెత్తింది. వీటిలో అత్యంత చర్చనీయాంశంగా ఉన్నది కుల్దీప్ యాదవ్. తన స్పిన్‌తో ప్రపంచవ్యాప్తంగా బ్యాట్స్‌మెన్‌లను ఇబ్బంది పెట్టినప్పటికీ, అతనికి మూడు మ్యాచ్‌లలో ఒక్క అవకాశం కూడా



లభించలేదు. లార్డ్స్‌లో జరిగిన మూడవ వన్డేకు గాయం కారణంగా జస్ప్రీత్ బుమ్రా దూరమయ్యాడు. అయినప్పటికీ, కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, కుల్దీప్‌ను తుది జట్టులోకి తీసుకోవాల్సిన అవసరం లేదని భావించారు. వన్డే ఓటమిపై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు పోస్ట్‌మార్టంలో కుల్దీప్ వ్యవహారం విమర్శపాలైంది. ఇంగ్లాండ్ వన్డే సిరీస్‌లోని మొదటి మ్యాచ్ నుంచే, వికెట్లు తీస్తూ పరుగులు నియంత్రించడంలో నైపుణ్యం ఉన్న మిడిల్ ఓవర్ బౌలర్ కొరత టీమ్ ఇండియాకు ఏర్పడింది. ఈ పాత్రకు కుల్దీప్ యాదవ్ కంటే మెరుగైన ఆటగాడు లేడు. మొదటి వన్డేలో, 80 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయినప్పటికీ, ఇంగ్లాండ్ జట్టు 258 పరుగులు చేయగలిగింది. ఆ తర్వాత, రెండవ వన్డేలో, 53 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయినప్పటికీ, వారు 234 పరుగుల లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించారు. లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో, జస్ప్రీత్ బుమ్రాను తుది జట్టులోకి తీసుకోకపోవడం వల్ల 192 పరుగుల వద్ద మొదటి వికెట్ పడింది. ఇది ఒక ప్రశ్నను లేవనెత్తుతోంది. కుల్దీప్ యాదవ్‌ను బెంచ్‌కే పరిమితం చేయడం అతని కెరీర్‌పై ప్రశ్నలను లేవనెత్తింది. జస్ప్రీత్ బుమ్రా, వరుణ్ చక్రవర్తి, వాషింగ్టన్ సుందర్ అందుబాటులో లేకపోయినప్పటికీ లార్డ్స్ వన్డే తుది జట్టులో కుల్దీప్‌కు చోటు దక్కకపోవడం చర్చనీయాంశమైంది. కుల్దీప్ యాదవ్ యొక్క అద్భుతమైన రికార్డును చూస్తే అతను మూడు ఫార్మాట్లలోనూ తనదైన ముద్ర వేశాడు. ముఖ్యంగా వన్డే ఫార్మాట్‌లో అతను తనను తాను నిరూపించుకున్నాడు. 121 వన్డే అంతర్జాతీయ మ్యాచ్‌లలో, అతను 118 ఇన్నింగ్స్‌లలో 194 వికెట్లు పడగొట్టాడు. అతని చివరి వన్డే ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగింది, ఆ మ్యాచ్‌లో అతను 10 ఓవర్ల స్పెల్‌లో 42 పరుగులిచ్చి వికెట్లేమీ తీయలేదు. అయితే, జట్టు యాజమాన్యం కేవలం ఒక మ్యాచ్ ఆధారంగా కుల్దీప్‌ను అంచనా వేసి పొరపాటు చేసిందనే చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

# దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు కెప్టెన్‌గా రుతురాజ్

**న్యూఢిల్లీ:** దులీప్ ట్రోఫీలో పశ్చిమ జోన్‌కు నాయకత్వం రుతురాజ్ గైక్వాడ్ వహించనున్నాడు. ఈ దులీప్ ట్రోఫీ ఆగస్టు 23 నుండి సెప్టెంబర్ 10 వరకు బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో జరగనుంది. ఈ టోర్నమెంట్ 2026-2027 సీజన్‌కు కూడా జోనల్ ఫార్మాట్‌లోనే కొనసాగుతుంది. ముంబై చీఫ్ సెలెక్టర్ రాజేష్ పవార్ అధ్యక్షతన జరిగిన ఎంపిక కమిటీ సమావేశం అనంతరం సోమవారం ప్రకటించిన 15 మంది సభ్యుల జట్టులో, మహారాష్ట్ర బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్‌ను కెప్టెన్‌గా, ముంబైకి చెందిన షామ్స్ ములానీని వెస్ట్ జోన్ వైస్ కెప్టెన్‌గా నియమించారు. గత సీజన్‌లో జట్టుకు నాయకత్వం వహించిన పేసర్ శార్దూల్ ఠాకూర్ నుండి, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న మరియు ఇటీవల శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్‌లతో జరిగిన ట్రై సిరీస్‌లో ఇండియా ఎ జట్టుకు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించిన గైక్వాడ్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించబడ్డాయి. ఆగష్టు 23, 26 తేదీలలో జరిగే టోర్నమెంట్ క్వార్టర్ ఫైనల్ 2లో వెస్ట్ జోన్, నార్త్ జోన్‌తో తలపడుతుంది. దులీప్ ట్రోఫీలో ఫైనల్‌తో సహా మొత్తం ఐదు మ్యాచ్‌లు ఉంటాయి, ఇవి




సెప్టెంబర్ 6 నుండి 10 వరకు దివీని గ్రౌండ్ 1లో ఆడబడతాయి. కెప్టెన్ గైక్వాడ్ నేతృత్వంలో పృథ్వీ షా, ముషీర్ ఖాన్, సర్ఫరాజ్ ఖాన్, శివాలిక్ శర్మ, జయమీత్ పటేల్, సిద్ధార్థ్ దేశాయ్ వంటి బ్యాటింగ్ ఎంపికలు జట్టుకు యువత, అనుభవం కలయికను అందిస్తున్నాయి. ఈ జట్టులో సౌరాష్ట్ర నుండి ఏకైక ఆటగాడైన హార్విక్ దేశాయ్, గుజరాత్‌కు చెందిన ఉర్విల్ పటేల్ ఇద్దరూ వికెట్ కీపర్లుగా ఉంటూ, జట్టుకు వికెట్ల వెనుక బలమైన ప్రత్యామ్నాయాలను అందించనున్నారు.



# స్పెయిన్‌దే ఫుట్‌బాల్ ప్రపంచకప్

**న్యూఢిల్లీ:** ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో స్పెయిన్ విజేతగా నిలిచింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో స్పెయిన్ 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనాను ఓడించింది. ఇరు జట్లు హోరాహోరీగా తలపడటంతో మ్యాచ్ నిర్ణీత సమయంలో ఫలితం తేలలేదు. దాంతో ఎక్స్‌ట్రా టైమ్ ఆడించాల్సి వచ్చింది. ఈ సమయాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. 106వ నిమిషంలో స్పెయిన్ ప్లేయర్ ఫెర్రాన్ టొర్రెస్ అద్వితీయమైన గోల్‌తో చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. ఈ విజయంతో స్పెయిన్ రెండో ప్రపంచకప్‌ను ముద్దాడింది. 2010లో తొలి ప్రపంచకప్‌ను గెలుచుకున్న స్పెయిన్ 16 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ విశ్వవిజేతగా నిలిచింది. ఈ ఫైనల్లోస్పెయిన్ టికి టాకా వ్యూహం ముందు అర్జెంటీనా తేలిపోయింది. ఫైనల్లో పూర్తిగా స్పెయిన్ ఆధిపత్యం కనబర్చింది. బంతిని పూర్తిగా తమ ఆధీనంలో ఉంచుకున్న స్పెయిన్ అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై పదే పదే దాడి చేసింది. కానీ ఆ జట్టు గోల్ కీపర్ మార్టినెజ్ అడ్డుగోడలా నిలిచాడు. లేకుంటే అర్జెంటీనా ఘోర పరాజయాన్ని మూటగట్టుకునేది. స్పెయిన్ ఆటలో 68 శాతం బంతిని తమ ఆధీనంలో ఉంచుకుని ఆధిపత్యం చెలాయించింది. అంతేకాకుండా అర్జెంటీనా గోల్ పోస్ట్‌పై 11 సార్లు దాడి చేసింది. తమ టికీ టాకా వ్యూహంతో చిన్న చిన్న పాస్‌లు ఇచ్చుకుంటూ ఆటను వేగంగా నడిచేలా చూసుకుంది. ప్రత్యర్థి ప్రణాళికలను ముందే పసిగడుతూ చెలరేగింది. అర్జెంటీనా ప్లేయర్ ఫెర్నాండో 90+3 నిమిషంలో రెడ్ కార్డుతో బయటకు వెళ్లి పోవడం ఆ జట్టు కొంపముంచింది. దాంతో అర్జెంటీనా 10 మంది ప్లేయర్లతోనే మిగతా ఆటను కొనసాగించాల్సి వచ్చింది. ఈ అవకాశాన్ని స్పెయిన్ సద్వినియోగం చేసుకుంది. ఫైనల్లో గోల్ కొట్టి స్పెయిన్ విజయంలో కీలక పాత్ర పోషించిన ఫెర్రాన్ టొర్రెస్‌కు సుపీరియర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

# ఫిఫా వరల్డ్ కప్‌లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు

**న్యూఢిల్లీ:** ఫిఫా వరల్డ్‌కప్ చాంపియన్‌గా స్పెయిన్ అవతరించిన విషయం తెలిసిందే. అసాధారణ రీతిలో సాగిన ఫైనల్లో 1-0 గోల్స్ తేడాతో అర్జెంటీనాను స్పెయిన్ ఓడించింది. అయితే వరల్డ్‌కప్‌లో అందజేసే అవార్డుల్లో ఫ్రాన్స్ కెప్టెన్ ఎంబాప్పేకు రెండు అవార్డులు దక్కాయి. ఫైనల్లో అత్యుత్తమ ప్రదర్శించిన స్పెయిన్ ప్లేయర్ రోడ్రికి గోల్డెన్ బాల్, అర్జెంటీనా ప్లేయర్ లియోనల్ మెస్సీకి సిల్వర్ బాల్, ఫ్రాన్స్ ప్లేయర్ కైలియన్ ఎంబాప్పేకు బ్రాంజ్ బాల్ అవార్డులు దదక్కాయి. ఇక ప్రతిష్టాత్మకమైన గోల్డెన్ బూట్ అవార్డు ఎంబాప్పేకు దక్కింది. అతనికి బ్రాంజ్ బాల్‌తో పాటు గోల్డెన్ బూట్ అవార్డు దక్కడం విశేషం. టోర్నీలో అతను 10 గోల్స్, 4 అసిస్టలతో ఆ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఇక సిల్వర్ బూట్ అవార్డు మెస్సీని వరించింది. ఇంగ్లండ్ ప్లేయర్ జూడ్ బెల్లింగ్‌హామ్‌కు బ్రాంజ్ బూట్ అవార్డు దక్కింది. ఇక టోర్నీలో ప్రత్యర్థులకు గోల్ పోస్టులో అడ్డుగోడలా నిలిచిన గోల్‌కీపర్ ఉనాయ్ సిమన్‌కు గోల్డెన్ గ్లోవ్ అవార్డు దక్కింది. ఫిఫా యంగ్ ప్లేయర్ అవార్డు స్పెయిన్ ప్లేయర్ పావు కుబారిస్‌కు దక్కింది. ఇక ఫెయిర్ ప్లే ట్రోఫీ నెదర్లాండ్స్ జట్టను వరించింది.





# స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్‌కు టైటిల్

**న్యూఢిల్లీ:** స్విస్ ఓపెన్‌లో సిట్సిపాస్ ఏటీపీ టైటిల్‌ను గెలుచుకున్నాడు. స్విస్ ఓపెన్‌లో, గ్రీస్‌కు చెందిన స్టెఫానోస్ సిట్సిపాస్ బెల్జియంకు చెందిన రాఫెల్ కొలిగ్నాన్‌పై మూడు సెట్ల విజయంతో దాదాపు ఏడాదిన్నర తర్వాత ఈ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. మాజీ ప్రపంచ ర్యాంకర్ 3, క్లే కోర్ట్ టోర్నమెంట్‌లో 6-4, 6-7 (3), 6-3 తేడాతో గెలిచి, తన కెరీర్‌లో 13వ ట్రోఫీని, ఫిబ్రవరి 2025లో దుబాయ్ తర్వాత మొదటి ట్రోఫీని కైవసం చేసుకున్నాడు. 27 ఏళ్ల అతను 2021లో తన కెరీర్‌లో అత్యుత్తమ ర్యాంక్ అయిన మూడో స్థానం నుండి ప్రపంచ ర్యాంకింగ్‌లో 85వ స్థానానికి పడిపోయాడు మరియు ఆ ఏడాది ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2023లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో రెండు గ్రాండ్ స్లామ్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. సిట్సిపాస్ 2019లో లండన్‌లో జరిగిన ఏటీపీ మాస్టర్స్‌ను, అలాగే 2021, 2022 మరియు 2024లో మూడుసార్లు మాంటె కార్లో మాస్టర్స్‌ను కూడా గెలుచుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 42వ స్థానంలో ఉన్న 24 ఏళ్ల కొలిగ్నాన్, సెమీఫైనల్స్‌లో అర్జెంటీనాకు చెందిన జువాన్ మాన్యుయెల్ సెరుండోలోను ఒక మ్యాచ్ పాయింట్‌తో ఓడించి, తన మొదటి ఏటీపీ ఫైనల్ ఆడుతున్నాడు.

# రాణించడమే నా బాధ్యత

## రిటైర్మెంట్ పై రోహిత్




**న్యూఢిల్లీ:** లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్‌తో ఉత్కంఠభరితంగా సాగిన చివరివన్డే మ్యాచ్‌లో భారత్‌కు పరాజయం తప్పలేదు. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ 138 పరుగులతో అద్భుతమైన సెంచరీ సాధించినప్పటికీ భారత్‌కు విజయాన్ని అందించలేకపోయాడు. 110 బంతుల్లో అయిదు భారీ సిక్సర్లు, ఏడు మెరుపు బౌండరీలతో హిట్ మ్యాన్ 138 పరుగులు బాదాడు. లాఫ్టెడ్, హుక్, లాంగ్, స్వీప్, కవర్ డ్రైవ్ ఇలా దాదాపు అన్ని షాట్లతో రెచ్చిపోయాడు. ఈ సెంచరీతో రోహిత్ శర్మ ఎన్నో అరుదైన రికార్డులను తన పేరిట లిఖించుకుని ఐకాన్‌గా నిలిచాడు. వన్డే సిరీస్ ఓటమి అనంతరం రోహిత్ శర్మ మాట్లాడాడు. తన రిటైర్మెంట్ పుకార్లపై స్పందించాడు. తన భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలను తేలిగ్గా తీసుకున్నాడు. వాటిని కొట్టిపారేశాడు. దేశం కోసం రాణించడమే ఓ క్రికెటర్ గా తన బాధ్యత అని స్పష్టం చేశాడు. తన భవిష్యత్ గురించి వస్తోన్న వ్యాఖ్యలు విమర్శలకు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వట్లేని, క్రీడా జీవితంలో ఉన్నప్పుడు ఇలాంటి ప్రచారాలు సహజమేనని, ఆట ద్వారా మాత్రమే వీటికి సమాధానం ఇస్తానని పేర్కొన్నాడు. కెరీర్‌లో అరంగేట్రం చేసినప్పటి నుంచే తన చుట్టూ ఇటువంటి వాతావరణం ప్రచారంలో ఉందని, అవి లేకపోతే ఎంటర్టైన్మెంటే ఉండబోదని నవ్వుతూ చెప్పాడు. విరాట్ కోహ్లీ గురించి మాట్లాడుతూ కెరీర్ ప్రారంభం నుండే కలిసి ప్రయాణిస్తోన్నామని, క్రీజ్ లో ఉన్నప్పుడు ఒకరి వ్యూహాలను ఒకరు పంచుకుంటూ బ్యాటింగ్ చేస్తుంటామని, అది విజయానికి దోహదపడుతుందని వివరించాడు. లార్డ్స్ వన్డే ఓటమిపై రోహిత్ అసంతృప్తి వ్యక్తం చేశాడు. జట్టులోని యువ బౌలర్లకు వన్డే ఫార్మాట్‌లో తగినంత అనుభవం లేదని, వారు రాణించడానికి మరికొంత సమయం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాడు. ఈ ఓటమి నుంచి నేర్చుకున్న పాఠాలు భవిష్యత్తు సిరీస్‌లలో ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లాండ్ పర్యటనలో లభించే కఠిన సవాళ్లు ఓ క్రికెటర్‌గా తనకు ఎంతో సంతృప్తిని ఇస్తాయని వ్యాఖ్యానించాడు.

# విదేశీ డిపాజిట్ల సమీకరణలో బ్యాంకుల రికార్డు

## ఎఫ్‌సిఎన్ఆర్ డిపాజిట్లపై 20.712 బిలియన్ డాలర్ల సేకరణ



**న్యూఢిల్లీ:** భారతీయ రిజర్వ్ బ్యాంక్ చేపట్టిన విదేశీ నిధుల డిపాజిట్ పథకానికి విశేష స్పందన లభించింది. విదేశీ మారక నిల్వలను బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన చర్యల ద్వారా జూన్ 8 నుంచి జూలై 17, 2026 వరకు బ్యాంకులు 17.4 బిలియన్ డాలర్ల తాజా ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లను సమీకరించినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. ఆర్‌బీఐ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, ఇదే కాలంలో ఓవర్సీస్ ఫారిన్ కరెన్సీ బారోయింగ్స్ ద్వారా 1.97 బిలియన్ డాలర్లు, ఎక్స్‌టర్నల్ కమర్షియల్ బారోయింగ్స్ ద్వారా మరో 1.342 బిలియన్ డాలర్లు సమీకరించాయి. ఈ మూడు మార్గాల్లో మొత్తం 20.712 బిలియన్ డాలర్ల విదేశీ నిధులు దేశంలోకి వచ్చాయి. విదేశీ మూలధన పెట్టుబడులు, డిపాజిట్లను ప్రోత్సహించడం, దేశ చెల్లింపుల సమతుల్యతను బలోపేతం చేయడం, విదేశీ మారక నిల్వలను పెంచడం ఈ నిర్ణయాల ప్రధాన ఉద్దేశం. ఈ ప్యాకేజీలో భాగంగా, కొత్తగా సమీకరించే ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీ నిధుల కోసం ఆర్‌బీఐ రాయితీ స్వాప్ సౌకర్యాన్ని కల్పించింది. ఈ సదుపాయం ద్వారా బ్యాంకులు విదేశీ కరెన్సీలో వచ్చిన నిధులను అనుకూల మారకపు నిబంధనలతో రూపాయిలుగా మార్చుకునే అవకాశం కల్పించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం, ఎఫ్‌సీఎన్ఆర్(బి) డిపాజిట్లకు స్వాప్ విండో సెప్టెంబర్ 30, 2026 వరకు, ఓఎఫ్‌సీబీలు, ఈసీబీలకు డిసెంబర్ 31, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. పథకం ప్రారంభమైనప్పటి నుంచి బ్యాంకులు, విదేశీ పెట్టుబడిదారుల నుంచి మంచి స్పందన లభించిందని ఆర్‌బీఐ తెలిపింది. ఆర్‌బీఐ అందిస్తున్న రాయితీ స్వాప్ సౌకర్యం వల్ల బ్యాంకులకు కూడా ఈ నిధులను సమర్థవంతంగా వినియోగించుకునే అవకాశం లభిస్తోంది. విదేశీ మారక నిధుల ప్రవాహాన్ని పెంచడం, దేశ బాహ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడం, చెల్లింపుల సమతుల్యతకు మద్దతు ఇవ్వడం లక్ష్యంగా తీసుకొచ్చిన ఈ చర్యలు ఇప్పటికే ఆశించిన ఫలితాలను ఇస్తున్నాయని తాజా గణాంకాలు సూచిస్తున్నాయి.

వాణిజ్యం




## మూలధన లాభాల పన్ను రేట్లలో మార్పు ప్రతిపాదన లేదు: కేంద్రం

**న్యూఢిల్లీ,జులై20:** దేశంలో మూలధన లాభాలపై విధించే పన్ను రేట్లలో మార్పులు చేయాలన్న ప్రతిపాదనపేదీ ప్రభుత్వ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్ను విధానంలో మార్పులపై వస్తున్న ఊహాగానాలకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పార్లమెంట్‌లో ఇచ్చిన సమాధానంతో తెరపడింది. పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆర్థిక మంత్రిత్వ శాఖ మూలధన లాభాల పన్ను రేట్లతో పాటు ఇతర పన్ను విధానాలను ప్రతి ఏడాది కేంద్ర బడ్జెట్ ప్రక్రియలో భాగంగా, దేశంలోని స్థూల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని సమీక్షిస్తామని పేర్కొంది. ప్రస్తుతం క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ రేట్లలో మార్పు చేసే ఎలాంటి ప్రతిపాదన లేదని స్పష్టం చేసింది. ఇక ఈక్విటీ లావాదేవీలపై విధించే దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గణనీయంగా పెరిగినట్లు వెల్లడించింది. ఈక్విటీ లావాదేవీలపై లిగిదిబి పన్ను ద్వారా రూ.1,29,158 కోట్లు వసూలుకాగా అంతకు ముందు ఈ ఆదాయం రూ.72,249 కోట్లు మాత్రమే ఉంది. తాజా గణాంకాల ప్రకారం 79 శాతం వృద్ధి నమోదైంది. స్టాక్ మార్కెట్‌లో లావాదేవీలు పెరగడం, పన్ను వసూళ్ల అధికం కావడం ఇందుకు ప్రధాన కారణాలని ప్రభుత్వం పేర్కొంది.

# ఈ యేడు ఆర్థికవృద్ధి 6.5 -6.8శాతమే

## -డెలాయిట్ ఇండియా




**న్యూఢిల్లీ,జులై 20:** భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం నుంచి 6.8 శాతం మధ్య వృద్ధిని నమోదు చేసే అవకాశముందని డెలాయిట్ ఇండియా అంచనా వేసింది. పండుగల సీజన్‌లో వినియోగ డిమాండ్ పెరగడం, రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య విధాన సడలింపులు, ప్రపంచ ఆర్థిక పరిస్థితులు క్రమంగా స్థిరపడటం వంటి అంశాల కారణంగా ఆర్థిక వృద్ధి రెండో అర్ధభాగంలో మరింత బలపడుతుందని సంస్థ తన తాజా ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదికలో పేర్కొంది. నివేదిక ప్రకారం, ఈఏడాది ప్రారంభంలో భారత్ ఆర్థిక వ్యవస్థ గోల్డీలాక్స్ దశలోకి ప్రవేశించింది. ద్రవ్యోల్బణం, వృద్ధి, వడ్డీ రేట్లు వంటి కీలక స్థూల ఆర్థిక సూచీలు సమతుల్య స్థితిలో కనిపించాయి. మధ్యప్రాచ్యంలో నెలకొన్న భౌగోళిక ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక పరిస్థితులను ప్రభావితం చేశాయి. కీలక సముద్ర రవాణా మార్గాల్లో అంతరాయాలు ఏర్పడటం, వస్తు ధరల్లో తీవ్ర హెచ్చుతగ్గులు రావడం, పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినడం వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని నివేదిక వెల్లడించింది. ఈ పరిణామాల ప్రభావంతో భారత వాణిజ్య లోటుపెరిగిందని, విదేశీ పెట్టుబడులవిత్‌డ్రా కొనసాగిందని, అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తక్కువ కాలంలోనే గణనీయంగా పడిపోయిందని పేర్కొంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గత నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి అంచనాను 6.9 శాతం నుంచి 6.6 శాతానికి తగ్గించింది. డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త రుమ్కి మజుందార్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వాతావరణం మరింత అనిశ్చితంగా మారిందన్నారు. ఇటీవల చోటుచేసుకున్న భౌగోళిక పరిణామాలు, ఆర్‌బీఐ తీసుకున్న విధానపరమైన చర్యలు కొన్ని ప్రమాదాలను తగ్గించే అవకాశం ఉన్నప్పటికీ, ముఖ్యంగా ఎల్‌నినో ప్రభావం, వాతావరణ అనిశ్చితులు, వ్యవసాయ ఉత్పత్తి తగ్గుదల, ఆహార ధరల పెరుగుదల వంటి అంశాలు వృద్ధికి ప్రధాన ప్రతికూల ప్రమాదాలుగా మిగిలి ఉన్నాయని తెలిపారు ఎఫ్‌టీఏల ద్వారా లభించే మార్కెట్ అవకాశాలను శాశ్వత పోటీ సామర్థ్యంగా మార్చుకోవడం అత్యంత అవసరమని రుమ్కి మజుందార్ సూచించారు. వాణిజ్య విధానాలకు తోడు పారిశ్రామిక విధానాలు, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, దేశీయ సరఫరా వ్యవస్థల బలోపేతం, నిబంధనల సరళీకరణ, ఆవిష్కరణలు, నైపుణ్యాల అభివృద్ధిపై పెట్టుబడులు పెంచాలని ఆమె అభిప్రాయపడ్డారు. ముడి చమురు, ఎరువులు, కీలక ఖనిజాలు, వంటనూనెల ధరలు పెరగడం, రూపాయి బలహీనపడటం వల్ల దేశీయ ధరలపై ఒత్తిడి పెరుగుతోందని నివేదిక తెలిపింది.



## ఈక్విటీ సూచీలను దెబ్బతీసిన ప్రైవేటు బ్యాంకులు

# నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి,జులై 20:** దేశీయ ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాల్లో ముగిశాయి. ప్రైవేట్ బ్యాంకుల ఫలితాల తర్వాత ఈ రంగ షేర్లలో భారీ అమ్మకాలు జరగడంతో మార్కెట్లపై ఒత్తిడి పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాలు, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు అధిక స్థాయిలో కొనసాగడం వంటి అంశాలు కూడా పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. రంగాల వారీగా ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఫార్మా, ఎనర్జీ షేర్లు లాభపడగా, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 442.93 పాయింట్లు పడిపోయి 77,708.52 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 95.80 పాయింట్లు కోల్పోయి 24,238.50 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.47లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ0.21 పెరిగింది. బీఎస్ఈలో2,226 షేర్లు లాభపడగా, 2,039 షేర్లు నష్టపోయాయి. 255 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 6.780 నుంచి 6.782 శాతానికి స్వల్పంగా పెరిగింది. రూపాయి విలువ డాలర్‌తో పోలిస్తే గత ముగింపు 96.3050 నుంచి 96.4500 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 5, 2026 గోల్డ్ ఫ్యూచర్స్ 0.66 పెరిగి రూ.1,41,793కు చేరాయి. సెప్టెంబర్ 2026 బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 14 సెంట్లు తగ్గి 87.96 డాలర్ల వద్ద ట్రేడైంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 5.08 క్షీణించింది. యాక్సిస్ బ్యాంక్ 5.37 పడిపోయింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ 1.96 నష్టపోయింది. యెస్ బ్యాంక్ 2.80 తగ్గింది. ఐడీబీఐ బ్యాంక్ 2.10 పడిపోయింది. ఐసీఐసీఐ బ్యాంక్ మాత్రం 1.16 లాభపడింది. ఆర్‌బీఎల్ బ్యాంక్ 0.19 పెరిగింది. కంపెనీ స్వతంత్ర నికర లాభం ఏడాది ప్రాతిపదికన 26.64 పెరిగి రూ.253.70 కోట్లకు చేరింది.

## సైబర్ భద్రతా లోపాలపై సిడిఎస్ఎల్‌కు

# సెబీ కోటి జరిమానా

**న్యూఢిల్లీ,జులై 20:** దేశీయ మూలధన మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ 2022లో జరిగిన మాల్వేర్ సైబర్ దాడికి సంబంధించి సెంట్రల్ డిపాజిటరీ సర్వీసెస్ (ఇండియా) రూ.1 కోటి జరిమానా విధించింది. సైబర్ భద్రతా నిబంధనలను పాటించడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ దాడి జరిగిందని, ఇది ముందుగానే ఊహించదగిన ఘటనేనని సెబీ తన ఉత్తర్వులో స్పష్టం చేసింది. విడుదల చేసిన 88 పేజీల ఉత్తర్వులో, సెబీ చట్టం కింద రూ.90 లక్షలు, డిపాజిటరీస్ చట్టం కింద రూ.10 లక్షలు జరిమానా విధించింది.

సీడీఎస్ఎల్ మాజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజేష్ నడ్కర్ణి, మాజీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ అమిత్ మహాజన్పై విచారణను ముగించినప్పటికీ, వారికి ఎలాంటి ఆర్థిక జరిమానా విధించలేదు. సైబర్ దాడి అనేది దురదృష్టకరమైన, ఊహించలేని ఘటన అని సీడీఎస్ఎల్ చేసిన వాదనను సెబీ తిరస్కరించింది.

భద్రతా నియంత్రణల్లో జరిగిన నిర్లక్ష్యం వల్లే మాల్వేర్ దాడి జరిగిందని, ఇది పూర్తిగా నివారించగలిగే పరిణామమని సెబీ పేర్కొంది. సెబీ గుర్తించిన ప్రధాన లోపాలుదర్యాప్తులో సీడీఎస్ఎల్ పలు కీలక సైబర్ భద్రతా నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలింది.

# 8 కీలక రంగాల వృద్ధి 5 శాతం

## సిమెంట్, ఉక్కు రంగాల జోరు



**న్యూఢిల్లీ,జులై 20:** దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించే ఎనిమిది కీలక మౌలిక రంగాలు జూన్ నెలలో వార్షిక ప్రాతిపదికన 5% వృద్ధిని నమోదు చేశాయి. మేలో నమోదైన 3.2% వృద్ధితోపోలిస్తే ఇది గణనీయమైన మెరుగుదల. వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం విడుదల చేసిన 2023 ప్రామాణికసంవత్సరంతో రూపొందించిన కొత్త శ్రేణి గణాంకా వెల్లడయ్యాయి. జూన్‌లో ముఖ్యంగా సిమెంట్ ఉత్పత్తి 9.8 శాతం పెరిగింది. మేలో ఇది 8.4 శాతం వృద్ధి నమోదు చేయగా, జూన్‌లో మరింత పెరగడం దేశంలో నిర్మాణ కార్యకలాపాలు వేగం పుంజుకున్నట్లు సూచిస్తోంది. ఉక్కు ఉత్పత్తి కూడా బలమైన ప్రదర్శన కనబరిచింది. మేలో 5.1% పెరిగిన ఉత్పత్తి, జూన్‌లో 4.6% వృద్ధిని నమోదు చేసింది. బొగ్గు ఉత్పత్తి మే నెలలో 9.5% క్షీణించిన తర్వాత జూన్‌లో 1.4% వృద్ధితో కోలుకుంది. ముడి చమురు ఉత్పత్తి మాత్రం ఒత్తిడిలోనే కొనసాగింది. జూన్‌లో ఇది 4.2%తగ్గింది. సహజ వాయువు (నేచురల్ గ్యాస్) ఉత్పత్తి కూడా వరుసగా క్షీణిస్తూ జూన్‌లో 7.4 శాతం పడిపోయింది. మేలో ఈ తగ్గుదల 5 శాతంగా నమోదైంది. ఎరువుల ఉత్పత్తి జూన్‌లో 3.3 శాతం తగ్గింది. మేలో ఇది 1 శాతం ప్రతికూల వృద్ధిని నమోదు చేసింది. ఇక ఎనిమిది కీలక రంగాల సూచీలో అత్యధిక వాటా కలిగిన పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తులు కూడా 4.7 శాతం క్షీణించాయి. మేలో ఈ తగ్గుదల 8.2 శాతంగా ఉండగా, జూన్‌లో కొంత మేర తగ్గుదల పరిమితమైంది. దేశ పారిశ్రామిక ఉత్పత్తి సూచీలో ఈ ఎనిమిది కీలక రంగాల వాటా సుమారు 40 శాతం ఉంటుంది. అందువల్ల వీటి పనితీరు పారిశ్రామిక రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 5-69, 7Pratipadu, Pentapadu (M), West Godavari Dist., Tadepalligudem-534101. Telefax: 08818-220791, 225046, RNI?No. ARTEL 2004/13724 Editer: "Damerla Saibaba responsible for selection of new under the PRB Act. Read: No H/SD/337/12-14. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# చంద్రబాబు హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

## భీమవరం షైనింగ్ స్టార్ పురస్కారాల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ




**తణుకు, జూలై 20 ( ప్రభాత వార్త)** రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రతిసారి విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అనేక సంస్కరణలు అమలు చేశారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం భీమవరంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధ్యక్షతన నిర్వహించిన షైనింగ్ స్టార్ పురస్కారాల కార్యక్రమంలో ఆయన పాల్గొని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్య, విద్యార్థుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాంతంలో ఆదర్శ పాఠశాలల ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పదో తరగతి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగిందని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించడం ప్రభుత్వ విద్యా విధానాల విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. అలాగే 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి అర్హ విద్యార్థికి ఆర్థిక సహాయం అందిస్తూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుంటే ప్రపంచ స్థాయిలో ఉన్నత స్థానాలు అధిరోహించే అవకాశాలు ఉంటాయని ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆకాంక్షించారు.

పశ్చిమగోదావరి, ఏలూరు
వార్త

# కూటమి ప్రభుత్వంలో విద్యారంగానికి పెద్దపీట

## జిల్లా జాయింట్ కలెక్టర్ తో ఎమ్మెల్యే ఆరిమిల్లి భేటీ

### రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి

**తణుకు, జూలై 20 ( ప్రభాత వార్త)** భీమవరం కలెక్టర్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీనీ తణుకు శాసనసభ్యులు ఆరిమిల్లి రాధాకృష్ణ గారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తణుకు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ రెవెన్యూ సమస్యలు, ప్రజా సంక్షేమానికి సంబంధించిన అంశాలు మరియు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్‌తో చర్చించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు, అందుకు జాయింట్ కలెక్టర్ కే ఆర్ కల్పశ్రీ సానుకూలంగా స్పందిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ సంబంధిత అధికారులతో సమన్వయం చేసి అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఎమ్మెల్యే శ్రీ ఆరిమిల్లి రాధాకృష్ణ నూతన బాధ్యతలు చేపట్టిన జాయింట్ కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, జిల్లా అభివృద్ధి మరియు ప్రజా సంక్షేమం కోసం పరస్పర సహకారంతో పనిచేద్దామని ఆకాంక్షించారు.




# అక్రమ రిజిస్ట్రేషన్లో పథకం ప్రకారమే కుట్ర

- నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ కేసులో ఇరువురు నిందితులు అరెస్టు
- మీడియా సమావేశంలో ఏలూరు డి.ఎస్.పి శ్రావణ్ కుమార్



**కైకలూరు జూలై 20 (ప్రభాతవార్త)** ముదినేపల్లి మండలం ములకలపల్లికి చెందిన త్రీపురనేని ఏసుబాబు మరణానంతరం ఆయన ఆస్తులను అక్రమంగా నకిలీ, ఫోర్జరీ ధ్రువీకరణ పత్రాలతో రిజిస్ట్రేషన్కు పాల్పడిన సంఘటనపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్లో నమోదైన కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించి నిందితులను అరెస్టు చేశారు. సోమవారం కైకలూరు రూరల్ సర్కిల్ కార్యాలయం నందు ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలు వెల్లడించారు. ప్రధాన నిందితులైన గోపతాటి మహంకాళి, కాగితాల కొండమ్మ, నల్లపు శివలు పరస్పరం పథకం ప్రకారమే కుట్రపన్ని నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యులు ధ్రువీకరణ పత్రంను, ఫోర్జరీ చేసిన ఆధార్కార్డులను ఈ రిజిస్ట్రేషన్కు సిద్ధం చేశారని తెలిపారు. వీటి ఆధారంగా కైకలూరు సబజిస్ట్రార్ కార్యాలయంలో ఈఏడాది ఫిబ్రవరి 21న ఆస్తులను పార్టిషన్ డీడ్, సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్ల కింద అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు విచారణలో తేలిందన్నారు. ఇందులో కాగితాల కొండమ్మ, నల్లపు శివలను సోమవారం ములకలపల్లిలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి నేరానికి సంబంధించిన పత్రాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. అనంతరం వారిని న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు వివరించారు. ఈ సందర్భంగా డి.ఎస్.పి మాట్లాడుతూ భూ యజమానులు ఆస్తులకు సంబంధించిన పత్రాలు ఎవరికి పడితే వారికి ఇవ్వవద్దని, ఎవరిని పడితే వారిని నమ్మవద్దని పేర్కొన్నారు. మీ ఆస్తి విషయాలు ఎవరికైనా చెబితే ఇలాంటి సంఘటనలే జరుగుతాయని కావున ప్రతి ఒక్కరు తమ ఆస్తులను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో చెక్ చేసుకోవాలన్నారు. అదేవిధంగా కొంతమంది బ్యాంకుల నుంచి లోన్లు ఇప్పిస్తామని ఏజెంట్లు తిరుగుతున్నారని అలాంటివారిని నమ్మవద్దన్నారు. ఎవరైనా ఇలాంటి నేరాలు పాల్పడితే సంబంధించిన బ్యాంకుల వారిని అరెస్ట్ చేస్తామని హెచ్చరించారు.అనంతరం కేసును చాకచక్యంగా చేదించిన సీఐ రవికుమార్, ఎస్సై వీరభద్రరావు, హెచ్సీ పి.వి. సత్యనారాయణ, కానిస్టేబుల్ నాగబాబు, పవన్కుమార్, హోంగార్డు శివకోటయ్యను డి.ఎస్.పి అభినందించారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ పిజిఆర్ఎస్ విభాగం రూపొందించిన

## క్యూఆర్ కోడ్ ను ప్రతి అర్జీదారుడు వినియోగించుకోవాలి.

### జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.




**భీమవరం జులై 20 ప్రభాతవార్త** పి జి ఆర్ ఎస్ లో సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకున్న అర్జీదారుడు తదుపరి తమ సమస్య పరిష్కారం అయిన తరువాత అర్జీదారుడు ముఖ్యమంత్రి కార్యాలయం పి జి ఆర్ ఎస్ విభాగం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను ద్వారా తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో సోమవారం పీజిఆర్ఎస్ కార్యక్రమం అనంతరం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ అర్జీదారులు తమ సమస్యలు పిజిఆర్ఎస్ లో నమోదు చేసుకున్న అనంతరం అధికారులు తమ సమస్యలపై ఏ విధంగా స్పందించి పరిష్కార మార్గం చూపారో తమ అభిప్రాయాన్ని నిర్భయంగా ప్రభుత్వానికి తెలియ చేసుకునే విధంగా క్యూఆర్ కోడ్ ను రూపొందించడం జరిగిందని అన్నారు. "క్యూఆర్ కోడ్ " ను ఉపయోగించుకొని మీరు పెట్టుకున్న అర్జీ నెంబర్ కి ఫీడ్ బ్యాక్ ఇస్తే, తదుపరి సంబంధిత అధికారి స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. దీనివలన అధికారులు సమస్యలపై పారిదర్శకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించి సకాలంలో సమస్యలను సత్వరంగా పుష్కరిస్తారని అన్నారు. అర్జీదారులు మొబైల్ లోనే క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాన్ని నిర్భయంగా తెలియ చేయవచ్చని అన్నారు. దీనివలన ప్రజల సమస్యలు పారదర్శకంగా, సత్వరమే పరిష్కారం అవటమే కాక అధికారుల జవాబుదారితనం తెలియజేస్తుందని అన్నారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయి అధికారులు అందరూ ముఖ్యమంత్రి కార్యాలయ పి జి ఆర్ ఎస్ విభాగం రూపొందించిన క్యూఆర్ కోడ్ ను తమ కార్యాలయాలందు ప్రదర్శించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని అన్నారు. క్యూఆర్ కోడ్ ను ఒక పంప్లేట్ రూపంలో రూపొందించి ప్రజలకు తెలిసే విధంగా ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి ప్రభాకర్, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి వై దోసి రెడ్డి, డ్వామా పిడి కె. అప్పారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటికి ఇబ్బంది రాకూడదు : కలెక్టర్ నాగరాణి




**భీమవరం జూలై 20 ప్రభాతవార్త** జిల్లాలో రైతులకు సాగునీటికిసరఫరా కుఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు.

సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు లో వ్యవసాయ, ఇరిగేషన్ శాఖ అధికారులతో సాగునీటి సరఫరాపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడు తూ జిల్లాలోవర్షాభావ పరిస్థితుల దృష్ట్యా శివారు ప్రాంతాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకో వాలని సంబంధిత శాఖల అధికారుల ను ఆదేశించారు. మండలాల వారీగా ఏఏ గ్రామాలలో సాగునీటి సమస్య లు ఉన్నాయని తెలుసుకుని వ్యవసాయ, ఇరిగేషన్ అధికారు లు సమన్వయంతో సాగునీటి సమస్య లు రాకుండా చూడా లని అన్నారు. వ్యవసాయ రంగానికి ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా రైతులు ఇబ్బంది పడకుండ వారి సమస్యలు పరిష్కరించా లన్నారు. జిల్లాలో ఏ విధమైన సాగునీటి సమస్య రాకుండా ఎప్పటికప్పుడు జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. పంట కాలువలు ఏమైనా బాగు చేయవలసి ఉంటే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డ్వామా పిడి డా. సిహెచ్ అప్పారావు, డి.ఆర్.డి.ఏ పిడి వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ ఏ. వెంకటేశ్వరరావు. తదితరులు పాల్గొన్నారు.

# కాలువలో జారి పడి సత్యవరం మాస్టర్ రావూరి రవి మృతి



**పెనుమంత్ర, జూలై-20, (ప్రభాతవార్త):** పెనుమంత్ర మండలంలోని సత్యవరం బోర్డు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రావూరి రవి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందారు. పెనుగొండ మారెమ్మ గుడి సమీపంలో శు క్రవారం సాయంత్రం లంచ్ బాక్స్ కడుగుతుండగా కాలు జారి కాలువలో పడిపోయినట్లు సమాచారం. కాలువలో నీటి ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆయన గల్లంతయ్యారు.

ఆదివారం ఉదయం జెడ్ వంతెన సమీపంలో రావూరి రవి మృతదేహాన్ని గుర్తించారు. పెనుగొండ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ చిర్ల విజయరామరెడ్డి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. రావూరి రవి మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడికి భార్య, ఏడేళ్ల కుమారుడు ఉన్నారు.

# గ్రామోత్సవం క్రీడా పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్ , జాయింట్ కలెక్టర్




**భీమవరం టౌన్, జూలై 20 : ప్రభాతవార్త** పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో మొదటి లెవెల్ (క్లస్టర్) మ్యాచులు పోస్టర్ను జిల్లా కలె క్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయిం ట్ కలెక్టర్ కె ఆర్. కల్పశ్రీ, ఇషా ఫౌండేషన్ కోఆ ర్డినేటర్ డాక్టర్ విజయ, డిఆర్వో పి ప్రభాకర్, డ్వామా పిడి డాక్టర్ సిహెచ్ అప్పారావు ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ భారత దేశంలోని అతిపెద్ద గ్రామీణ క్రీడా ఉత్సవం అయిన 18 వ ఈశా గ్రామోత్సవం మన భీమ వరంలో ఈనెల 25 మరియు 26 తేదీల్లో క్లస్టర్ లెవెల్ మ్యాచెస్ డిఎన్ఆర్ కళాశాల గ్రౌండ్స్ లో నిర్వహించడం జరుగు తుందని అన్నారు. దీనిలో భాగంగా పురు షులకు వాలీబాల్ మరియు మహిళలకు త్రోపాల్ ఆటల పోటీలు మరియు ఫన్ గేమ్స్ నిర్వహించడం జరుగు తుందన్నారు. ఆటగాళ్లు గ్రామానికి చెందిన వారై ఉండడం మన జిల్లా లోని ప్రతి గ్రామానికి చెందిన జట్లు పోటీ పడ డం జరుగుచున్నది. పోటీలలో మొదటి నాలు గు స్థానాలు వారికి నగదు పురస్కారం ట్రోఫీలు మరియు సర్టి ఫికెట్స్ బహుకరించడం జరుగు తుంది. ఇక్కడ నెగ్గిన మొదటి రెండు జట్టులు తదుపరి డివి జనల్ మ్యాచ్స్ విజయ వాడలో లో పాల్గొని తదుపరి కోయం బత్తూర్ లో సెప్టెంబర్ 9న జరగబోయే ఫైనల్ మ్యాచ్స్ మ్యాచెస్ లో పాల్గొని ఐదు లక్షల బహు మానాన్ని గెలుచు కునే అవకా శం ఉం దన్నారు. ఈసంవత్సరం ఇప్పటివరకు 24 వాలీబాల్ టీమ్స్ 19 త్రో బాల్ టీమ్స్ నమోదు చేసు కోవటమై నద న్నారు. ఈ కార్యక్రమంలో ఈషా ఫౌం డేషన్ పశ్చిమ గోదావరి జిల్లా కోఆ ర్డి నేటర్ డాక్టర్ విజయ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొ న్నారు.

# జీవో 396పై దస్తావేజు లేఖరుల ఆందోళన

## నిరవధిక పెన్డౌన్... సమ్మె - ఎమ్మెల్యే నాయకర్ కు వినతి పత్రం




**నరసాపురం జూలై 20 ప్రభాతవార్త** రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన దస్తావేజు లేఖర్ల సమ్మెలో భాగంగా సోమవారం నరసాపురంలో ఏ ఒక్క దస్తావేజు రిజిస్టర్ కాలేదు. లేఖర్లు చేపట్టిన సమ్మె ఆందోళన జయప్రదం అయింది. సంఘ అధ్యక్షులు తె లగంశెట్టి సత్యనారాయణ ప్రధాన కార్యదర్శి కోయ చింతరావ్ ట్రెజరర్ దిడ్ల నాగరాజు నాయకత్వంలో సీనియర్ డాక్యుమెంట్ రైటర్స్ యువలేఖర్లు స్టాండ్ వండర్లు డిటిపి ఆపరేటర్లు మహిళలేఖరులు సంయుక్తంగా ఆందోళనలు జరిపారు. ముందుగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకరుకు సబ్ రిజిస్టర్ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి నరసాపురం మొగల్తూరు దస్తావేజు లేఖర్లు కోస్టల్ డాక్యుమెంట్ రైటర్స్ అందరూ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 396 జీవో గురించి కే వెంకటేశ్వరరావు టి సత్యనారాయణ జర్నలిస్ట్ అండ్ రైటర్ ఏ చిన్నారావు కె చింతారావు పరిస్థితులను ఆయన వివరించారు. దస్తావేజులు లేఖర్లకు ప్రభుత్వం నుండి ఎటువంటి సహకారం ఉండదని ప్రజలే ఆదుకుంటారని అటువంటి పరిస్థితిలో ప్రభుత్వం తమ ఉపాధిని తీసివేయడం కుటుంబాలకు భారం జీవనోపాధికి కష్టం అవుతుందని వివరించారు. రిజిస్ట్రేషన్ వ్యవస్థలో లేఖరుల భాగస్వామ్యం తప్పనిసరి అని కానీ ప్రభుత్వం ఈ జీవో ద్వారా ప్రైవేటీకరణకు సూత్రం కట్టాలని చూడడం వ్యవస్థకు నష్టమని వివరించారు. ఆస్తుల వ్యవహారాలు ప్రైవేటు పరిస్థితికి వెళితే కలిగే నష్టాన్ని గతంలో కూటమి ప్రభుత్వమే వివరించిందని ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేయడానికి అదే ముఖ్య కారణం అని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం ఏ ఒక్కరికి నష్టం కలిగే పని చేయదని లేఖరుల ఉపాధికి ఇబ్బంది రాకుండా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకోవడం జరుగుతుందని నాయకర్ హామీ ఇచ్చారు. జీవో విషయాన్ని కూడా తాను పరిశీలించగలుగుతాం అన్నారు. అనంతరం లేఖరులు ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా జరిపారు. 396 జీవో పై నినాదాలు ఇచ్చారు. దాదాపు రెండు దశాబ్దాలు చరిత్ర గల డాక్యుమెంటేషన్ సిస్టంను మార్చడం అంటే ప్రజల ఆస్తులకు భద్రతను పోగొట్టడమేనని వెంకటేశ్వరరావు సత్యనారాయణ వివరించారు. అనంతరం సూపరిండెంట్ కు వినతిపత్రం ఇచ్చారు. కార్యాలయం వద్ద సాయంత్రం వాలీబాల్ ఆడి తమ నిరసన వ్యక్తం చేశారు. విధులను బహిష్కరించడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ కోసం వచ్చే కక్షిదారులు ఇబ్బంది పడ్డారు. పెన్డౌన్ కావడంతో దస్తావేజుల రిజిస్ట్రేషన్ తో పాటు ఈసీలు నకళ్ళు స్టాంపులు విక్రయాలకు కూడా విఘాతం కలిగింది. గౌరవాధ్యక్షులు కోయ రంగారావు టీవీ రమణ దేవి మాస్టారు ఉపాధ్యక్షులు కొప్పాడ శ్రీనివాస్ కే సత్యనారాయణ ఏ చిన్నారావు గంధం రవి రామారావు అడబాలవిజయలక్ష్మి కుమారి సార్వ రామకృష్ణ కటకం శెట్టి రామచంద్రరావు తుందుర్రు మోహన్ ఎల్బీచర్ల సత్యనారాయణ ఎం సురేంద్ర కొప్పర్తి వెంకట సత్యనారాయణ సత్య కృష్ణ సాయి కే మురళి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



## ఉధృతమైన దస్తావేజు లేఖర్ల ఉద్యమం

### -పది రోజుల పెన్ డౌన్ ప్రారంభం



**భీమవరం టౌన్, జూలై 20 : ప్రభాతవార్త** భూముల రిజిస్ట్రేషన్లలో పి పి పి విధానం వద్దని, పాత పద్ధతినే రిజిస్ట్రేషన్లు కొనసాగాలని జి ఓ 396 రద్దు చేయాలని కోరుతూ జూలై 7,8 తేదీల్లో దస్తావేజు లేఖర్లు రాష్ట్రస్థా యి పెన్ డౌన్ కార్యక్రమం, మరియు 14 వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు చేసిన విషయం విదితమే. కాగా కూటమి ప్రభుత్వం లేఖర్ల ఆందోళనను పరిగణనలోకి తీసుకొనకపోవ డమే కాక పిపిపి విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ముందుకు పోతుండగా లేఖర్ల అసోసియేషన్ ఆందోళనను ఉధృతం చేస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనరల్ సెక్రటరీ తాళ్లూరి మధు తెలిపారు. 396 జిఓ వల్ల ప్రజలు ఆస్తులకు ఏమాత్రం రక్షణ ఉండదని అన్నారు. ప్రజల ఆస్తులను ప్రైవేటు వారు రక్షించలేరని రికార్డులు భద్రపరచ సాధ్యం కాదని, 396 జిఓ వల్ల సుమారు 4 లక్షలు మంది దస్తావేజు లేఖర్లు, అసిస్టెంట్ లు, స్టాంప్ వెండర్స్, డీటీపీ ఆపరేటర్ లు జీవనోపాధి కోల్పోయి రోడ్డున పడతారని అన్నారు. తాము చేసిన ఆందోళనలను కూటమి ప్రభుత్వం పట్టించు కొనక పోవడంతో సోమవారం నుండి ( జూలై 20 నుండి ఆగస్టు 1 వరకు ) స్టేట్ వైడ్ పెన్ డౌన్ కార్యక్రమం తిరిగి ప్రారంభించామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా దస్తావేజు లేఖ ర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, అడ్వకేట్ తాళ్ళూరి మధు తెలియజేశారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని లేఖర్లు, అసి స్టెంట్లు, స్టాంపు వెండర్లు డిటిపి ఆపరేటర్లు పెద్ద సంఖ్య లో విచ్చేసి పెన్డౌన్ కార్యక్రమంలో పాల్గొనా లని, ఉద్యోగ సంఘాలు, ప్రజా సంఘాలు, తాము చేస్తున్న న్యాయ సమ్మతమైన ఉద్య మానికి గతం లాగానే మద్దతు ప్రకటించి పూర్తి సహాయ సహకారాన్ని అంద జేయాలని విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి జిల్లా లేఖర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, అడ్వకేట్ తాళ్ళూరి మధు భీమవరం లేఖర్ల సెక్రటరీ కవురు పృధ్వీ శంకర్, ట్రెజరర్ జి హరిబాబు, గంర్రెడ్డి మధు, వీరగా ట్టపు అప్పారావు, రాపాక శ్యామల ప్రసాద్, పామర్తి మహేష్, మేకా నాగరాజు, కోయ శ్రీని వాస్, బొర్రా నాగరాజు, మేకా బ్రహ్మ య్య, పె నుబోతుల మురళీ నాయుడు, మేకల నరేష్ కేతా విజయకుమార్ పాలూరి శ్రీధర్ గిలకలశెట్టి డాడీ హేమంత్ కుమార్, దాట్ల రామరాజు, ఆరేపల్లి ధనరాజు, దేవు మల్లిఖార్జున రావు, శివ, తాళ్లూరి సురేష్ కుమార్, దండు శ్రీనివా సరాజు, స్టాంపు వెండర్ ప్రసాదరాజు, తిలక్, కదలి సూరి బాబు, పొన కళ్ళవాసు, పొనకళ్ళ చిరంజీవి, భాను, బొడ్డు మోహన్, తదితరులు పాల్గొ న్నారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డులు అందుకున్న అనన్య స్కూల్ విద్యార్థినులు





**లింగపాలెం, జూలై 20 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందించే షైనింగ్ స్టార్స్ అవార్డులను అనన్య స్కూల్, ధర్మాజీగూడెం విద్యార్థినులు అందుకుని పాఠశాలకు మరోసారి గర్వకారణంగా నిలిచారు. 2025–26 విద్యా సంవత్సరానికి నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో కడియాల వీక్షిత 586 మార్కులు సాధించి మండలంలో ద్వితీయస్థానం పొందగా, నిడిగొండ గీతామాధురి 581 మార్కులతో షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికయ్యారు. సోమవారం ఏలూరులోని సి. ఆర్. రెడ్డి కళాశాలలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ వేట్రీసెల్వి, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) చేతుల మీదుగా విద్యార్థినులు అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా అనన్య స్కూల్ డైరెక్టర్ బొల్లినేని రాంబాబు, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందిస్తూ, వారి భవిష్యత్తు మరింత ఉన్నతంగా ఉండాలని ఆకాంక్షించారు.

## ప్రభుత్వం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరణ చేయాలి

### -ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ -మినీ క్యాంపస్ లో అధ్యాపకుల ఆందోళన- ప్లకార్డుల ప్రదర్శన

**తాడేపల్లిగూడెం, జూలై 20,(ప్రభాత వార్త)** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలల్లో దశాబ్దాలుగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను తక్షణమే క్రమబద్ధీకరించాలని కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు సోమవారం తాడేపల్లిగూడెంలోని



ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, మిని క్యాంపస్ లో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లుఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించి, ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్ట్ అసిస్టెంట్ అధ్యాపకులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు, గత కొన్నేళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో అధ్యాపకులుగా అందిస్తున్న సేవలను ప్రభుత్వం పట్టించుకోకుండా నోటిఫికేషన్ విడుదల చేసి తమకు అన్యాయం చేసిందన్నారు దీంతో రాష్ట్ర వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అసిస్టెంట్ అధ్యాపకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త నియామకాల ప్రక్రియకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే నూతన నియామకాలకు ముందు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అంతేకాకుండా, ప్రస్తుతం అమల్లో ఉన్న నియామక నిబంధనల ప్రకారం కాంట్రాక్ట్ సేవలను అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్ పదోన్నతులకు అవసరమైన అనుభవంగా తమను పరిగణించకపోవడం తీవ్ర అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాలను కాపాడుతూ, విశ్వవిద్యాలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన తమ సేవలకు తగిన గుర్తింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారుఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని క్యాంపస్ ప్రిన్సిపాల్ ఆచార్య ప్రొఫెసర్ టి. అశోక్ కు అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సానుకూల పరిష్కారం కోసం కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వెలువడే వరకు రోజురోజుకు ఆందోళన కార్యక్రమాలను కొనసాగిస్తామని కాంట్రాక్ట్ అధ్యాపకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్. హీరా బట్టు నాయకత్వం వహించారు, ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సంఘం సంయుక్త కార్యదర్శి డాక్టర్. పి. ప్రశాంతి, సభ్యులు, డాక్టర్. ఎఫ్రైమ్ బాబు, శ్రీరాముడు, బాబులుతో పాటు క్యాంపస్లోని కాంట్రాక్ట్ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి

### -బొండా రాంబాబు - నీట్ లో 540 మార్కులతో ప్రతిభ చాటిన తేజాస్ ను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్



**భీమవరం జూలై 20 ప్రభాతవార్త** కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, రాబోయే రోజుల్లో పి జి లో కూడా మంచి మార్క్స్ సాధించాలని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, పిఆర్ఓ భట్టిప్రోలు శ్రీనివాసరావు, చవ్వా శ్రీనివాససుబ్బారావు అన్నారు. నీట్ పరీక్షలో అత్యుత్తమ మార్క్స్ సాధించిన పట్టణానికి చెందిన బొండాడ తేజాస్ (540 మార్క్స్ ను సాధించినందుకు సోమవారం మార్నింగ్ కాఫీ క్లబ్ అధ్వర్యంలో అభినందించి సత్కరించారు. బొండా హనుమంతరావు, కారుమూరి సత్యనారాయణ మూర్తి, మానేపల్లి రవి చిన్నారావు, భామ కృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయస్థాయిలో మెరుగైన మార్క్స్ సాధించడం మన జిల్లాకే గర్వకారణమని, కృషి, పట్టుదల ఉంటే అన్ని రంగాల్లోనూ రాణించగలుగుతారని అన్నారు. తటవర్తి బదరి, గుండు సుమూర్తి, కురిశెట్టి నాని మాట్లాడుతూ తేజాస్ ఇదే పట్టుదలను కొనసాగిస్తూ వైద్య విద్యలోనూ ఉత్తమ ప్రతిభ కనబరచాలని, కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని, ఈ విజయం మరెంతో మంది విద్యార్థులకు ఆదర్శంగా నిలవచ్చునని అన్నారు. అనంతరం తేజాస్ ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో కంచర్ల భాస్కరరావు, మానేపల్లి వెంకన్నబాబు, కారుమూరి కిరణ్, సంకా బాబు, అనంతపల్లి సుబ్బారావు, కాఫీ క్లబ్ సభ్యులు మిత్రులు, కుటుంబ సభ్యులు వున్నారు

## విద్యతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను అలవర్చుకోవాలి

### --జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.-వ్యక్తి, కుటుంబం, సమాజ అభివృద్ధికి విద్యే పునాది- రాష్ట్ర పీఏసీ ఛైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు.



**భీమవరం జూలై 20 ప్రభాతవార్త** విద్యార్థులు స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరంలోని అల్లూరి సీతారామరాజు సాంస్కృతిక కేంద్రంలో సోమవారం నిర్వహించిన "షైనింగ్ స్టార్స్--2026" అవార్డుల ప్రదానోత్సవంలో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, రాష్ట్ర పీఏసీ ఛైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఈ విజయానికి విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి కూడా కారణమని అభినందించారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజనం, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు వంటి సౌకర్యాలు కల్పిస్తోందని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్య, నైపుణ్యాభివృద్ధి వైపు అడుగులు వేయాలని సూచించారు. విజయంతో పాటు సంస్కారం, క్రమశిక్షణ, సంస్కృతి, సాంప్రదాయాలను అలవర్చుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. రాష్ట్ర పీఏసీ ఛైర్మన్, భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ వ్యక్తి, కుటుంబం, సమాజ అభివృద్ధికి విద్యే మూలాధారమని అన్నారు. ఆస్తుల కంటే విద్యే శాశ్వత సంపద అని పేర్కొంటూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజానికి ఉపయోగపడే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో నాణ్యమైన విద్య అందించేందుకు అనేక సంస్కరణలు అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 127 మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు షైనింగ్ స్టార్స్ అవార్డులు, రూ. 20 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందుకోవడం అభినందనీయమన్నారు. సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల వంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. నారాయణ మాట్లాడుతూ జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 85.59 శాతం ఉత్తీర్ణత నమోదైందని తెలిపారు. ప్రతిభ కనబరిచిన 127మంది పదో తరగతి, 36 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు, ప్రశంసాపత్రాలు, ఒక్కొక్కరికి రూ. 20 వేల నగదు ప్రోత్సాహకాన్ని ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకార సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లి పెద్దిరాజు, ఆర్యవైశ్య సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ పి. మురళీమోహన్, ఆంధ్రప్రదేశ్ మహిళా సహకార ఆర్థిక కార్పొరేషన్ ఛైర్మన్ పీతల సుజాత, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి బి. అప్పారావు, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్యాంసుందర్, ఎంఈవోలు, ఉపాధ్యాయులు, అవార్డు గ్రహీతలు, వారి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అర్జీలను స్వీకరించటం తో పాటు సమస్యలను పరిష్కరించడం ముఖ్యం.

### -పీజీఆర్ఎస్‌లో 141, రెవెన్యూ క్లినిక్‌లో 53 దరఖాస్తుల స్వీకరణలి-జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.



**భీమవరం జులై 20 ప్రభాతవార్త** జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల వినతులు, ఫిర్యాదులను అధికారులు స్వీకరించి ప్రజల సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత శాఖల అధికారులకు వెంటనే సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌తోపాటు జిల్లా జాయింట్ కలెక్టర్ కె. ఆర్. కల్పశ్రీ, ఇంచార్జి రెవెన్యూ అధికారి పి. ప్రభాకర్, పీజీ ఆర్ ఎస్ నోడల్ అధికారి వై. దోసిరెడ్డి, డ్వామా పిడి ఎ. అప్పారావు, కలెక్టరేట్ పరిపాలనా అధికారి వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్‌లలో అందుతున్న ప్రతి ఫిర్యాదును నిబంధనల మేరకు నిర్దేశిత గడువు లోపల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని తెలిపారు. కేవలం అర్జీలను క్లోజ్ చేయడం ముఖ్యం కాదని, క్షేత్రస్థాయిలో అర్జీదారుడు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన, శాశ్వత పరిష్కారం చూపాలని అన్నారు. అధికారులు రీ–ఓపెన్ (మళ్లీ వచ్చే) అర్జీల సంఖ్య తగ్గాలని అన్నారు. ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి సమస్యల తీవ్రత, వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని అన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఒకే సమస్యపై ప్రజలు మళ్లీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారాలపై అధికారులు దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 141 దరఖాస్తులు, అలాగే రెవెన్యూ క్లినిక్‌లో 53 దరఖాస్తులు స్వీకరించబడ్డాయి. అందిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వయోవృద్ధులు, వికలాంగులు, నడవలేనివారు తమ పరిధిలోని మండలాల్లో అధికారులకు తమ సమస్యల అర్జీలను దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. పరిష్కరించ దగ్గ ప్రతి అర్జీని కచ్చితంగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. అనంతరం పి జి ఆర్ ఎస్ అర్జీలపై జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సమీక్షించారు. సమస్యల పరిష్కార ప్రగతి మెరుగ్గా ఉన్నప్పటికీ మరింత అంకితభావంతో సమస్యలను పరిష్కరించాలని అన్నారు. తదుపరి సమావేశం నాటికి సమస్యలను పూర్తిగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, అర్జీ దారులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరం ద్వారా పేదలకు వైద్య సేవలు



**నూజివీడు, జులై 20 ప్రభాతవార్త:** వైద్య శిబిరం ద్వారా పేదలకు వైద్య సేవలు, మందులు ఉచితంగా పంపిణీ చేసినట్లు నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ తెలిపారు. జి .ఎం. హెచ్ , జనసేన సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం నూజివీడు లో కార్యక్రమం నిర్వహించారు. పట్టణ ప్రజలు భారీ ఎత్తున్న వచ్చి వైద్య సహాయం, మందులు తీసుకున్నారు. వారి రుగ్మతలు కి టెస్ట్ లు చేయించుకుని మందులు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలు వరకు నిర్వహించారు. జనసేన నాయకులు ఉమ్మడి కృష్ణాజిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ , నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాము, నియోజకవర్గ వీర మహిళ రామిశెట్టి తేజస్విని పట్టణ నాయకులు బాజి, రేపాని రాజు, మజ్జిగ శివ, కుక్కడపు అనిల్, నూజివీడు కమ్యూనిస్టు పార్టీ టౌన్ ప్రెసిడెంట్ ఛాట్లా పుల్లారావు , తదితరులు హాజరయ్యి అమెరికన్ హాస్పిటల్ డాక్టర్స్ బృందం ని ఇంత మంచి కార్యక్రమం ని చేసిన నూజివీడు జనసేన పార్టీ నాయకులు ముమ్మలనేని సునీల్ కుమార్ ని అభినందించారు. వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇంకా పెద్దఎత్తున మెడికల్ క్యాంపు లు పెట్టి ప్రజల కి అండగా ఉంటామని అన్నివర్గాల సహకరించిన అమెరికన్ హాస్పిటల్ డాక్టర్లు టీం , స్టాఫ్ నర్స్ భారతి కి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

## మండవల్లి సెంటర్లో బస్ షెల్టర్ నిర్మించాలి



**మండవల్లి జూలై 20 (ప్రభాతవార్త)** మండల కేంద్రమైన మండవల్లి గ్రామంలో ప్రయాణికుల సౌకర్యార్థం జాతీయ రహదారి పక్కన సెంటర్లో బస్ షెల్టర్ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమంలో తహసీల్దార్ బాజీ సత్యనారాయణ కు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మండవల్లి చెరువు సెంటరులో గ్రామపెద్దలు ఏర్పాటు చేసిన షెల్టర్లు, ఆటో యూనియన్ వర్కర్స్ ఏర్పాటు చేసిన తాత్కాలిక షెల్టర్ ను ప్రయాణికులు వినియోగించు కునేవారని తెలిపారు. పామర్రు – దిగమర్రు (165వ) జాతీయ రహదారి విస్తరణలో భాగంగా వాటిని తొలగించడంతో నిత్యం వివిధ పనుల కోసం, విధులు నిర్వహణ కోసం మండవల్లి నుంచి కైకలూరు, గుడివాడ, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లుతున్న గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్ షెల్టర్ లేకపోడంతో రహదారి పక్కన బస్సుల కోసం ప్రయాణికులు ముఖ్యంగా వృద్ధులు గంటల కొద్ది ఎండలో నిలబడలేక తీవ్ర అవస్థలు పడవలసి వస్తుందని వాపోయారు. కావున జిల్లా కలెక్టర్, జాతీయ రహదారి ఉన్నత అధికారులు స్పందించి చెరువు సెంటరు, రైల్వేస్టేషన్ రోడ్డు వద్ద బస్ షెల్టర్ నిర్మించాలని భాజపా మండల ప్రధాన కార్యదర్శి యర్రంశెట్టి శ్రీనివాసరావు, బండి దివాకర్, మాజీ వార్డు సభ్యులు గుడివాడ మురళీ, నాయకులు నల్లమోతు వేణు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పలువురు గ్రామస్థులు అధికారులను కోరారు.

## అమరావతి ఛాంపియన్ సెలక్షన్స్ 7 నియోజకవర్గాలలో

**భీమవరం, జూలై 20 ప్రభాతవార్త** జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా




అమరావతి ఛాంపియన్షిప్ నియోజకవర్గ సెలక్షన్ ట్రైల్స్ జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశాల ప్రకారం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అధికారి మోహన్ దాస్ అన్నారు. అండర్ 17 అండర్ 23 విభాగాల్లో 12 12 రకాల ఆటల్లో నియోజకవర్గ సెలక్షన్ ట్రైన్స్ నిర్వహించబడతాయి అన్నారు. భీమవరం నియోజకవర్గ లో జూలై 25వ తేదీ ఎమ్మార్ కే జడ్పీహెచ్ఎస్ స్కూల్ వీరవాసరం లో 9 గంటల నుండి ,పిడి బివి శ్రీనివాస్ ఫోన్ నెంబర్ 90 326 324 32 ఉండి నియోజకవర్గం జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ బాయ్స్ ఆకివీడు వీడులో 27వ తేదీ 9 గంటల నుండి సెలక్షన్ ట్రైన్స్ నిర్వహిస్తారు. పిడిజీవి కృష్ణంరాజు 99 51 75 9389 తణుకు జడ్. పి. హెచ్. ఎస్ బాయ్స్ స్కూల్ 28వ తేదీన 9 గంటల నుండి సెలక్షన్ ట్రైల్స్ నిర్వహిస్తారు. పిడి సూర్య 9989 363978 తాడేపల్లిగూడెం గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ 29వ తేదీ 9 గంటల నుండి సెలక్షన్ ట్రైల్స్ నిర్వహిస్తారు డి ఆర్ ఎస్ టి శేఖర్ పిడి ఫోన్ నెంబర్ 98 66 83 400 2 ఆచంట నియోజకవర్గం జడ్. పి. హెచ్. ఎస్ స్కూల్ మార్టేరు 30వ తేదీ 9 గంటల నుండి సెలక్షన్ ట్రైన్స్ ప్రారంభిస్తాను.. పిడి జిఎస్ఎస్ ప్రసాద్ రెడ్డి ఫోన్ నెంబర్ 9490 888 99 9 పాలకొల్లు నియోజకవర్గం బిఆర్ఎం విఎంహెచ్ఎస్ స్కూలు పాలకొల్లు 31వ తేదీ జూలై 9 గంటల నుండి సెలక్షన్ ట్రైన్స్ ప్రారంభిస్తారు పిడి రవిబాబు ఫోన్ నెంబర్ 9246 0 430 29 నరసాపురం నియోజకవర్గ జడ్పిహెచ్ఎస్ స్కూల్ మొగల్తూరు 31వ తేదీ 9 గంటల నుండి సెలక్షన్ ట్రైన్స్ ప్రారంభిస్తారు. పిడి కేబి శేఖర్ ఫోన్ నెంబర్ 79 81 98 6545 పశ్చిమగోదావరి జిల్లాలో నియోజకవర్గ సెలక్షన్స్ ట్రైల్స్ కి అటెండ్ అయ్యే ప్రతి ఒక్క క్రీడాకారుడు క్రీడా యాప్ లో లింక్ ద్వారా గాని ఆన్లైన్ లో తమ ఆధార్ ఓటిపి తో లింక్ అయ్యి ఏదైనా ఒక క్రీడలో తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా పశ్చిమగోదావరి జిల్లా క్రీడా అధికారి ఎన్మోహన్ దాస్ తెలిపారు.

## ఘనంగా అన్న సమారాధన

**పెనుమంట్ర, జూలై-20, (ప్రభాతవార్త):** మండలం మార్టేరు గ్రామంలో వెలసిన శ్రీ శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 112వ సంబర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన భారీ అన్న సమారాధన ఘనంగా జరిగింది. వందలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ సభ్యులు స్వయంగా పర్యవేక్షించి, ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవాలు విజయవంతమైనందుకు ఉచ్చ కమిటీ అధ్యక్షులు పిచ్చుక మహేష్ అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కె. భద్రరావు, కె. సాయికుమార్, పి. పూర్ణవర ప్రసాద్, కె. సాయి, అశోక్ తదితర కమిటీ సభ్యులు ఏర్పాట్లను దగ్గరుండి చూసుకుని భక్తులకు సేవలందించారు.




## స్కంద షష్టి సందర్భంగా సుబ్బారాయుడికి అభిషేకాలు



**అత్తిలి, జూలై 20 (ప్రభాత వార్త )** అత్తిలిలో ప్రసిద్ధి చెందిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయంలో స్కంద షష్టి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాలు, పండ్ల రసాలతో విశేష అభిషేకాన్ని నిర్వహించారు. స్వామివారి ని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ అభిషేక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఐలూరి రామం, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ జరిపారు.

## రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తా

### -ఎమ్మెల్సీ గోపి మూర్తి బొర్రా



**భీమవరం టౌన్, జూలై 20 : ప్రభాతవార్త** విశ్రాంత ఉద్యోగుల సమస్యలను మండలి లో ప్రస్తావిస్తూ పరిష్కారానికి కృషి చేస్తాననిఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ(పిడిఎఫ్) ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపి మూర్తి మాట్లాడు తూ తాను నిత్యం అందరికీ అందుబాటులో ఉంటానని, ప్రజా జీవితంలో తనకు ప్రత్య ర్థులు ఉండరని, సమస్యలే తనప్రత్య ర్థులు, అజెండా అని గోపి మూర్తి వెల్లడిం చారు. భీమవరంలోని యుటిఎఫ్ ఆఫీసులో రిటైర్డ్ ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక లు ఏకగ్రీవంగా జరిగాయి. ఎన్నికల అధికా రిగా రాష్ట్ర సంఘ కార్యదర్శి నాగినేని నారా యణరావు సహాయ ఎన్నికల అధికారిగా ఆర్గనైజింగ్ కార్యదర్శి డి. సుబ్బారావు, పరి శీలకులుగా రాష్ట్ర సంఘ ప్రధాన కార్య దర్శి బి. లోవ కుమార్ వ్యవహరించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు యు వి పాండురంగా రావు సమావేశానికి హాజరై మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సేవలను గతంలో పొందిన తాము వర్తమాన ఉద్యోగులుగా తమ సేవలను అందించేందుకు ఎల్లవేళలా సిద్ధమని, తమ సేవలను వినియోగించుకో వాలని సూచించారు. పశ్చిమగోదావరి రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నూతన అధ్యక్షులుగా గాతల జేమ్స్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సాగిరాజు సత్యనారాయణ రాజు, కోశాధికారిగా కె. వి కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా డాక్టర్ పి ఎస్ ప్రతాపరాజు , ఎం జోబ్ బాబు, ఉపాధ్యక్షులుగా అల్లూరి గాంధీ బాబు రాజు, బి. ప్రవీణ్ రాయ్, డాక్టర్ ఎస్ అప్పలరాజు, సిహెచ్ నరసింహరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా వి ఎస్ అప్పారావు, పాకలపాటి సీతారామరాజు, కార్యదర్శులుగా టి సత్యనారాయణ రెడ్డి, పి కాశి విశ్వనాథం , రాయుడు పెద్దిరాజు, వేగేశ్న భారతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని రిటైర్డ్ ఉద్యోగులు, ఉద్యోగులు, శ్రేయోభిలాషులు అభినందించారు.

## స్మశాన వాటిక అభివృద్ధి కోరుతూ ఎమ్మెల్యే పితాని వినతి



**పెనుమంట్ర, జూలై-20, (ప్రభాతవార్త)** మండలంలోని నెగ్గిపూడి గ్రామపంచాయతీ పరిధిలోని వనంపల్లి ప్రాంత స్మశాన వాటికను అన్ని మౌలిక వసతులతో అభివృద్ధి చేయాలని కోరుతూ స్థానిక ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు వనంపల్లి యువత, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. స్మశాన వాటికలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో అంత్యక్రియల నిర్వహణలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్మశానానికి ప్రహరీ గోడ, అంతర్గత రహదారి, షెడ్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి సౌకర్యం, కాలవపై కాలిబాట, స్నానాలకు రేవు, పారిశుధ్య నిర్వహణతో పాటు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకునే విధంగా అభివృద్ధి చేయాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారం కోసం యువత, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఒక్కటై ముందుకు రావడం అభినందనీయమన్నారు. స్మశాన వాటిక అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

## రిజిస్ట్రేషన్ ప్రైవేట్ సేవా కేంద్రాల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి నూజివీడు లో దస్తావేజులేఖరుల పెన్డౌన్



**నూజివీడు, జులై 20 ప్రభాతవార్త:** రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యకలాపాలు అన్నింటిని ప్రైవేటు పరం చేసి సర్వీసు కేంద్రాల ఏర్పాటు దిశగా ఆలోచిస్తున్న కూటమి ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని నూజివీడు సబ్ రిజిస్టర్ పరిధిలోని దస్తావేజులేఖరులు, స్టాంప్ వెండర్స్ డిటిపి ఆపరేటర్స్ , సహాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పెన్డౌన్ కార్యక్రమంలో భాగంగా వారు సోమవారం నాడు నూజివీడు సబ్ రిజిస్టర్ కార్యాలయం దగ్గర ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ అలి అబ్బాస్. కె. అనసూయ, మోహన్ రాజు, వాకాసోమేశ్వరరావు తదితరులు ప్రసంగిస్తూ కూటమి ప్రభుత్వం ఆలోచిస్తున్న రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ద్వారా ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదన్నారు. కీలకమైన భూ రికార్డులన్నీ భద్రతకు నోచుకోక ప్రజల ఆస్తులు గాలిలో దీపంలా మారే అవకాశాలు ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తరతరాలుగా కొనసాగుతున్న దస్తావేజులు లేఖరుల వ్యవస్థకు జీవో నెంబర్ 396 ముప్పుగా వారు అభివర్ణించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం కూడా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నిర్వహించాలని తలపెట్టడంపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు జరిగాయని గుర్తు చేశారు దాని ఫలితాన్ని ఆ ప్రభుత్వం అనుభవించిందని కూటమి ప్రభుత్వం కూడా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటును ఆమోదిస్తే ఆ ప్రభావాన్ని ఎన్నికల్లో చూడవలసి ఉంటుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజు లేఖరుల సంఘం నాయకులు మహమ్మద్ అలి అబ్బాస్, అనసూయ, మోహన్ రాజు, పంద్రంగి రవి, త్రినాద్, సందీప్ వాకా సోమేశ్వరరావు, బేబేశ్వరరావు పుష్ప, రాజేశ్వరి, ఉమా, మహేష్, అయ్యంకి రవి, తదితరులు పాల్గొన్నారు.

## పీజీఆర్ఎస్ వెలవెల...!

### -నలుగురు అధికారులు మాత్రమే హాజరు



**పెనుమంట్ర, జూలై-20, (ప్రభాతవార్త)** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పెనుమంట్ర మండలంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 22 శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా, సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్‌కు కేవలం నలుగురు అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారుల జాడ కనిపించలేదు. వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలనే ఆశతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గంటల తరబడి తహసీల్దార్ కార్యాలయం ఎదుట వేచి ఉండాల్సి వచ్చింది. కొందరు అధికారులు కూడా నిర్ణీత సమయానికి కాకుండా ఆలస్యంగా రావడంతో ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన వేదికకే సంబంధిత అధికారులు గైర్హాజరు కావడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. ఇకనైనా మండల స్థాయి అధికారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ పీజీఆర్ఎస్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరై ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇండస్ట్రియల్ పార్కులలో బీసీ , ఎస్.సీ , ఎస్.టి. వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించాలి!!

**-బిజెపి జనతా వారధి ద్వారా ప.గో.జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీమతి కల్పశ్రీ కి వినతిపత్రం**



**భీమవరం, జూలై 20 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనతా వారధి కార్యక్రమంలో భాగంగా జిల్లా కన్వీనర్ తోట గంగ రాజు, రాష్ట్ర మీడియా ప్రతినిధి ఉన్నమట్ల కపర్ది నేతృత్వంలోని ప్రతినిధి బృందం జిల్లా జాయింట్ కలెక్టర్ కల్పశ్రీ కి ప్రభుత్వ భూములతో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులలో బీసీ , ఎస్.సీ , ఎస్.టి.వర్గాలకు సముచిత భాగస్వామ్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందించింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జిల్లా జనతా వారధి కన్వీనర్ తోట గంగ రాజు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వం స్టాండ్-అప్ ఇండియా,,పి ఎం ఈ జి పి ఎం ఎస్ ఎం ఈ పథకాలు ద్వారా ప్రోత్సాహకాలు, మూలధన సబ్సిడీలు, వడ్డీ రాయితీలు ఇవ్వడంతో పాటు బీసీ , ఎస్ సీ , ఎస్ టి ఫైనాన్స్ కార్పొరేషన్ల ద్వారా అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ భూములతో అభివృద్ధి చెందుతున్న ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కుల్లో కూడా సామాజిక న్యాయం ప్రతిబింబించేలా స్పష్టమైన విధానాలు అమలు చేయాలని, భూమి ధరలో రాయితీ, మూలధన సబ్సిడీ, వడ్డీ సబ్సిడీ, విద్యుత్ రాయితీలు, స్టాంప్ డ్యూటీ మినహాయింపు, బ్యాంకు రుణాలకు ప్రభుత్వ హామీ వంటి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి, ప్రతి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్కులో బీసీ , ఎస్ సీ , ఎస్ టి పారిశ్రామిక వేత్తలకు ప్రత్యేకంగా పారిశ్రామిక ప్లాట్లు/షెడ్లు కేటాయించి ప్రోత్సహించాలని ప్రభుత్వాన్ని కోరారు. బిజెపి రాష్ట్ర మీడియా ప్రతినిధి ఉన్నమట్ల కపర్ది మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధిని వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఉపాధి అవకాశాలు కల్పించేలా నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని, వాటి ద్వారా కలిగే ప్రయోజనాలు కూడా సమాజంలోని అన్ని వర్గాలకు సమానంగా అందేలా ప్రభుత్వం ప్రత్యేక విధానాలను రూపొందించడం అవసరం ఉన్నందున జనాభాలో అధిక శాతం ఉన్న బీసీ , ఎస్ సీ , ఎస్ట్ వర్గాలు ఇప్పటికీ పారిశ్రామిక యాజమాన్యం, భారీ పెట్టుబడులు, పరిశ్రమల స్థాపన వంటి అంశాల్లో తగిన స్థాయిలో భాగస్వామ్యం పొందలేక పోతున్నాయి. మూలధన కొరత, బ్యాంకు రుణాల లభ్యతలో సమస్యలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అవకాశాలు మరియు పారిశ్రామిక అనుభవం కొరత వంటి కారణాల వల్ల ఈ వర్గాలు వెనుక పడుతున్నందున ఆయా వర్గాలను ప్రోత్సహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనతా వారధి కో కన్వీనర్స్ ఇంజేటి వెంకటేశ్వర్లు, గాదిరాజు వెంకటేశ్వర రాజు, గున్నేపల్లి పుల్లాజి, అడబాల శివ, చెరుకూరి కృష్ణంరాజు, ప్రసాదం ఏడుకొండలు, కర్రి బ్రహ్మానంద రెడ్డి, బి. హెచ్.సుబ్బరాజు, చెన్నంశెట్టి నాగరాజు, శ్రీనివాస్, మల్లేశ్వర రావు, ములపాక వెంకటేశ్వర రావు,తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి..

**-రైతన్న కన్నీళ్లు తుడవాలి**




**వేలేరుపాడు,జూలై 20 (ప్రభాత వార్త):** పెదవాగు ప్రాజెక్టు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సుమారు 200 మంది కార్యకర్తలతో ధర్నా నిర్వహించారు. పార్టీ డివిజన్ కార్యదర్శి కట్ట ముత్యాలరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడుతూ,ప్రాజెక్టు తెగిపోయి రెండేళ్లు గడుస్తున్నా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు పునర్నిర్మాణంపై నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. ప్రాజెక్టు దెబ్బతినడంతో సుమారు 3 వేల ఎకరాల్లో సాగు నిలిచిపోయి రైతులు తీవ్ర నష్టాలు చవిచూస్తున్నారని, అప్పుల పాలవుతున్నారని తెలిపారు. గ్రామాల్లో పెదవాగులో నీరు లేక తాగునీటి సమస్య కూడా తీవ్రంగా మారిందన్నారు. ఇకనైనా ప్రభుత్వాలు స్పందించి వెంటనే ప్రాజెక్టు నిర్మాణ పనులు ప్రారంభించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డల ముత్యాలరావు, కట్ట వీరాస్వామి,ఊకే బుచ్చయ్య, కాశి లక్ష్మయ్య, కట్టం రాంబాబు, మిడియం ధర్మయ్య, మోసం రాజారావు, ఇందూరి శ్రీనివాసరావు,ఎస్.కే. మున్ని, కట్టడం రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య సేవల విస్తరణ ట్రస్ట్ లక్ష్యం

**భీమవరం టౌన్, జూలై 20 : ప్రభాతవార్త** అల్లూరి సీతారామరాజు భగత్‌సింగ్ సేవా విజ్ఞాన కేంద్రం ట్రస్టు సమావేశం మెంటేవారి తోట సుందరయ్య భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం, ట్రస్టు సెక్రటరీ జె.ఎన్.వి గోపా లన్, వసుధ ఫౌండేషన్ భీమవరం కో ఆర్డి నేటర్, రిటైర్డ్ డి.ఇ.ఒ ఇందకూరి ప్రసాద రాజులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ట్రస్టు ఆద్వర్యంలో సేవా కార్యక్రమాలు విస్త రింపజేయాలని, ఉచిత మెడికల్ క్యాం పులు పట్టణంలో పలు చోట్ల నిర్వహించే విధంగా నిర్ణయించామన్నారు. ట్రస్టు ఆద్వ ర్యంలో మెంటేవారితోట సుందర య్య భవ నంలో ఉచిత డయాగ్నస్టిక్ సెంటర్, ఉచిత వైద్య సహాయ కేంద్రం గత 4 సంవ త్సరాలు గా నిర్వహిస్తున్నారు. భవి ష్యత్‌లో వసుధ ఫౌండేషన్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎస్ ఎల్ జి హాస్పిటల్స్, కొత్త పల్లి కోదండ రామగాం ధీరాజు మరియు ఇతర దాతలు సహాయ సహకారాలతో వైద్య, ఆరోగ్య, ఇతర సేవ లను మరింత విస్తరణ చేయడమే లక్ష్యం అని ట్రస్టు ఛైర్మన్ బి.బలరాం అన్నా రు. ఈ నెల 28వతేదీన సుందరయ్య భవ నంలో జరిగేచిన్నపిల్లల ఉచిత గుండె మెడి కల్ క్యాంపుని మరియు 29వతేదీన మెంటే వారితోటలో నిర్వహించే ఉచిత జనరల్ మెడికల్ క్యాంపుని అందరూ వినియోగిం చుకోవాలని కోరారు. ఈ క్యాంపునందు అవసరముగు పేషెంట్లకు ఉచిత మెడిసిన్ అందిస్తున్నామన్నారు.

## మన డబ్బులు మన లెక్కలు యాప్ ను సద్వినియోగం చేసుకోండి తెదేపా ఎస్సీ సెల్ నేత రాము




**చాట్రాయి, జులై 20,ప్రభాతవార్త** డ్వాక్రా మహిళలందరూ మన డబ్బులు మన లెక్కలు అనే యాప్ ను డౌన్లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము అన్నారు. మండలంలోని చనుబండ శివారు సూరంపాలెం గ్రామంలోని శ్రీ చైతన్య ఈవోలో 34 గ్రూపులు ఉండగా యాక్టివ్ గా ఉన్నాయని సక్రమంగా పని చేస్తున్నట్లు చెప్పారు. సోమవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించగా మన డబ్బులు మన లెక్కలు యాప్ ను అందరూ డౌన్లోడ్ చేసుకొని గ్రూపు యొక్క లావాదేవీలు తెలుసుకునే విధంగా ఉండాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి వి పోతురాజు,బుక్ కీపర్ గుడిమల్ల కిరణ్ కుమారి,డ్వాక్రా గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

## సమస్యలు సత్వరమే పరిష్కారం

**- తాహసిల్దార్ శ్వేత**



**చాట్రాయి, జూలై 20 ప్రభాతవార్త** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న పి జి ఆర్ ఎస్ లో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని సమస్యలు సత్వరమే పరిష్కరించుకోవాలని తహసిల్దార్ శ్వేత చెప్పారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన పిజి ఆర్ ఎస్ లో ఆరు అర్జీలు వచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ట్రాన్స్ కో ఏ. ఈ సంజయ్ తదితరులు పాల్గొనగా అర్జీలు సమర్పించారు.

## వైఎస్సార్ సిపి పార్టీకి వెన్నుముక యుగంధర్

**-వైఎస్సార్ సిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన యుగంధర్ ను అభినందించిన మండలి చైర్మన్ మోషేన్ రాజు, నియోజక వర్గ ఇన్ ఛార్జ్ వెంకట్రాయుడు**



**భీమవరం జులై 20 ప్రభాతవార్త** వైఎస్సార్ సిపి పార్టీ బలోపేతానికి కోడే యుగంధర్ అందిస్తున్న సేవలు ఎనలేనివని, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా యుగంధర్ నియమితులు కావడం హర్షించదగ్గ విషయమని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు, భీమవరం నియోజకవర్గ ఇన్ ఛార్జ్ చినిమిల్లి వెంకట్రాయుడు అన్నారు. వైఎస్సార్ సిపి రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులైన యుగంధర్ ఆదివారం మండలి చైర్మన్ మోషేన్ రాజు, ఇన్ ఛార్జ్ వెంకట్రాయుడు లను మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పూల బోకే లను అందించి సత్కరించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం ఎల్లపుడూ ఉంటుందని, పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని అన్నారు. వైఎస్సార్ సిపి పార్టీకి ఎన్నో విధాలుగా తన సేవలను అందిస్తున్న యుగంధర్ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా నియమితులు కావడం భీమవరం నియోజక వర్గానికి మరింత బలం చేకూరినట్లే అన్నారు. ఇచ్చిన పదవి బాధ్యతలు చిత్తశుద్ధిగా నిర్వర్తించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షులు గాదిరాజు రామరాజు, తిరుమాని నరసింహ స్వామి, సైదు శ్రీనివాస్, కే శ్రీనివాస్ రావు, ఆళ్ల నాగరాజు, బి సునీల్, బడుగు అశోక్ కుమార్, ధర్మ, పాల శ్రీను, కోడె శ్రీధర్, సూరిబాబు, అర్ ఎస్ ఆర్, పతివాడ శేషు, త్రిమూర్తులు, చిగురుపాటి రాజు, కే పరమేశ్వరరావు, కడలి సురేష్ తదితరులు పాల్గొని యుగంధర్ ను అభినందించారు.

## మనబడి--మన భవిష్యత్తు పనులపై సమీక్ష సమావేశం

**ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలి: ఎంపీడీవో త్రిశూలపాణి**



**మొగల్తూరు, జూలై 20 (ప్రభాతవార్త):** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న 'మనబడి--మన భవిష్యత్తు' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండలంలోని ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేయాలని మొగల్తూరు ఎంపీడీవో సి. హెచ్. త్రిశూలపాణి సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ అరటికట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మండలంలో 'మనబడి--మన భవిష్యత్తు' కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న పనులను తిరిగి ప్రారంభించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అదనపు అభివృద్ధి పనులు అవసరమైన పాఠశాలలను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమం విజయవంతం కావాలంటే ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరస్పర సమన్వయంతో పనిచేసి అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మండల డీఎల్‌డీఓ, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, మండల స్థాయి ప్రధానోపాధ్యాయులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ శాఖ సమస్యల పరిష్కారం కోరుతూ నిరవధిక పెన్‌డౌన్ ప్రారంభం



**మొగల్తూరు, జూలై 20 (ప్రభాతవార్త)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డాక్యుమెంట్ రైటర్స్ అండ్ లైసెన్స్ స్టాంప్ వెండర్స్ సంక్షేమ సంఘం పిలుపు మేరకు మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట సోమవారం నుంచి నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జి.ఓ. నెం.396ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లైసెన్స్ డాక్యుమెంట్ రైటర్లు, స్టాంప్ వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల హక్కులను కాపాడాలని కోరారు. ప్రజలకు చట్టపరమైన భద్రత కల్పించడంతో పాటు లైసెన్సుదారుల సేవలను కొనసాగించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే లైసెన్సుల నవీకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, లైసెన్సు రుసుములు, షరతుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే వరకు నిరవధిక పెన్‌డౌన్ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కొల్లాటి వెంకటేశ్వరరావు. దొంగ రాజేశ్వరరావు. కడలి త్రిమూర్తులు. శిలబోయిన సత్యనారాయణ తిరుమణి ముత్యాలరాజు. తిరుమని తాతారావు. కడలి చంద్రశేఖర్. తదితరులు పాల్గొన్నారు

## రెవెన్యూ కార్యాలయం రోడ్డులో మట్టి మాఫియా జోరు

**-ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు.. చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్**



**మొగల్తూరు, జూలై 20 (ప్రభాతవార్త):** మొగల్తూరు రెవెన్యూ కార్యాలయం రోడ్డులో అక్రమ మట్టి రవాణా రోజురోజుకూ పెరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. భారీ వాహనాల నిరంతర రాకపోకలతో రహదారి దెబ్బతింటోందని, ఎగిసిపడుతున్న దుమ్ముతో ప్రయాణికులు, సమీప నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు తెలిపారు. అక్రమ మట్టి తవ్వకాలు, రవాణా కారణంగా ప్రభుత్వానికి ఆదాయ నష్టం కూడా వాటిల్లుతోందని పేర్కొన్నారు. ఈ విషయమై విలేజ్ రెవెన్యూ అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదని స్థానికులు వాపోయారు. ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు. ఇప్పటికైనా రెవెన్యూ, గనుల శాఖ, పోలీసు అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ మట్టి తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే జోక్యం చేసుకుని మట్టి మాఫియాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

## కాళ్ళకూరు వెంకన్నకు రూ.1,23,456/- లు విరాళం



**కాళ్ల, జూలై 20( ప్రభాతవార్త)** కాళ్ళకూరు స్వయంభూః శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాడవీధులు విస్తరణకు అన్నదాన భవనము అభివృద్ధికిదాతల సహకారం అభినందనీయమని దేవాలయ పాలకవర్గ అధ్యక్షులు అద్దాల శివరామరాజు అన్నారు. శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మాడవీధులు విస్తరణకు స్థలం కొనుగోలు నిమిత్తం ఆనందపురంకు చెందిన ఉద్దరాజు శ్రీనివాసరాజు-సుజాత దంపతులు, వారి కుమార్తెలు, ముదునూరి జ్యోతి- సాయి శశి వర్మ , ఇసుకుపల్లి తేజ-రాఘవేంద్ర వర్మలు రూ. 1,23,456/-విరాళాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ కుమార్, ఆలయ ధర్మకర్తల మండలిఅధ్యక్షులు అద్దాల శివరామరాజులకు అందజేశారు. ఈ సందర్భంగా శివరామరాజు మాట్లాడుతూ ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో విరాళం అందించిన దాతలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో, ఆలయ ధర్మకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. దాతలను అభినందించి వారికి స్వామి వారి శేష వస్త్రం ప్రసాదములు, వేద ఆశీర్వచనం అందజేశారు.

## పి. ఎం. ఫసల్ భీమా యోజన పథకం రైతులు వినియోగించు కోవాలి :కలెక్టర్ నాగరాణి



**భీమవరం జూలై 20 ప్రభాతవార్త** రైతులకు పకృతి వైపరీత్యాలు వల్ల కలిగే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఫసల్ బీమా యోజన కు సంబంధించిన వాల్ పోస్టను సంబంధిత శాఖల అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని ప్రతి అర్హత కలిగిన రైతు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతు సంక్షేమ దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం రైతులకు పంటల విషయంలో భరోసా కల్పిస్తుందని సూచించారు వాతావరణ మార్పులు అధిక వర్షాలు వరదలు తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలు కారణంగా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేలా ఈ బీమా పథకాన్ని రూపొందించారని తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి వరి నిమిత్తం అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం లో భాగంగా ఖరీఫ్ సీజన్ కు ఎకరానికి రూ. 210 ఇన్సూరెన్స్ చేసుకున్నట్లయితే పకృతి వైపరీత్యాలు వంటి వచ్చి పంట నష్టం జరిగినప్పుడు రూ. 42,000 లు బీమా మొత్తం పొందవచ్చునని అన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రైతులు తమ సాగు చేసిన పంట కు ఆగస్టు 15వ తేదీ (చివరి తేదీ )లోపు భీమా నమోదు చేసుకోవాలని సూచించారు. భీమ నమోదుకు బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, భూమి పాసుబుక్ జిరాక్స్, పంట వేసినట్టు రైతు స్వయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్ వంటి పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామస్థాయిలో రైతులకు ఈ పథకం గురించి అవగాహన కల్పించే ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్ కల్పశ్రీ, డిఆర్ఓ పి ప్రభాకర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగేంద్రప్రసాద్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పుష్కరాల ఏర్పాట్లు పై నివేదికలు సిద్ధంచేయండి :జె. సి. కల్పశ్రీ




**భీమవరం 20 జూలై ప్రభాతవార్త** రాబోయే గోదావరి పుష్కరాల ఏర్పాట్లు, నిధుల మంజూరుపై నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ కె ఆర్. కల్పశ్రీ అన్నారు. సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ నుండి పుష్కరాల ఏర్పాట్లపై పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, ఎండోమెంట్స్, ట్రాన్స్పోర్ట్ మున్సిపల్ శాఖల అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ కె. ఆర్. కల్పశ్రీ వీడియో కాన్ఫిడెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని గౌరవ ముఖ్యమంత్రి ఆదేశించిన నిబంధనల ప్రకారం, గతంలో చేపట్టిన పనుల పురోగతిపై "యాక్షన్ టేకెన్ రిపోర్ట్" ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిధిలో గుర్తించిన మొత్తం 34 పుష్కర ఘాట్లలో మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరయ్యాయి వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఏయే ఘాట్‌కు ఎంత మొత్తం నిధులు మంజూరయ్యాయి, పనుల అంచనా వ్యయం, ప్రస్తుత స్థితిపై పూర్తి నివేదికను సిద్ధం చేయవలసినదిగా తెలియజేశారు. జిల్లాలో ఎంపిక చేయబడిన 34 పుష్కర ఘాట్లకు సంబంధించి మంజూరైన నిధులు, పనుల పురోగతి ఘాట్ల వారీగా కల్పిస్తున్న సౌకర్యాల వివరాలన్నింటినీ అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ సూపర్ మెంట్ సోమశేఖర్, జిల్లా టూరిజం అధికారి అప్పారావు, దేవాదాయ ఇరిగేషన్ ట్రాన్స్పోర్ట్ ఏపీఎస్ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గుర్రపు డెక్క నుండి కంపోస్ట్ ఎరువు తయారుతో స్వయం సమృద్ధి


**--జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.**

**భీమవరం జులై 20 ప్రభాతవార్త** గుర్రపు డెక్క నుండి కంపోస్ట్ ఎరువు తయారు చేసి



స్వయం సహాయక సంఘాలు ఆర్థిక పరిపుష్టి చెందిలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సంబంధిత అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఎంపీడీవోలు, ఎన్ ఆర్ జి ఎస్ ఏపీవోలు, డిఆర్డిఏ ఏపీఎంలు, వివోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో గుర్రపు డెక్క సేకరణలో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అన్నారు. ప్రస్తుతం రెడీగా ఉన్న వర్మీ కంపోస్టును 50 కేజీల బస్తాలు తయారుచేసి అమ్మకాలకు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. మరల ఆగస్టు 15లోగా యూనిట్లలో గుర్రపు డెక్కన్ నింపి వర్మీ కంపోస్టును తయారీకి సిద్ధంగా ఉంచాలని అన్నారు. ప్రతి మంగళ, బుధవారం దీనిపై వీసీలు ద్వారా సమీక్ష చేస్తానని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లాలో 8 మండలాల్లో, 17 గ్రామాలలో కంపోస్ట్ ఎరువును తయారు చేయడం జరుగుతుందని అన్నారు. కంపోస్ట్ ఎరువులు తయారు విధానంలో అధికారులు ఎవరు అలసత్వం వహించవద్దని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్డిఏ పిడి వేణుగోపాల్, డ్వామా పిడి డా. సి. హెచ్ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ పుట్ట మహేష్ కుమార్ నాయనమ్మకు నివాళి



**జంగారెడ్డిగూడెం జులై 20 ప్రభాత వార్త** ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్ నాయనమ్మ పెద్దకర్మ సందర్భంగా కడప జిల్లా పొద్దుటూరులోని వారి స్వగృహంలో నివాళు లర్పించారు. ఎంపీ నాయనమ్మ చిత్రపటానికి జంగారెడ్డిగూడెం జడ్పిటిసి పోల్నాటి బాబ్జి, జనసేన నాయకులు తిరుమలశెట్టి రవి, జనసేన పట్టణ వైస్ ప్రెసిడెంట్ బాధరాల నరేష్, కటారి వాసు, పులి శివ, అభిరామ్ మరియు కూటమి నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఎంపీ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## షైనింగ్ స్టార్స్ అవార్డుల ను అందుకున్న శ్రీ విద్యా స్కూలు విద్యార్థులు.



**లింగపాలెం జూలై 20( ప్రభాత వార్త)** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన షైనింగ్ స్టార్స్ అవార్డ్ ను శ్రీవిద్య హై స్కూల్ ధర్మాజీ గూడెం 2025-26 విద్యా సంవత్సరం లో 10 వ తరగతి లో 577 మార్కులతో మండలంలో తృతీయ స్థానంలో నిలిచిన పామర్తి. ఫణి లిఖిత్ కుమార్ ఎంపిక అవ్వగా, ఈరోజు సి.ఆర్. రెడ్డి కాలేజీలో జరిగిన అవార్డ్ బహుకరణ కార్యక్రమంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి. రాధాకృష్ణయ్య గారు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని. ప్రభాకర్ గారు, జిల్లా కలెక్టర్ గారు మరియు డి.ఈ.ఓ గారి చేతుల మీదుగా అవార్డ్ అందుకోవటం జరిగినది. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ . రత్నాకర్ రావు సిహెచ్ మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**-అదనపు ఎస్ పి విశ్వనాథ్ --నేటి పోలీసు "పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం" కు 13 అర్జీలు**




**భీమవరం జులై 20 ప్రభాతవార్త** జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం లో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (మీకోసం)లో అదనపు ఎస్పీ డి. విశ్వనాథ్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. బాధితుల సమస్యలను విని సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ జరిపి, నిర్ణీత గడువులోగా చట్టపరమైన శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశతో పోలీసు కార్యాలయాలను ఆశ్రయిస్తారని, అటువంటి బాధితులకు పోలీసు శాఖ వెన్నుముకగా నిలిచి భరోసా కల్పించాలని అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యంగా ఫిర్యాదులు మరల మరల పునరావృతం కాకుండా ఉండాలంటే, మొదటి విడతలోనే లోతైన దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు. విచారణలో జాప్యం వహించకుండా, పారదర్శకమైన పద్ధతిలో సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో భీమవరం డీఎస్పీ రఘువీర్ విష్ణు, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ కె.వి.వి.ఎన్ సత్యనారాయణ ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాద బాధితునికి నాయకర్ ట్రస్ట్ సాయం



**నరసాపురం రూరల్ జూలై 20 ప్రభాత వార్త** నరసాపురం మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్త పోలిశెట్టి జోగింధర మురళీధర్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ఆదేశాల మేరకు, నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ సునీత నాయకర్ పోలిశెట్టి జోగింధర మురళీధర్ నివాసానికి స్వయంగా వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా పోలిశెట్టి జోగింధర మురళీధర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే, చికిత్సకు అయ్యే ఆసుపత్రి ఖర్చులు ముఖ్యమంత్రి సహాయ నిధి (జవీ=ఖీ) ద్వారా మంజూరు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని సునీత నాయకర్ కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా సహాయం అందేలా శ్రీ బొమ్మిడి నాయకర్ గారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పైడికొండల కృష్ణ, కర్రా శ్రీను, గ్రంధి శ్రీనివాస్, రేవు ప్రభుదాస్, కొప్పాడ కృష్ణవేణి, బందెల భారతి, ఒడుగు వల్లి, ట్రస్ట్ కార్యదర్శి పెమ్మాడి కిరణ్, సూర్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## పోలవరం యడవల్లి రోడ్డు నిర్మించారు

**కాజ్ వే నిర్మాణం మరిచారు**





**ప్రభాతవార్త, చాట్రాయి** పోలవరం నుండి యడవల్లి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండగా ఎన్నో ఏళ్ల నుండి బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజల ఎట్టకేలకు పూర్తి అయింది. బీటీ రోడ్డు నిర్మాణానికి నాడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం హయాంలోనే పంచాయతీరాజ్ శాఖ ద్వారా 1.90 కోట్లు నిధులు మంజూరు చేయడంతో ఇటీవలే రోడ్డు నిర్మాణం పూర్తి కాగా ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొంతమేర సిమెంట్ రోడ్డు నిర్మాణం అయినప్పటికీ సుమారు మూడు కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులు పొలం నుండి తీసుకురాటానికి అష్ట కష్టాలు పడగా నేడు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటుగా అదే రోడ్ లో తమ్మిలేరు కాలవ పై కాజ్ వే నిర్మాణం చేయాలని ప్రజలు రైతులు కోరుతున్నప్పటికి పాలకులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ్మిలేరు కాలవపై కాజ్ వే నిర్మాణం జరిగితే జిల్లా కేంద్రమైన ఏలూరు వెళ్లేందుకు సుమారు ఏడు గ్రామాల ప్రజలకు ఎంతగానో ప్రయోజనం ఉంటుందని దీనిపై మంత్రి పార్థసారథి దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. పోలవరం రైతులకు తమ్మిలేరుకు కాలువకు అవతలి వైపున భూములు ఉండటంతో వ్యవసాయ ఉత్పత్తులు ఇంటికి చేర్చుకునేందుకు నానా అవస్థలు పడుతున్నామని రైతులు బోరున విలపిస్తున్నారు. ఇప్పటికైనా కాజ్ వే నిర్మాణం పూర్తి చేయాలని మండలంలోని ఏడు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.